

SHRIRAM CITY
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
ఫోన్: 040-30915112
www.shriramcity.in

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



SPEEDY GOLD LOAN
మీ బంగారు ఆభరణాలపై తక్షణమే రుణం
నెలకు వడ్డీ* కేవలం 95 పైసలు మాత్రమే
ప్రతి గ్రాముపై అత్యధిక రుణం
SHRIRAM CITY
MONEY WHEN YOU NEED IT MOST
040-30915112 SCUF GOLD to 54999 MISSED CALL

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 99 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శుక్రవారం • 9-3-2018 | www.manamnews.com | /manamnews



మా కోటా మాకివ్వండి

- రాజ్యసభలో గళమెత్తిన మహిళా ఎంపీలు
- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చ
- మహిళా సాధికారత తక్షణావసరం
- సుమిత్రా మహాజన్

7లో..

దావూద్ అనుచరుడి అరెస్టు

- 1993 ముంబై పేలుళ్లలో నిందితుడు
- దుబాయ్ పారిపోయిన ఫరూఖ్ టక్లా
- అక్కడి నుంచి డిపోర్టేషన్.. ఢిల్లీలో అరెస్ట్

7లో..

ఎంబీసీలకూ సబ్సిడీ రుణం

ఎస్సీ, ఎస్టీలతో సమానంగా అమలు

లక్ష రూపాయల రుణానికి 80% సబ్సిడీ



- 1-2 లక్షల రుణం వరకు 70%
- 2-12 లక్షల అప్పువరకు 60%
- ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం
- పీజీ వైద్యులకు సర్కారు ఊరట
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయక్కర్లేదు
- 'ఏడాది' నిబంధన ఎత్తివేత
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు
- ఈ ఏడాది నుంచే అమలులోకి

హైదరాబాద్, మార్చి 8 (మనం ప్రతినిధి):

అత్యంత వెనుకబడిన తరగతు(ఎంబీసీ)లకు సీఎం కేసీఆర్ వరం ప్రకటించారు. స్వయం ఉపాధి పథకాలకు ఆర్థిక సహకారం అందించే రుణాలపైఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే విధంగానే ఎంబీసీలకు కూడా సబ్సిడీలు ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఫైలుపై సీఎం కేసీఆర్ గురువారం సంతకం చేశారు. గత బడ్జెట్‌లో ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించామని, వచ్చే బడ్జెట్‌లోనూ భారీగా మిగతా 6లో..



కార్యక్రమంలో నటుడు ఆకాశ్ పూరి, నటి నేహాశెట్టి

'అద్వితీయం' అమోఘం

టీకేఆర్ కాలేజీలో ఘనంగా సైన్స్‌ఫెయిర్

అతిథులుగా నటుడు ఆకాశ్‌పూరి, నటి నేహా శెట్టి

'మనం' దిన పత్రిక ఆధ్వర్యంలో నిర్వహణ

బాలాపూర్, మార్చి 8 (మనం న్యూస్): విద్యార్థుల్లో సృజనను వెలికి తీసేందుకు 'మనం' దిన పత్రిక చేస్తున్న కృషి అమోఘమని పలువురు ప్రశంసించారు. హైదరాబాద్ మిగతా 6లో..

ఇదీలోకం!



మిగతా రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తే బాగుండేది..!



వి-హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ తదితరులు

టీ హబ్‌లా వీహబ్ ఎదగాలి

దేశానికే గుర్తింపు తేవాలి

- మహిళలకు సర్కారు అండ
- పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: కేటీఆర్
- ఘనంగా వీ హబ్ ప్రారంభోత్సవం
- పాల్గొన్న టెస్సీ థామస్, వాణి కోలా
- వింగ్స్ ఇండియా షో ప్రారంభం

హైదరాబాద్, మార్చి 8 (మనం ప్రతినిధి):

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ హబ్(వీహబ్)ను రాష్ట్ర ఐటీ శాఖ మిగతా 6లో..



ఎడాపెడా.. రాజీనామా

కేంద్రమంత్రి పదవులకు అశోక్, సుజనా గుడ్‌బై





- ప్రధాని నరేంద్ర మోదీకి లేఖల అందజేత
- ఏపీలో కామినేని, పైడికొండల రాజీనామా
- ముఖ్యమంత్రిని కలిసి లేఖల అందజేత
- నాలుగు రాజీనామాలకు తక్షణ ఆమోదం

న్యూఢిల్లీ/అమరావతి, మార్చి 8 (మనం ప్రతినిధి):



కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలని ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోగానే.. ఇటు రాష్ట్ర మంత్రివర్గంలోని బీజేపీ మంత్రులిద్దరూ రాజీనామా చేసేశారు. మరోవైపు కేంద్రంలో ఉన్న తెలుగు మంత్రులు ఇద్దరూ కూడా తమ రాజీనామా లేఖలను ప్రధానికి ఇచ్చారు. మొత్తం నలుగురి రాజీనామాలు ఆమోదం పొందాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీలు పూసపాటి అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. వారి మిగతా 6లో..

సీఎం కేసీఆర్ రాజ్యాంగ ద్రోహి

రాష్ట్రానికి పట్టిన అవినీతి చీడ.. తుగ్లక్ కంటే పిచ్చిగా పాలన

- ఇచ్చిన హామీలలో అమలైనవెన్ని?
- సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయ్
- వచ్చేది మా ప్రభుత్వమే
- నాలుగేళ్ల దోస్తీ.. ఇప్పుడు ఆరోపణలా
- థర్డ్ ఫ్రంట్ ఓ స్టంట్
- బస్సుయాత్రలో ఉత్తమ్

6లో..





మనం 5కె రన్

'కుటుంబం'లో..



ఆమె.. అబల కాదు సబల

- పౌరసరఫరాలలో మహిళలు కీలకం: సీవీ ఆనంద్

హైదరాబాద్, మార్చి 8 (మనం ప్రతినిధి): నేటి సమాజంలో మహిళలు, పురుషులతో సమానంగా ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. తమ శాఖలో మహిళల పాత్ర అద్వితీయమని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పౌరసరఫరాలలో చేపట్టిన సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయంటే ఇందులో మహిళా ఉద్యోగులే కీలకమని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కుల విషయంలో మౌనం వహించకూడదన్నారు. డిమాండ్ చేసి హక్కులు సాధించుకోవాలన్నారు. ఆమె.. అబలకాదు సబల అని నిరూపించుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఉద్బోధించారు.

ఈ నెల 12 నుంచి అసెంబ్లీ

- పటిష్ఠంగా ఏర్పాట్లు చేయాలి
- సమీక్షలో స్పీకర్, చైర్మన్ ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 8 (మనం ప్రతినిధి): ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశాల నిర్వహణ, భద్రతపై ఉన్నతాధికారులతో స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ సమావేశాలు విజయవంతంగా కొనసాగడంలో అధికారులు కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ఈసారి కూడా అలాగే దృష్టిపెట్టాలని సూచించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉభయ సభల సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దన్నారు. సమీక్షలో మండలి డిప్యూటీ చైర్మన్ విద్యాసాగర్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ సెక్రటరీ నర్సింహాచార్యులు, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, 2 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.





అవార్డులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్, మంత్రులు

ఆడపడుచులకు అవార్డులు

- 20 మందికి పురస్కారాలు ప్రధానం

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 20 మంది మహిళలకు ప్రభుత్వం నగదు పురస్కారం, అవార్డులను అందజేసింది. ఇక్కడి లలిత కళాతోరణంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అవార్డులు, రూ.లక్ష నగదు పురస్కారాన్ని తెలంగాణ ఆడపడుచులకు అందజేసి అభినందించారు. కవిత దరియాణి, అరుణారెడ్డి, సత్యలక్ష్మి, సౌమ్య నాగపురి, లతాజైన్, చక్రవర్తుల లక్ష్మీనరసింహ, మంజులా శ్రీనివాస్, నిత్య సంతోషిణి, కవితా దేవుష్కర్, నందినీరెడ్డి, ఝాన్సీ, ఎడునూరి పద్మ, రాజ్యలక్ష్మి, మెట్రో రైలు తొలి లోకో పైలట్ సుప్రియ, ఢిల్లీ ఆర్టీసీ డ్రైవర్ సరిత, యాప భద్రమ్మ, జయమ్మ, కొత్తపల్లి సర్పంచ్ శైలజ, రమాదేవిలు అవార్డులు అందుకున్నారు.

సత్ప్రవర్తన తల్లితోనే సాధ్యం

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): మహిళలు అన్నిరంగాల్లో విజయవంతంగా రాణిస్తున్నారని, వారికి కావాల్సిన హక్కులను సాధించుకుంటున్నారని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రవీందర్ అన్నారు. టీపీటీఎఫ్, హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తిరుమలగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులకు బోధన కంటే వారి ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చేందుకే ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమాజంలో కొంతమంది యువత ఆకృత్యాలకు అనేక కారణాలున్నప్పటికీ.. వాటి ప్రభావం నుంచి తప్పించి సత్ప్రవర్తన వైపు నడిపించే అవకాశం కేవలం తల్లికే ఉంటుందన్నారు. కొడుకును తల్లి ఇంట్లో ప్రేమతో కాకుండా బాధ్యతతో పెంచాలని, సమాజం లోని ప్రతి స్త్రీని గౌరవించేలా కొడుకును పెంచితే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులుగా మాతృమూర్తుల దినోత్సవం నిర్వహిస్తూ కౌన్సెలింగ్ చేసే కార్యక్రమాల దిశగా టీపీటీఎఫ్ మహిళా కార్యకర్తలు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.గౌతమి నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ వి.సుజాత, ప్రధానోపాధ్యాయులు విశ్వజ్యోతి, చాముండేశ్వరి, మండలాల బాధ్యులు లావణ్య, రూపవతి, గీత, సుష్మ, దేవిక, అరుణభారతి, ప్రభావతి, నిర్మల, జిల్లా కార్యదర్శులుశాస్త్రి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

- ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి విజయలక్ష్మి

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): కేంద్రంలోని బీజేపీ మహిళా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు మహిళలు పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం, భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్డీయే అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు అవుతున్నా భేటీ బచావో- భేటీ పడావో పథకాలు నినాదాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం మహిళలు, బాలికలకు సంబంధించిన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధిస్తుండడంతో, బాలికల విద్య, వైద్యం లాంటి సేవలకు గండిపడిందన్నారు. టీఆర్ఎస్ పాలనలో మహిళలపై లైంగికదాడులు పెరిగాయని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ కౌన్సిల్ అధ్యక్షురాలు పోటు కళావతి ఆరోపించారు. సైబర్ నేరగాళ్లను కఠినంగా శిక్షించే చట్టాలు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రకటన

దిగువ వివరించిన కారణాలపై ఈ దిగువ మల్టీ సిస్టం ఆపరేటర్లకు మూడు వారాలు తరువాత కొన్ని లేదా అన్ని ఛానల్స్ (సిఎన్‌బిసి టివి18, సిఎన్‌బిసి ఆవాజ్, సిఎన్ఎన్ న్యూస్ 18, న్యూస్ 18 ఇండియా, సిఎన్‌బిసి బజార్, సిఎన్‌బిసి టివి 18 ప్రైమ్ హెచ్‌డి, న్యూస్18 కేరళ, న్యూస్18 తమిళనాడు, న్యూస్18 అస్సాం/నార్త్ ఈస్ట్, హిస్టరీ ఛానల్, ఎఫ్‌వైఐటివి18, హిస్టరీ ఛానల్ (హెచ్‌డి), ఐబిఎన్ లోక్‌మత్, కలర్స్, ఎంటివి, రిష్తే, నిక్, విహెచ్1, సోనిక్, కామెడీ సెంట్రల్, నిక్ జూనియర్, కలర్స్ ఇన్ఫినిటీ, ఎంటివి బీట్స్, రిష్తే సినీప్లెక్స్, కలర్స్ సూపర్, కలర్స్ హెచ్‌డి, కలర్స్ ఇన్ఫినిటీ హెచ్‌డి, కామెడీ సెంట్రల్ హెచ్‌డి, విహెచ్1 హెచ్‌డి, నిక్ హెచ్‌డి+, కలర్స్ మరాఠి హెచ్‌డి, కలర్స్ బంగ్లా హెచ్‌డి, కలర్స్ కన్నడ హెచ్‌డి, ఎంటివి బీట్స్ హెచ్‌డి, ఎంటివి హెచ్‌డి+, సినిప్లెక్స్ హెచ్‌డి, కలర్స్ గుజరాతి, కలర్స్ మరాఠి, కలర్స్ బంగ్లా, కలర్స్ కన్నడ, కలర్స్ ఒరియా, ఈటివి ఉత్తర్‌ప్రదేశ్ ఉత్తరాంచల్, ఈటివి ఎంపి ఛత్తీస్‌ఘడ్, ఈటివి రాజస్థాన్, ఈటివి ఉర్దూ, ఈటివి బీహార్ జార్ఖండ్, న్యూస్18 కన్నడ, ఈటివి న్యూస్ బంగ్లా, ఈటివి హర్యానా/హిమాచల్‌ప్రదేశ్, ఈటివి న్యూస్ గుజరాతి, ఈటివి న్యూస్ ఒడియా) అను ఛానల్స్ యొక్క ప్రసారాలు నిలిపివేయబడునని సబ్‌స్క్రైబర్లందరికీ ఇందుమూలంగా తెలియజేయడమైనది.

క్ర. సం.	మల్టీ సిస్టం ఆపరేటర్ పేరు	డిస్‌కనెక్షన్ కారణాలు	ప్రదేశములు
1	ఆరాధ్య ఎంటర్‌ప్రైజెస్	బాకీలు చెల్లింపులు చేయనందుకు & ఎస్ఎంఎస్ రిపోర్టులు దాఖలు చేయనందుకు	అరసపల్లి గ్రామం, మాచిప్ప గ్రామం, మాణిక్ భండార్ గ్రామం, మక్లూర్ మండలం & గ్రామాలు, సారంగపూర్ గ్రామం, నిజామాబాద్, మాధవనగర్ గ్రామం, ధర్మారం గ్రామం, సారంగపూర్ గ్రామం, జానకంపేట గ్రామం, బోర్గాం గ్రామం, నిజామాబాద్ టౌన్ మరియు మండలం గ్రామాలు మరియు మామిడిపల్లి గ్రామం.
2	వెంకటసాయి మీడియా ప్రైవేట్ లిమిటెడ్	బాకీలు చెల్లింపులు చేయనందుకు & ఎస్ఎంఎస్ రిపోర్టులు దాఖలు చేయనందుకు	విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం, బొబ్బిలి, విజయవాడ, అనకాపల్లి, రాజాం, కంకిపాడు, యలమంచిలి, నూజివీడు, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జనగాం, ద్రాక్షారామం, కడప, వెలంగి, తుని, సాలూరు, పార్వతీపురం, అన్నవరం, పిఠాపురం, ఏలేశ్వరం, కశింకోట, నర్సీపట్నం, ఆమదాలవలస, నర్సరావుపేట మరియు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫేజ్ 3 ఏరియాలు.

పైన తెల్పిన ఎంఎస్ఓలు సేవలు అందించబడే అన్ని ఏరియాలకు విఘాతం కలుగగలదు.

ప్రజా శ్రేయస్సు దృష్ట్యా జారీ చేసిన వారు టివి 18 బ్రాడ్‌కాస్ట్ లిమిటెడ్

పై: ఇండియా కాస్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్,

703, 7వ అంతస్తు, హెచ్‌డిఐఎల్- కాలేడోనియా, విజయ్‌నగర్ ఎదురుగా, సహార్ రోడ్డు, అంధేరి (తూర్పు), ముంబాయి-400 069

కేంద్రంలో మహిళలకు పట్టం

- రాజకీయ సమానత్వం బీజేపీ ఘనతే
- రక్షణ మంత్రిగా మహిళకు సారథ్యం
- వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీదే పీఠం
- పొత్తుల్లేవ్.. ఒంటరిగానే పోటీ చేస్తాం
- రాష్ట్ర సర్కారుకు మహిళలపట్ల చిన్నచూపు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వెల్లడి



హైదరాబాద్, మార్చి 8 (మనం ప్రతినిధి): మహిళలు ఏ పని తలపెట్టినా.. నిజాయితీగా, నిబ్బరంగా, నైపుణ్యంగా పూర్తి చేస్తారని, మహిళా దినోత్సవం ఒక్క రోజుకే పరిమితం కాకూడదని, రాజకీ యాల్లోనూ మహిళలకు సమభావం రావాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బీజేపీలో మూడోవంతు పదవులు మహిళలకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ మహిళా మోర్చ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అత్యధిక మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న పార్టీ బీజేపీ అని, నిర్మలా సీతారామన్, సుష్మాస్వరాజ్, సుమిత్రా మహజన్, హర్ సిమ్రత్ కౌర్ బాదల్ వంటి పలువురు మహిళలకు కేబినెట్‌లో అవకాశం కల్పించిన ఘనత కేవలం మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. దేశంలో మొట్టమొదటిసారి ప్రధాని నరేంద్ర మోది హయాంలో రక్షణ మంత్రిగా ఓ మహిళ ఉండడం దేశం హర్షించ తగ్గ విషయమని చెప్పారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బీజేపీకే సాధ్యమని పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించేందుకు చర్యలు చేపట్టి మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింప చేశారన్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేసీఆర్, తమ కుటుంబ స్వార్థంకోసం ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ రెండు పార్టీలుకూడా పాపాల పుట్టలని, కేసీఆర్ రాజకీయ జీవితం ప్రారంభమైంది కాంగ్రెస్ నుంచేనని లక్ష్మణ్ విమర్శించారు. ఇక్కడే చేతకాని కేసీఆర్ ఢిల్లీ వెళ్లి రాజకీయలు చేస్తాననడం శోచనీయమని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆడ పిల్లలు ఉన్న వారికి ఆదుకోనే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇంకోక అడుగు ముందుకువేసి, సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆదుకోవడానికి ముందుకు వచ్చిందని, అయితే 10 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లల పేరుపై నెలకు కేవలం వెయ్యి రూపాయల చొప్పున 14 సంత్సరాలు కడితే, అమ్మాయి పెండ్లికి రూ. 6.5 లక్షల ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మోది పభుత్వం బేటీ బచావ్ బేటీ పడావ్ నినాదంతో ముందుకు పోతుందన్నారు.

జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన

జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సంగారెడ్డిలో బీజేపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన చేయడం అనందంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము ఒంటరీగా పోరాడతామని, ఎవ్వరితో పోత్తులు ఉండవని స్పష్టంచేశారు.

ఆ అధికారమిస్తే దేశం విచ్ఛిన్నం: శేషగిరిరావు

రిజర్వేషన్ల నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తే దేశం విచ్ఛిన్నమవుతుందని బీజేపీ సీనియర్ నేత, ప్రొఫెసర్ ఎస్వీ శేషగిరిరావు తెలిపారు. టీఆర్ఎస్ సర్కారు డిమాండ్‌కు తలొగ్గితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా రిజర్వేషన్లు మారుతాయని తెలిపారు. దీనివల్ల వైషమ్యాలు పెరుగుతాయని, కొట్లాటలు జరుగుతాయన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వొద్దని రాజ్యాంగంలో పేర్కొన్నారని ఆయన తెలిపారు.

రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్‌గా గుత్తా

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్టు గురువారం తెలంగాణ ప్రభుత్వం జీవో జారీచేసింది. ఈ సమితిని కంపెనీ చట్టం-2013 సెక్షన్ 8 ప్రకారం నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌గా రిజిస్ట్రేషన్ చేయించింది. సమితి నిబంధనలను అనుసరించి మొట్టమొదటి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి, కమిషనర్ జగన్‌మోహన్, ఉద్యానవన శాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామిరెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ జి.లక్ష్మిబాయి, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సాయిప్రసాద్ నియమితులయ్యారు.

తెలంగాణ సర్కారు తీరు దేశానికే ఆదర్శం

- కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్దరాజు

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం జర్నలిస్టు లోకాన్ని ఆదుకుంటున్న తీరు దేశానికే ఆదర్శమని కర్నాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు ప్రశంసించారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, మీడియా అకాడమీని అభినందిస్తూ ఒక లేఖ రాశారు. తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ జర్నలిస్టులకు రూ.100 కోట్ల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌ను అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రాజెక్టును కోమటిబండ, కాళేశ్వరం ప్రాజెక్టును సుందిళ్ల బ్యారేజీలు అద్భుతమని కొనియాడారు. సంక్షేమ నిధి-పాత్రికేయుల పెన్నిధి ద్వారా అర్ధాంతరంగా మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ. 1 లక్ష, అనారోగ్యం లేదా ప్రమాదాల బారిన పడిన జర్నలిస్టులకు 50 వేల ఆర్థిక సహాయం చేస్తున్నారని చెప్పారు.

బీసీ మహిళలకూ సబ్ కోటా: కృష్ణయ్య




బీసీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ సిటీ, మార్చి 8(మనం ప్రతినిధి): మహిళాబిల్లులో బీసీ మహిళలకు సబ్-కోటా కల్పించినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం బీసీభవన్‌లో మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వన్నాడి రమ్య అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే మహిళ బిల్లులో బీసీ మహిళలకు జనాభా ప్రకారం సబ్-కోటా ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళ బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నామన్నారు. బీసీలంటే ఇంత చిన్న చూపు ఎందుకని.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో మొక్కుబడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నించారు. జనాభాలో సగం ఉన్న బీసీ మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. ఈ దేశాన్ని అభివృద్ధి పరచాలని, అగ్రదేశంగా చూడాలనే ప్రతి భారతీయుడు రాగద్వేషాల కతీతంగా అన్ని కులాల అభివృద్ధి కోరుకోవడం అనివార్యం కాని దురదృష్టవశాత్తు బీద కులాల వారిని, అభివృద్ధి చెందిన కులాల వారు పైకి రానియ్యకుండా కులకోణంలో చూస్తూ అసూయతో అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దేశాన్ని అభివృద్ధి పరచాలని అందుకుగాను రాగద్వేషాల కతీతంగా ప్రతి కులాన్ని అభివృద్ధి పరచాలనే జాతీయ, విశాల దృక్పథాన్ని ప్రతి ఒక్కరు పెంపొందించుకోవలసిన అవసరం ఉందని ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ దిశగా పార్టీపరంగా ప్రజలలో ఈ విధమైన మానసిక పరివర్తనను ప్రత్యేకంగా అగ్రకులాలలో తీసుకురావలసిన బాధ్యత పార్టీలపైన, ప్రభుత్వాలపైన ఉందని కృష్ణయ్య అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, పగిళ్ల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా ఆగ్రా

- యూపీ ప్రభుత్వంతో శ్రీఇన్ ఫ్రా ఒప్పందం



హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): ప్రతిష్టాతక్మ పర్యాటక, సెలవు విహార కేంద్రంగా ఆగ్రాను తీర్చిదిద్దేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో శ్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ లిమిటెడ్ అడ్వయిజరీ విభాగం ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ప్రతిపాదనతో యూపీలో సుమారు రూ.25వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముందని శ్రీ ఇన్‌ఫ్రా అడ్వయిజరీ విభాగం, యూపీ ప్రభుత్వ మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధి విభాగం తెలిపింది. ఈ మేరకు అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగినట్టు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా శ్రీ అడ్వయిజరీ సీనియర్ అడ్వయిజర్ డాక్టర్ రతిరంజన్ మండల్ మాట్లాడుతూ తాజ్‌మహల్ ఏటా లక్షలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తోందన్నారు. దానికి అనుగుణంగా ఆగ్రాను తీర్చిదిద్దే బాధ్యత తమపై ఉందన్నారు. తాజ్‌మహల్‌తో పాటు ఆగ్రా నగరాన్ని అన్నిరకాల పర్యాటకులకు విశిష్ట పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆగ్రా చారిత్రాత్మక, సాంస్కృతిక, వారసత్వ ఆకృతుల ప్రాముఖ్యం పెంచడంతో పాటు ఇప్పటివరకు వెలుగులోకి రాని కట్టడాలు, ఆలయాలను ప్రాచుర్యంలోకి తీసుకురానున్నట్టు పేర్కొన్నారు.

కందూరు బ్రహ్మోత్సవాల్లో అపశృతి

- కోనేరులో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

అడ్డాకల్, మార్చి 8(మనం న్యూస్): మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకల్ మండలంలోని రామలింగేశ్వర స్వామి కందూరు జాతర బ్రహోత్సవాల్లో విషాదం జరిగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు కుటుంబంతో సహా వచ్చిన ముగ్గురు యువకులు కోనేరులో మునిగి మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎనుగొండ గ్రామానికి చెందిన ఆంజనేయులు(19), పవన్(24), రవికుమార్(28) గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆలయానికి వచ్చారు. వీరు ముగ్గురు అన్నదమ్ములు. ఒకే కుటుంబానికి చెందినవారు. ముగ్గురు కోనేరులో స్నానానికి దిగారు. వీరిలో ఆంజనేయులు కోనేరు లోపలికి వెళ్లాడు. అతనిని కాపాడేందుకు అతని సోదరులైన పవన్, రవికుమార్ ప్రయత్నించారు. ఈ క్రమంలో ముగ్గురు నీటిలో మునిగి ప్రాణాలు వదిలారు. కోనేరులో నీరు తక్కువగా ఉందని, బురద ఎక్కువగా ఉందని అందువల్లే యువకులు బయటకు రాలేకపోయారని స్థానికులు చెప్పారు. యువకులు నీటిలో మునిగి పోతుండగా వారి తండ్రి కేశవులు నీళ్లలోకి వెళ్లే ప్రయత్నించగా స్థానికులు అతనిని అడ్డుకున్నారు. మృతుల్లో ఒకరైన రవికుమార్‌కు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. పవన్‌కు భార్య ఉంది. అడ్డాకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విరాళాలు సేకరిస్తున్న సురవరం సుధాకర్‌రెడ్డి

విగ్రహాల కూల్చివేత సరికాదు

మతోన్మాద శక్తులపై ఉద్యమం చేయాలి: సురవరం

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): లెనిన్, పెరియార్, అంబేద్కర్ వంటి మహనీయుల విగ్రహాల కూల్చివేతను సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ఖండించారు. ఏప్రిల్‌లో జరుగనున్న సీపీఐ తెలంగాణ మహా సభల నిర్వహణకు చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మతోన్మాద శక్తులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను కట్టడి చేసేందుకు ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. విదేశీయుల విగ్రహాలు అవసరంలేదన్న బీజేపీ నేతల వ్యాఖ్యాలను ఆయన ఖండించారు. గాంధీ, అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయుల విగ్రహాలు అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. అంబేద్కర్, పెరియార్, లెనిన్ విగ్రహాలను కూల్చివేతపై ప్రధాని స్పందించకపోవడం దారుణమన్నారు. కలకత్తాలో శ్యాంప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని కూల్చివేశాకే ప్రధాని స్పందించారని తెలిపారు. సీపీఐపై ప్రజల్లో అభిమానం ఉందని, స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తుండడం ఆనందంగా ఉందని సురవరం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ నగర కార్యదర్శి ఇ.టి నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంభనతోనే మహిళాభివృద్ధి

- సింగరేణి ఈడీ కిషన్‌రావ్

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): ఆర్థిక స్వావలంభనతోనే మహిళాభివృద్ధి సాధ్యమని సింగరేణి కాలరీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్ అండ్ కోల్ మూమెంట్) బి. కిషన్‌రావ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం మహిళలు పురుషులతో పాటు అనేక రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళల సంక్షేమానికి ఇరవై ఏళ్లుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ తరపున మహిళలకు 25 రకాల వృత్తి శిక్షణ కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నామన్నారు. సింగరేణి భవన్‌లో మహిళా ఉద్యోగులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లైజన్ అధికారి కె. భూమారెడ్డి, మహిళా ప్రతినిధులు రాధా మాధవి, షాలెంకుమారి, జ్యోతి, ఏజీఎం పర్సనల్ టీపీఏ. ప్రేమ్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ దుండే వెంకటేశం. డాక్టర్ శేషగిరిరావ్, సీనియర్ కమ్యూనికేషన్ అధికారి గణాశంకర్ పూజారి పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి...

ఇద్దరు బాలికల ఆత్మహత్య

హైదరాబాద్, మార్చి 8: పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అపార్ట్‌మెంట్‌లో ఎనిమిదో అంతస్తు నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పోలీసు స్టేషన్ పరిధి సరూర్‌నగర్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. సరూర్‌నగర్ రోడ్డులోని టీఎన్ఆర్ అపార్ట్‌మెంట్ 8వ అంతస్తు పైనుంచి సావని, భార్గవి పటేల్ అనే బాలికలు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బాలికలు ఇద్దరూ స్థానికంగా అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. భార్గవి కుటుంబం టీఎన్ఆర్ అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తులో నివాసముంటుంది. కంబైన్డ్ స్టడీ కోసమని చిత్ర లే అవుట్‌లో నివాసముండే తన స్నేహితురాలు సావనిని భార్గవి ఇంటికి పిలిచింది. వీరిద్దరూ మంచి స్నేహితులు. భార్గవి తండ్రి వ్యాపారం చేస్తుంటారు. సావని తండ్రి డిఆర్‌డీఎల్‌లో ఉద్యోగి. కాగా, విద్యార్థినుల ఆత్మహత్యకు కారణం తెలియలేదు.

ప్రతి మహిళా ఓ బహుముఖ ప్రజ్ఞాశాలి

- **మహిళల కోసం నవ్‌దేవీ ఎగ్జిబిషన్**
- **నేటి నుంచి 21 వరకు నిర్వహణ: ఉదయ**

హైదరాబాద్, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నవ్‌దేవీ గ్రూప్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఉదయ చిలువేరు పేర్కొ న్నారు. అలయన్స్ ఫ్రాంకాయిస్‌తో కలిసి ఈ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటిని చక్కదిద్దడంలో, పిల్లలను పెంచడంలో.. ఇతరత్రా పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి మహి ళా బహుముఖ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఓ ప్రకటనలో వివరించారు. గృహిణిగా బాధ్యతలు మోస్తూ మరిచిపోయిన తన అభిరుచులను గుర్తుచేసేందుకు ఈ వేదిక ఓ చక్కని అవకాశమని తెలిపారు. ప్రతి మహిళా ఇంటిని చక్కదిద్దుకుంటూ, ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే ఖాళీ సమయాల్లో తనలోని సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. ఏ రంగంలో పనిచేస్తున్నా.. ఏ వయసు లోనైనా ఈ ప్రయత్నం ప్రారంభిచవచ్చని చెప్పారు. చిత్రలేఖనం, సంగీతం, నాట్యం.. రంగమేదైనా, అభిరుచి ఏదైనా ప్రపంచానికి తెలియజేసే వేదిక ఈ ఎగ్జిబిషన్ అని వివరించారు. తమ సృజనా త్మకతను, టాలెంట్‌ను ఈ నెల 9 నుంచి 21 వరకు జరిగే నవ్‌దేవీ వేదికపై ప్రదర్శించవచ్చని తెలిపారు. ఏఫ్ గ్యాలరీలో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 7:30 వరకు కొనసాగే ఈ ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులేనని ఉదయ చిలువేరు వివరించారు.



'మిలియన్ మార్చ్ స్ఫూర్తి'కి అనుమతి నో

- **నిరాకరించిన పోలీసులు.. నిర్వహిస్తామన్న కమిటీ**



హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): సీపీఐ, టీజేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. దీనిపై కోదండరాం, చాడ వెంకటరెడ్డి, చెరుకు సుధాకర్, తదితరులతో ఏర్పడిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి కమిటీ మండిపడింది. తెలంగాణ సాధనోద్యమంలో మిలియన్ మార్చ్ అత్యంత ముఖ్యమైన సంఘటన అని ఆ స్ఫూర్తిని కొనసాగించేందుకు ట్యాంక్‌బండ్‌పై శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని కమిటీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇది యావత్ తెలంగాణ ప్రజాభిప్రాయాన్ని తోసిపుచ్చడంగా భావిస్తున్నామని కమిటీ పేర్కొంది. పోలీసులు అనుమతించినా ఇవ్వకపోయినా స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించి తీరుతామని, నాటి పోరాటాన్ని గౌరవించి అనుమతించాలని కోరుతున్నామని ప్రకటనలో పేర్కొంది.

జూలై 15న టీఎస్ సెట్

- నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర- స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్(టీఎస్-సెట్) నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ గురువారం విడుదల చేసింది. అభ్యర్థులు మార్చి 14వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఏలాంటి ఆలస్యం రుసుం లేకుండా ఏప్రిల్ 14 వరకు గడువు ఇవ్వగా, రూ.1500 ఆలస్య ఫీజుతో ఏప్రిల్ 24 వరకు, రూ.2వేలు ఆలస్య ఫీజుతో మే 4వ తేదీ వరకు, రూ.3వేల లేట్ ఫీజుతో మే 15 వరకు గడువుగా పేర్కొంది. పరీక్షను జూలై 15న నిర్వహించనుంది. పూర్తి వివరాలను మార్చి 12వ తేదీ తర్వాత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణసెట్.ఓఆర్జీ. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఉస్మానియా.ఏసీ.ఇన్‌లో తెలుసుకోవచ్చు.

మహిళా సంక్షేమానికి కృషి

- బాలిక విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యం
- కేసీఆర్ కిట్స్‌తో తల్లీబిడ్డలకు అండ
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



హైదరాబాద్, మార్చి 8 (మనం ప్రతినిధి): మహిళా సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి ఆసరా పింఛను ఇచ్చే వరకు అన్ని స్థాయిల్లో ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. గర్భిణులు ప్రసవానికి మూడు నెలల ముందు, ప్రసవం తర్వాత మూడు నెలల పాటు పనుల్లోకి వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో నెలకు రూ.2వేలు చొప్పున మొత్తం రూ.12 వేలు అందిస్తున్నామన్నారు. ఆడపిల్ల పుడితే వెయ్యి రూపాయలు అదనంగా కలిపి 13 వేలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ దవాఖానాలో సురక్షిత ప్రసవం కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామని, ప్రసవం అనంతరం తల్లికి, బిడ్డకు కావాల్సిన వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అన్నారు. బాలికల విద్యను పోత్సహించేందుకు పెద్ద సంఖ్యలో గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల డ్రాప్ అవుట్స్ ఉండొద్దని 53 డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. బాలికల కోసం సకల వసతులతో కేజీబీవీలను నిర్వహిస్తున్నామన్నారు. మహిళల విదేశీ విద్యకు రూ. 20 లక్షలు ఉపకార వేతనాలిస్తున్నామన్నారు. పేదింటి ఆడపిల్ల పెండ్లికి కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పేరుతో రూ. 75,116 ఇస్తున్నామని, మహిళా బీడీ కార్మికులకు పెన్షన్, వితంతువులు, వికలాంగ మహిళలకు పింఛన్ ఇస్తూ ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మహిళలు నీటి కోసం ఇబ్బంది పడకూడదనే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లను ఇస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పేరును నిలబెడుతున్న క్రీడాకారిణులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇస్తూ వారిని బ్రాండ్ అంబాసిడర్లుగా చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని గుర్తు చేశారు. మహిళా భద్రతకు పెద్ద పీట వేస్తూ షీ టీమ్స్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

మొబైల్ సమస్యలకు 'మ్యూచువల్' పరిష్కారం

- హైదరాబాద్ టెకీల వినూత్న యాప్

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): మొబైల్ వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలను మ్యూచువల్ కాలర్ యాప్‌తో పరిష్కరించుకోవచ్చని ఎంటైర్ యాప్స్ ఫౌండర్ మునిపల్లె సాంబశివరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎంటైర్ యాప్స్ గురువారం మ్యూచువల్ కాలర్ ఆండ్రాయిడ్ యాప్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా కాల్ చేస్తున్న మొబైల్, కాల్ రిసివ్ చేసుకునే మొబైల్‌లో ఉమ్మడిగా ఉన్న కాంటాక్ట్స్‌ను గుర్తించి వాటి వివరాలను స్క్రీన్ మీద చూసుకోవచ్చన్నారు. ఉమ్మడి కాంటాక్ట్స్ సంఖ్య, రెండింటి వివరాలు తెర మీద కనపడతాయని, తద్వారా కాల్ చేసే అపరిచితుల వివరాలను నిర్ధారించడం సాధ్యమవుతుందని తెలిపారు. దీంతో పాటుగా మొబైల్ బ్యాటరీ డెడ్ అయినా, ఫోన్ వేరే ప్రాంతాల్లో మర్చిపోయినా.. మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లను తెలుసుకునే అవకాశం మ్యూచువల్ కాలర్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. వేరే ఏ మొబైల్‌ల్లోనైనా యాప్ ద్వారా లాగిన్ అయ్యి తమ ఫోన్‌లోని స్నేహితుల పేరు, నంబరు చూడొచ్చని వివరించారు. లాప్‌ట్యాప్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మ్యూచువల్ కాలర్.కామ్‌లో కాంటాక్ట్ సమాచారం పొందొచ్చని చెప్పారు. ఈ యాప్ మహిళలకు విశేషంగా ఉపయోగపడుతుందని, యాప్‌కు విశేష ఆదరణ లభిస్తుందన్న విశ్వాసముందని సాంబశివరావు చెప్పారు.

పేరుకే ఉద్యాన వర్సిటీ!

కానరాని పాలకమండలి.. తాత్కాలిక వీసీతోనే సాగింపు..అస్తవ్యస్తంగా వర్సిటీలో పాలన

- **అరకొరగా బోధన సిబ్బంది**
- **ఇప్పటికీ 48 పోస్టులు ఖాళీ**
- **పరిశోధనలు నిల్.. విద్యార్థుల వెతలు**
- **కొండా లక్ష్మణ్ వర్సిటీని వేధిస్తున్న సమస్యలు**



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించేందుకు కావాల్సిన ఆర్థిక సాయంతో పాటు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. ఒక్క వాణిజ్య పంటలే కాక.. సంప్రదాయ పంటల వృద్ధికి కంకణం కట్టుకుంది. వరి, పప్పు ధాన్యాలే కాక.. పండ్లతోటలు, పూలు వంటి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తేనే రైతులు ఆర్థిక పురోగతి సాధిస్తారనే ఉద్దేశంతో ఆ దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే 2014, డిసెంబరు0 23న కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని సిద్దిపేట జిల్లా ములుగులో ఏర్పాటు చేసింది. ఇక్కడ శాశ్వత భవనాలు నిర్మించేంత వరకు రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొనసాగించాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది.

వేధిస్తోన్న సిబ్బంది కొరత..

ఆచార్య కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో రాజేంద్రనగర్, మోజెర్ల(వనపర్తి జిల్లా) ఉద్యాన డిగ్రీ కాలేజీలతో పాటు మరో రెండు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఇవిగాక 11 చోట్ల ఉద్యాన పంటలైన పండ్ల తోటలు, పూలు, కూరగాయల పంటలకు సంబంధించిన పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా మోజెర్ల ఉద్యాన డిగ్రీ, పీజీ కాలేజీలో 220 మంది విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. వీరికి విద్య బోధించేందుకు కేవలం ముగ్గురు మాత్రమే శాశ్వత అధ్యాపకులుండగా, మిగతా వారందరినీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో కొనసాగిస్తూ ఏటా అకాడమిక్ ఇయర్‌ను నెట్టుకొస్తుండడం గమనార్హం. వాస్తవంగా ఈ కాలేజీ ఏర్పాటుకు 140 ఎకరాల స్థలం అవసరమవ్వగా, కేవలం 70 ఎకరాలను మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. ఫలితంగా ఉద్యాన వర్సిటీపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

అస్తవ్యస్థంగా వర్సిటీ పాలన..



ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఏండ్లు గడుస్తున్నా.. నేటి వరకు విశ్వవిద్యాలయానికి సంబంధించి శాశ్వత భవనాలను నిర్మించలేదు. విశ్వవిద్యాలయం కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించే వైస్‌ఛాన్సలర్, పాలకమండలిని ప్రభుత్వం ఇంతవరకు నియమించలేదు. ఫలితంగా వర్సిటీ పాలన అస్తవ్యస్థంగా తయారైంది. తాత్కాలిక వీసీగా ఉద్యానవనశాఖ ముఖ్య కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలు కావడంతో ఎక్కువ శాతం ఉద్యానవన శాఖ కార్యక్రమాలకే ఆయన పరిమితం అయ్యారు. దీంతో వర్సిటీలో ఎక్కడ సమస్యలు అక్కడే పడిఉన్నాయి. సరిపడా శాస్త్రవేత్తలు లేకపోవడంతో ఉద్యాన వర్సిటీని నుంచి రైతులకు ఏ విధమైనా సాయం అందడంలేదు. ఇంతవరకు రైతులకు కొత్త వంగడాలను అందించడం గానీ, పరిశోధనలు చేసి రైతులకు ఉపయోగపడే అంశాలను వెలుగులోకి తెచ్చిన ఘటనలు కానీ ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో జరగలేదు.

కానరాని పరిశోధనలు..

ఉద్యాన కోర్సులను చదివే విద్యార్థులకు తరగతి గదిలో బోధించే పాఠ్య పుస్తకాల్లోని అంశాల కంటే క్షేత్రస్థాయిలో సొంత అనుభవం ద్వారా నేర్చుకునేదే ఎక్కువగా ఉంటుంది. అందుకు కావాల్సిన ఏర్పాట్ల న్నింటినీ యూనివర్సిటీయే చూసుకోవాలి. ప్రధానంగా డిగ్రీ, పీజీ ఉద్యాన కోర్సుల్లోని విద్యార్థులు స్వయంగా పొలాన్ని తీసుకుని వివిధ వంగడాలను సాగు చేయాలి. అలా సాగు చేసిన సమయంలో ఏర్పడిన అవగాహన, పరిస్థితులను సమగ్రం అధ్యయనం చేసి ప్రాజెక్టులను సమర్పించాల్సి ఉంటుంది. కాలేజీల ఏర్పాటుకే భూములను సిద్ధం చేయని ప్రభుత్వం.. ఇక విద్యార్థుల సాగుకు భూములను ఏం సమకూరుస్తుంది. భూములు లేకపోవడంతో విద్యార్థులు స్వయంగా సాగు అనుభ వాలను తెలుసుకోలేకపోతున్నారు. సమీపంలోని రైతుల పంట పొలాల్లోకి వెళ్లి నామమాత్రంగా రైతులను అభిప్రా యాలు అడిగి రాసుకుని వచ్చి ప్రాజెక్టులను సమర్పి స్తు న్నారు. ఈ విషయం తెలిసినా.. వర్సిటీ అధికారులు ఏం చేయలేకపోతున్నారు. విద్యార్థులు కోర్సు పూర్తి చేశామని తాత్కాలికంగా ఆనందపడుతున్నా.. భవిష్య త్తులో ఆ మేరకు రైతులకు న్యాయం చేయలేరనేది మాత్రం అక్షర సత్యంగానే చెప్పాలి. దీనిపై వర్సిటీ అధికారులను ప్రశ్నించగా.. భూములను విద్యార్థులకు కేటాయిం చాల్సిన బాధ్యత కాలేజీలదే. అలా భూములు లేకపో వడంతో తప్పనిసరి పరిస్థితిలో విద్యార్థులు నామ మాత్ర పు రాతలతో ప్రాజెక్టులు అందిస్తున్నారు. ఇదీ తెలిసీ.. ఏం చేయలేని పరిస్థితిలో వర్సిటీ యంత్రాగం ఉంది.

48 పోస్టుల భర్తీ పూర్తయేదెన్నడో..

విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో 65 పోస్టులు వచ్చాయి. తదనంతర కాలంలో వీటికి తోడుగా మరో 48 పోస్టులను భర్తీ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే ఈ నియామక ప్రక్రియ నత్తతో పోటీ పడుతుందనే చెప్పాలి. ఈ పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి ఏడాది కాలం కావొస్తుంది. 2017 నవంబర్ నాటికి ఈ పోస్టులకు 410 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసు కున్నారు. వీరికి ఇంటర్వ్యూలు నేటికీ పూర్తి చేయ లేదు. వనపర్తి జిల్లా మోజర్లలోని ఉద్యాన కాలేజీలో 25 మంది శాశ్వత ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురు మాత్రమే శాశ్వత ప్రొఫెసర్లు ఉన్నారు.

హెచ్చరించిన ఐసీఏఆర్..

ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు వంటి వాటిపై పరిశోధనలు చేసేందుకు అఖిల భారత పరిశోధనా ప్రాజెక్టు కింద ప్రతి సంవత్సరం భారత వ్యవసాయ పరిశోధనా మండలి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తుంది. అందులో భాగంగానే కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీలో అనేక వంగడాలపై పరిశోధనలు జరగాల్సి ఉంది. అయితే అఖిల భారత పరిశోధనా ప్రాజెక్టులో భాగంగా కూరగాయలు, పండ్లు, పసుపు, పూలు వంటి పంటలపై పరిశోధనలు చేసేందుకు పది మంది శాస్త్రవేత్తలు ఉండాలి. కానీ ఈ వర్సిటీలో మాత్రం కేవలం ఐదుగురు మాత్రమే ఉండడం గమనార్హం. ఫలితంగా చాలా పంటలపై ఇప్పటివరకు వర్సిటీలో పరిశోధనలు జరిగిన దాఖాలాల్లేవంటే అతిశయోక్తి కాదు. ఈ విషయాన్ని గమనించిన పరిశోధనా మండలి.. మార్చి చివరి నాటికి అవసరమైన శాస్త్రవేత్తలను నియమించకపోతే.. సదరు పోస్టులను రద్దు చేస్తామని హెచ్చరించింది. టమాట, పసుపు పంటలకు సంబంధించిన వంగడాలు, విత్తనాలను ఉద్యాన వర్సిటీ అందించకపోతుండడంతో ఇతర రాష్ట్రాల నుంచి రైతులు తెచ్చుకుంటున్నారు.

మార్పు కోసమే థర్డ్ ఫ్రంట్

- **కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగిపోయారు**
- **అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే టాప్**
- **మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చాం**
- **ప్రాణమున్నంత వరకు టీఆర్ఎస్‌లోనే ఉంటా**
- **సోషల్ మీడియా కథనాలు అవాస్తవం**
- **భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు**




పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, క్యాంపు కార్యాలయం

గజ్వేల్, మార్చి 8(మనం న్యూస్): దేశ రాజకీయాల్లో మార్పు కోసమే మూడో ఫ్రంట్ అవసరం ఏర్పడిందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశ ప్రజలకు మేలు జరగాలంటే థర్డ్ ఫ్రంట్ అనివార్య మన్నారు. గజ్వేల్‌లో కొత్తగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీశ్ భవనాన్ని ప్రారంభించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల పాలనలో దేశం ఆర్థికంగా వెనుకబ డిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో కుంభకోణాల పాలన జరిగితే, బీజేపీ హయాంలో రాక్షస పాలన జరుగుతుందని విమర్శించారు. ఈ రెండు పార్టీల వల్ల ప్రజలు విసుగు చెందారని, దేశ ప్రజలకు మంచి జరగాలంటే ప్రత్యామ్నయ విధానం కలిగిన థర్డ్ ఫ్రంట్ అవసరమన్నారు. దేశ ఆర్థిక విధానాల్లో మార్పు రావాలనే సీఎం కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ప్రకటన చేశార న్నారు. అభివృద్ధిలో తెలంగాణ దేశంలోని ప్రథమ స్థానంలో ఉందన్నారు. తెలంగాణలో ఉన్నన్ని ప్రజాసంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలోను లేవన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. ఇందులో భాగంగానే రైతన్నలకు రూ. 4వేల నగదు పథకాన్ని ముఖ్యమంత్రి ప్రకటిం చారన్నారు. హరీశ్‌రావు టీఆర్ఎస్‌ను వీడుతున్నా రంటూ సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను ఆయన కొట్టిపారేశారు. ఆ వార్తల్లో నిజం లేదని, ప్రాణం ఉన్నంత వరకు టీఆర్ఎస్‌లోనే ఉం టానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండేందుకే నియోజ కవర్గాలకు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా క్షేత్రంలో ఎమ్మెల్యే ఉండడం వల్ల స్థానిక సమస్య లను గుర్తించే అవకాశముంటుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొదటిసారిగా నారాయణఖేడ్, గజ్వేల్ నియో జకవర్గాల్లో క్యాంపు కార్యాలయాలను నిర్మించడం జరిగిందని, ప్రజల సమస్యలను ఫిర్యాదుల రూపంలో స్వీకరించే ఓ అధికారిని ఈ కార్యా లయంలో నియమిస్తామని చెప్పారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభా కాంక్షలు తెలిపారు. మహిళలకు 33శాతం రిజ ర్వేషన్ కల్పించిన ఘనత టీఆర్ఎస్ ప్రభు త్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. అనంతరం జహీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాక ర్‌రెడ్డి, స్థానిక నేతలు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకు ప్రోత్సాహం

- **పెంపకానికి తెలంగాణ అనుకూలం**
- **త్వరలోనే వెదురు పరిశ్రమపై అధ్యయనం**
- **బాంబూ సొసైటీ ప్రతినిధులతో అటవీశాఖ భేటీ**



హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): చిన్న, సన్నకారు రైతులతో పాటు మేదరులకు ఆదాయ వనరుగా వెదురును మార్చాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వెదురు పరిశ్రమల ఏర్పాటు, రాష్ట్రంలో వెదురు లభ్యత వంటి అంశాలపై కేసీఆర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో గురువారం అరణ్యభవన్‌లో బాంబూ సొసైటీ ఆఫ్ ఇండియా సలహా మండలి వైస్‌చైర్మన్ ఆర్‌కేమెహతాతో సీఎం ఓఎస్డీ ప్రియాంకవర్గీస్, పీసీసీఎఫ్ పీకే ఝా, అదనపు అటవీ సంరక్షణ అధికారి ఆర్ఎం డోబ్రియల్, ఇతర అధికారులు సమావేశమయ్యారు. హరితహారంలో భాగంగా అడవుల బయట కూడా వెదురు పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలని అధికారులు నిర్ణయించారు. వెదురుకు మార్కెట్ సౌకర్యం కల్పనపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని భావించారు. ఈ సందర్భంగాఆర్‌కే మెహతా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో వెదురు పరిశ్రమ తీరు తెన్నులు, వివరించారు. వివిధ రాష్ట్రాల్లో వెదురు ఉత్పత్తులకు ఉన్న మార్కెటింగ్ అవకాశాలను పేర్కొన్నారు. రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు వెదురు పెంపకానికి అనువైన దన్న అభిప్రాయం సమావేశంలో వెల్లడయ్యింది. త్వరలోనే మధ్యప్రదేశ్, గుజరాత్, త్రిపుర రాష్ట్రాల్లో వాణిజ్యపరంగా వెదురుకు ఉన్న ప్రోత్సాహకాన్ని తెలంగాణ అటవీ అధికారులు త్వరలోనే అధ్యయనం చేయనున్నారు. మేదర సొసైటీల ద్వారా వెదురును ఉత్పత్తులుగా మార్చడం, వాటిని ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేసేలా అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. వ్యవసాయ వర్సిటీ ఎన్ఐఆర్డీ, దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ సహకారంతో రైతులను ప్రోత్సహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా వెదురు ఉత్పత్తులకు ప్రోత్సాహం పెరుగుతోందని, ఐకియా వంటి అంతర్జాతీయ సంస్థలు వెదురు వస్తువులను ప్రమోట్ చేస్తున్న విషయం చర్చకు వచ్చింది.

ఆంధ్రా బ్యాంక్
సంతోష్‌నగర్ శాఖ, హైదరాబాద్, టెలిఫోన్: 040-23468565

బంగారు ఆభరణాల బహిరంగ వేలం

[illegible] 27.03.2018న మ.3.00 గం.లకు ఆంధ్రా బ్యాంక్, సంతోష్‌నగర్ శాఖ, హైదరాబాద్ [illegible]

గోల్డ్ లోన్ అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	నగల బరువు
05483010011 2384	ఆర్. రంజనాదేవి, ఇం.నెం. 17-1-210/6/3, 3వ అంతస్థు 2వ లైను సంతోష్‌నగర్ ఎక్స్ రోడ్, హైదరాబాద్	97.5 గ్రాములు
054830100112393	ఆర్. రంజనాదేవి, ఇం.నెం. 17-1-210/6/3, 3వ అంతస్థు 2వ లైను సంతోష్‌నగర్ ఎక్స్ రోడ్, హైదరాబాద్	56 గ్రాములు
054830100114735	పెదబక హరిశంకర్ తండ్రి [illegible], ఇం.నెం. 9-5-61/2, గాంధీ విగ్రహం దగ్గర, చంపాపేట్, హైదరాబాద్	15.8 గ్రాములు

[illegible] రూ. 5,000/- [illegible]
సం/- చీఫ్ మేనేజర్

ఆంధ్రా బ్యాంక్ మాసబ్ ట్యాంక్ శాఖ, హైదరాబాద్-500028

డిమాండ్ నోటీసు

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ కోసం SARFAESI యాక్టు 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

[illegible] 08403110000238 [illegible] 30.12.2015 [illegible] రూ. 40.00 లక్షలు [illegible] 28.02.2018 [illegible] రూ. 40,91,706/- [illegible] (54 ఆఫ్ 2002) [illegible]

తేది: 07.03.2018
ప్రదేశం: హైదరాబాద్
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి ఆంధ్రా బ్యాంక్

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శుక్రవారం, మార్చి 9

సత్యానంతర సమరం


వర్తమానంలో కొనసాగుతున్న రాజకీయ, సామాజిక వైషమ్యాలకు మూలావశేషమైన గతాన్ని, దాని భావజాల వారసత్వాన్ని నిర్మూలించే లక్ష్యంతో స్మృతి చిహ్నాల విధ్వంసానికి పాల్పడటం నీడతో యుద్ధం చేసినట్లే. త్రిపురలో వామపక్ష కూటమి పరాజయం తర్వాత లెనిన్ విగ్రహాన్ని కూల్చి వేయడం, సీపీఎం కార్యాలయాలు, కార్యకర్తల ఇళ్లు, అంగళ్లపై విధ్వంసక దాడులు జరిగిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా విగ్రహ విధ్వంసాలు కొనసాగాయి. సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయిన సందర్భాల్లో లెనిన్ విగ్రహాలను, ఇరాక్‌లో సద్దాం హుసేన్‌ను గద్దె దించినపుడు జరిగిన విధ్వంసాలుగా మీడియా ప్రచారం చేసింది. త్రిపుర విధ్వంసాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఖండించిన వెంటనే దక్షిణపక్ష నేత శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని కోల్‌కతాలో పగులగొట్టారు. అదే క్రమంలో ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో అంబేడ్కర్, పెరియార్ రామస్వామి విగ్రహాలపై దాడులు జరిగాయి. పెరియార్ విగ్రహ విధ్వంసాన్ని సమర్థిస్తూ (ఆ తర్వాత ఉపసంహరించినప్పటికీ) బీజేపీ జాతీయ కార్యదర్శి హెచ్. రాజా సామాజిక మాధ్యమంలో అభిప్రాయం వ్యక్తం చేసినందుకు నిరసనగా కోయంబత్తూర్‌లో ఆ పార్టీ కార్యాలయంపై పెట్రోల్ బాంబు దాడి జరిగింది. స్మృతి చిహ్నాలుగా ఉన్న ఈ విగ్రహాలపై జరుగుతున్న ఈ దాడుల్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండిస్తే, ఇలాంటి చర్యల్ని గట్టిగా అడ్డుకోవాలని రాష్ట్రాలను కోరతూ హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ప్రకటనలు వెలువడేందుకు ముందుగానే త్రిపుర గవర్నర్ తథాగత రాయ్, మరికొంత మంది బీజేపీ నాయకులు విదేశీయుడైన లెనిన్ విగ్రహాన్ని కూల్చేయడం సబబేనని కితాబివ్వడం విడ్డూరం. ఇలాంటి వివాదాస్పద సంఘటనలు జరిగినపుడు సంఘపరివార్ నేతలు సమర్థించడం, ప్రభుత్వంలో ఉన్న పార్టీ పెద్దలు ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నట్లుగా పెద్దరికం వహిస్తూ అలాంటి అకృత్యాలను ఖండించడం పరిపాటై పోయింది. గతంలో మత విద్వేషకాండలు జరిగినపుడు, గోరక్షక మూకలు ప్రాణాంతక దాడులకు ఒడిగట్టినపుడు ఇలాంటి రాజకీయ తటస్థీకరణ విన్యాసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

త్రిపురలో సీపీఎం ప్రభుత్వ పాతికేళ్ళ సుదీర్ఘ పాలనకు స్వస్తి పలుకుతూ బీజేపీ అధికారాన్ని హస్తగతం చేసుకున్న నేపథ్యంలో సాగుతున్న దాడులు, దహనకాండ, ఆ క్రమంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులు భీతి గొలుపుతున్నాయి. లెనిన్ విగ్రహం కూల్చివేత వివాదం కంటే లోతైన అంశాలు ఇక్కడ చోటు చేసుకున్నాయి. లెనిన్ అయినా, మార్క్స్ అయినా మన దేశంపై బ్రిటిష్ వలసవాదుల పెత్తనాన్ని తీవ్రంగా నిరసించి, వివిధ రూపాల్లోని భారతీయుల పోరాటాల్ని వారు సమర్థించారు. బ్రిటిష్ వలసవాదులను భారత్ నుంచి తరిమికొట్టనిదే భారతీయులకు విముక్తి లేదని పలు సందర్భాల్లో చెప్పారు. ఈ విషయాలన్నీ విధ్వంసక చర్యలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రేరేపించిన రాజకీయ పెద్దలకు తెలియనివి కావు. దేశభక్తి, ప్రాంతీయత, జాతి, మత, కుల తదితర ఉద్వేగాలను, దురహంకారాలను రాజకీయ సైద్ధాంతిక భావజాలంగా వాడుకునే నేతలకు ఇలాంటి ద్విముఖ స్వభావం ఉండడం ప్రపంచవ్యాప్తంగా చరిత్ర పొడవునా చూస్తూనే ఉన్నాం. లెనిన్, పెరియార్, శ్యాం ప్రసాద్ ముఖర్జీ, అంబేడ్కర్‌లు వ్యక్తులుగా మంచివారా కాదా? వారి సిద్ధాంతం మంచిదా, ప్రజలకు మేలు చేస్తుందా? అనేది మౌలిక సమస్య కాదు. కుల దురహంకారంతో అంబేడ్కర్ విగ్రహాలను, మత దురహంకారంతో బాబ్రీ మసీదు, పెరియార్ విగ్రహం, బమియాన్ బుద్ధ విగ్రహాలు తదితర విధ్వంసాలు, భావజాల దురహంకారంతో లెనిన్, శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహాల విధ్వంసాలన్నీ సమాజంలో కొనసాగుతున్న వైషమ్యాల వ్యక్తీకరణలు మాత్రమే.


సమాజంలో కుల, మత, భాష, ప్రాంత, జాతి తదితర అస్తిత్వాలు, వైషమ్య పూరిత వర్గాల మధ్య నిరంతరం ఏదో ఒక రూపంలో ఘర్షణలు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో ఒక దళిత నాయకుడు-అగ్రకుల నాయకుడు, శ్రామిక వర్గనాయకుడు-దోపిడీవర్గ నాయకుల విగ్రహాలకు ఇలాంటి గతి పట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే విగ్రహాలే కాకుండా గత చారిత్రక వైభవం, ప్రతిభాపాటవాలకు, విషాదాల స్మృతులుగా ఉన్న అనేక స్మృతి చిహ్నాలపై సామాజిక సంక్షోభాల సమయంలో ఇలాంటి విధ్వంసకర దాడులు జరగడం కద్దు. తమ వ్యతిరేక భావజాల స్మృతి చిహ్నాలను ధ్వంసం చేయడం ద్వారా సమకాలీన సామాజిక వైరి పక్షాన్ని ధ్వంసం చేస్తున్నామని భావించడం అజ్ఞానం మాత్రమే. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన అగ్రవర్ణ దురహంకారులు, గతంలో గాంధీ విగ్రహాలను, సంస్కర్తల విగ్రహాలను ధ్వంసం చేసిన నక్సలైట్లు, హైదరాబాద్‌లో ట్యాంకు బండ్‌పై విగ్రహాలను ధ్వంసం చేసిన ఉద్యమకారులు, శ్యాంప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ముక్కలు చేసిన వామపక్ష అల్లరి మూకలు తదితర వ్యక్తులు, సంస్థలు ఏవైనా అయా సందర్భాల్లో వ్యక్తం చేసిన నిరర్థక ప్రతిక్రియలే.

'విగ్రహ విధ్వంసం' అనే వికృతత్వం, దాని కన్నా ముందు జరిగే 'విగ్రహ ప్రతిష్ఠ' అనేది మొదటి వికృతత్వానికి తప్పనిసరి ఫలితమని; చిత్రాల లాగే విగ్రహాలు కూడా కళా రూపాలే కాబట్టి, కళా రూపాలకు, అవి నిలబడవలసిన స్థలాలే సవ్యమైన స్థలాలని; కళా రూపాలకు పోరాటాల పాత్రలు అప్పజెప్పి బహిరంగ ప్రదేశాల్లో స్మృతి చిహ్నాలుగా పెడితే వాటిని అవమానించే సదవకాశాలు, వాటి వ్యతిరేకుల్ని పిలిచి అప్పగించినట్టేనని 2012లో రంగనాయకమ్మగారు ఒక వ్యాసంలో లేవదీసిన చర్చపై రాజకీయపక్షాలన్నీ పునరాలోలించాలి. అయితే ప్రధాన సమస్య విగ్రహాల్ని ప్రతిష్ఠించడమూ, ప్రతిష్ఠించకపోవడంలో లేదు. విగ్రహాల ఏర్పాటు ప్రజలకు ఒక భావజాల చిహ్నంగా నిరంతరం సంబంధిత మహనీయుల కృషిని, వారు సాధించిన విజయాలను, వారు సూచించిన, ఆచరించిన మార్గాన్ని అనుసరించవలసిన కర్తవ్యాన్ని, సామాజిక మంచిచెడులను గుర్తుచేసేందుకు సాధనంగా ఉంటాయని నాయకులు భావిస్తుండడం సర్వసాధారణం. క్షేత్రస్థాయి వాస్తవికత పునాదిగా కాక, వ్యక్తిగత విశ్వాసాలు, ఉద్వేగాల రీత్యా ప్రజాభిప్రాయం రూపొందుతున్న 'సత్యానంతర' (పోస్ట్ ట్రూత్) యుగంలో రాజకీయ భావజాల సమరాలు స్మృతి చిహ్నాల విధ్వంసం వంటి రూపాల్లో వ్యక్తమవుతున్నాయి. సమాజంలో ఒక్కొక్కసారి చాపకింద నీరులా, మరోసారి మెజారిటీ సమూహాన్ని సంఘటితం చేసి అధికారాన్ని, ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకునే లక్ష్యంతో దేశంలో కొనసాగుతున్న మత విద్వేషకాండ రూపంలో బహిరంగంగా విస్తరిస్తున్న సాంఘిక నియంతృత్వ ధోరణి తీవ్రతను, విస్తృతిని ఈ విధ్వంస రచన వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో సమాజపు అట్టడుగు పొరల నుంచీ ప్రబలుతున్న ఫాసిజం ప్రమాదాన్ని పసిగట్టి, దానికి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఉద్యమించాల్సిన తరుణమిది.

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily,
D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor,
Green lands, opp. Green park Hotel,
Hyderabad, 500016, Telangana.



మంచిమాట



'మనం ఇష్టపడినదాన్ని చేయడం కాదు... మనం చేయాల్సిన దాన్ని ఇష్టపడాలి. అదే మన జీవితానికి పరమార్థం.'

- గోథే

మోదీ పయనమెటు?

మహాత్మా గాంధీకి సంబంధించిన భాష, చిహ్నాలు చూపిస్తూ, వాటి అర్థాలు మార్చేసి ఆడుతున్న దుష్టక్రీడకు బదులు తాను గాంధీ వారసత్వాన్ని అనుసరిస్తున్నారో లేక సంఘ్ పరివార్‌కు చెందిన వీర్ సావర్కర్ వారసత్వాన్ని అభిమానిస్తున్నారో మోదీ బట్టబయలు చేయాలి. 20వ శతాబ్దం ప్రారంభంలో ప్రజాజీవితం వలసపాలనకు వ్యతిరేకంగా పోరాడింది. భారత జాతీయ కాంగ్రెస్ అసమాన ప్రయోజనాలతో విస్తృతమైన ఏకాభిప్రాయంతో నాయకత్వం వహించారు. స్వాతంత్ర్యానంతరం నైతికత పేరుతో దుర్మార్గం కొనసాగుతోంది. హిందుత్వ శక్తులు తరుచుగా భారతీయ జాతీయత గురించి ప్రస్తావిస్తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమాన్ని ధ్వంసం, తారుమారు, తమకు అనుకూలంగా మరల్చుకోవడం వంటి చర్యలు పాల్పడుతున్నారు. ఇందుకు ఉదాహరణగా, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్ గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ కొన్ని అసత్యాలను ఉటంకించారు. పటేల్, నెహ్రూ మధ్య ఉన్న తారతమ్యాన్ని తప్పుగా లెక్కించడం బీజేపీ గాంధీ గురించి పైపై మెచ్చుకోలు మాటలకు కాంగ్రెస్ నేరస్తురాలుగా మిగిలిపోయింది. అయితే, గాంధీ పేరుతో ఇప్పుడు మోదీ ఆడుతున్న క్రీడ వల్ల భవిష్యత్తులో తీవ్ర విషతుల్య పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. 2014 ప్రధాని బాధ్యతలు స్వీకరించే వరకు మోదీకి గాంధీ ఆశయాల్లో రెండింటి పట్ల అభిమానం ఉండేది. ఒకటి ఖాదీ కాగా, రెండోది పారిశుధ్యం! తాను వకాల్తా తీసుకున్నందు వల్లే ఖాదీ అమ్మకాలు రెట్టింపయ్యాయని మోదీ చెబుతారు. ఇందుకు సంబంధించి వాస్తవాలు వేరేగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడిని ఆకర్షించేందుకు ఆడంబరంగా దుస్తులుగానీ, సూటుబూటు వేసుకునే వ్యక్తి తాను ఖాదీకి రక్షకుడనని చెప్పుకోవడం గమనార్హం.

తన ప్రజాజీవితంలో గాంధీ ఎంతో నిరాడంబర జీవితం గడుపుతూ స్పష్టంగా నిర్మొహమాటంగా మాట్లాడిన దానికి కట్టుబడివుండేవారు. సత్యాగ్రహం అనేది సాత్విక నిరోధకం కంటే చురుకైనది. చివరకు ఆ పదం (సత్యాగ్రహం) గాంధీ సిద్ధాంతంగా పరిణమించింది. దానివల్లనే గాంధీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, ఖ్యాతి లభించింది. ఖాదీ, సత్యాగ్రహాలను పక్కకు పెడితే, అహ్మదాబాద్‌లోని సబర్మతి నది ఒడ్డున ఉన్న ప్రముఖ సత్యాగ్రహ ఆశ్రమం ప్రస్తుతం గాంధీ వారసత్వం తనకు అనుసరణీయం అనే రీతిలో మోదీ వ్యవహరిస్తున్నారు. ఈ ఆశ్రమాన్ని దేశంలోని అన్ని ప్రాంతాల వారు నిత్యం వేలసంఖ్యలో సందర్శిస్తుంటారు. ఇంతఖ్యాతితో సంరక్షించబడుతున్న ఈ ఆశ్రమాన్ని ప్రస్తుతం మోదీ రాజకీయంగా ఉపయోగించుకోనేందుకు చూస్తున్నారు. ప్రపంచ నాయకుల్ని ఈ ఆశ్రమానికి తీసుకొస్తున్నారు. 'హృదయ్ కుంజ్'లో జపాన్, చైనా, ఇజ్రాయెల్ నేతలకు ఆతిథ్యం ఇచ్చారు. భూగ్రహం మీద అణచివేతలను అమలుచేస్తున్న దేశాలకు చెందిన వారు చైనా, ఇజ్రాయెల్ నాయకులు. మోదీ వలెనే మహాత్మాగాంధీ ఆశయాల పట్ల, విలువల పట్ల ఏ మాత్రం సంబంధం లేని దేశాలు. ఆశ్రమానికి గాంధీ ఆశయాల పట్ల విశ్వాసం ఉన్నవాళ్లను మోదీ తీసుకొస్తే చూడడానికి బాగుండేది. ఆశ్రమంలో గాంధీ కూర్చునే సీట్లో ఆసీనులు కావలసిందిగా నెతాన్యాహూ, ఆయన భార్యను మోదీ కోరినప్పుడు వారు ఇబ్బందిగా కూర్చున్నారు. ఇటువంటి అంశంలోనే 2006లో ఒకసారి ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీరాయ్ ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ రాజ్‌ఘాట్ లోని గాంధీ సమాధిపై పుష్పాలుంచిన సందర్భంలో ఆమె 'ఎంతో ఘనంగా తీర్చిదిద్దిన గాంధీ సమాధిపై బుష్ పుష్పాలు ఉంచిన చోటునే పవిత్రమైనదిగా భావించి లక్షలాదిమంది భారతీయులు వినయంతో వంగి నమస్కరిస్తారు. బుష్ పూలుచల్లడం చూస్తుంటే గాంధీ సమాధిపై రక్తాన్ని చల్లినట్లుగా కనిపించింది' అని వ్యాఖ్యానించారు. ఆమె గాంధీ అభిమాని కాదు. 2017లో సబర్మతి ఆశ్రమం శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంది. ఆశ్రమ ప్రాంతంలో జాతీయ పురాతన భాండాగారం (ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా) ప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనకు 'సబర్మతి శతాబ్ది-ఏక్ కర్మాంజలి' అని వ్యహరించడం ఎంత దారుణమో ఆలోచించండి. మహాత్మాగాంధీకి స్మృతి ప్రకటించాలంటే ఎంతో గౌరవం చూపవలసిన సందర్భంలో ప్రస్తుత ప్రభుత్వం అమలుచేస్తున్న పథకం పేరుతో వ్యవహరించడం ఎంతవరకు సబబు? స్వదేశీ పదాన్ని కూడా నేడు ఎంతో దయనీయస్థితిలో ప్రభుత్వం వినియోగించుకుంటోంది. చర్ఖాను గాంధీ, ఆయన భార్య ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపయోగించేవారు. ఈ సందర్భంలో గాంధీ అన్న మాటల్ని ఒకసారి గుర్తుచేసుకోవడం సబబుగా ఉంటుంది. 'స్వదేశీ అనేది అనుసరించేవారికి ఎంతో శక్తినిస్తుంది. ఈ శక్తి ఆధారంగా పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చు'నని చెప్పారు. 1919లో గాంధీ చెప్పిన పరిశ్రమకు అర్థం ఖాదీ పరిశ్రమ గురించి. ఈ వాక్యాన్ని మోదీ ప్రభుత్వం ఎలా అన్వయించుకుంటోందో చూస్తే విస్మయం కలుగుతుంది. దీన్నే 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో ప్రభుత్వం గాంధీ పేరును కూడా ప్రచారానికి వాడుకుంటోంది. ఈ స్థితిలో ఆయన గాంధీ వారసత్వాన్ని అనుసరిస్తున్నారో, లేక సంఘ్‌పరివార్‌కు చెందిన వీర సావర్కర్‌ను అభిమానిస్తారో తేల్చి చెప్పాల్సి ఉంది.

> మహాత్మా గాంధీకి సంబంధించిన భాష, చిహ్నాలు చూపిస్తూ, వాటి అర్థాలు మార్చేసి ఆడుతున్న దుష్టక్రీడకు బదులు తాను గాంధీ వారసత్వాన్ని అనుసరిస్తున్నారో లేక సంఘ్ పరివార్‌కు చెందిన వీర్ సావర్కర్ వారసత్వాన్ని అభిమానిస్తున్నారో మోదీ బట్టబయలు చేయాలి.



రాజకీయ వ్యూహంగా తీసుకున్నారు. ఇదొక రాజకీయ యుక్తిగా వారు తలుస్తున్నారు. ఈ ప్రచార యంత్రాంగంలో వాస్తవాలంటూ బహిర్గతం చేస్తున్న అంశాల్లో రెండు విషయాలను మనం గమనించాలి. పటేల్ సేవలను దశాబ్దాలుగా కాంగ్రెస్ తగ్గించి చూపడం ఒకటి కాగా, ఐదు దశాబ్దాలుగా ఒకే కుటుంబానికి కాంగ్రెస్‌కు చెందిందని నెహ్రూ వారసులు భావించడం రెండోది. ఏదేమైనా పటేల్ జాతీయ స్థాయిలో విస్మరణకు గురయ్యారనేది మాత్రం వాస్తవం. గుజరాత్‌లో మాత్రం ఉప జాతీయవాదంగా పటేల్‌ను తమ ముద్రగా చెప్పుకుంటున్నారు. ఆ విధంగా ఎంతోమంది గిరిజనలకు, రైతులకు నిరాశ్రయం కల్పించిన ఒక పెద్ద డ్యామ్‌కు సర్దార్ సరోవర్ అనే పేరు ఖాయం చేశారు. గుజరాతి పటేల్‌తో పోటీలో నెహ్రూ ప్రభావరహితుడిగా వారికి కనిపిస్తున్నాడు.

మహాత్మాగాంధీ జనం మనిషి. హిందువుల గురించి మాట్లాడుతూ వారితోనే జీవించాడు. నెహ్రూ పట్ల చూపుతున్న వ్యతిరేకతను, నేరుగా చేస్తున్న దాడులను గాంధీ పట్ల వారు అనుసరించడం లేదు.

◆ వేణు మాధవ్ గోవిందు
(గాంధీ సేవాగ్రమ్ జీవిత ఇతివృత్తంపై అధ్యయనం చేస్తున్నారు.)

మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమం

తెలంగాణ సాధనోద్యమంలో ''మిలియన్ మార్చ్'' అత్యంత ముఖ్యమైన సంఘటన. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కేంద్రానికి బలంగా తెలియజేసిన ఈ మిలియన్ మార్చ్ ఇచ్చిన స్ఫూర్తి ఎంతో ప్రాముఖ్యమైనది. ఈ నేపథ్యంలో 2018 మార్చి 10న మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో ''మిలియన్ మార్చ్ స్ఫూర్తి కమిటీ'' ఏర్పడింది. పోలీసుల అనుమతి కోరగా, అనుమతిని నిరాకరిస్తూ సెంట్రల్ జోన్ పోలీసులు లేఖ ఇచ్చారు. పోలీసులు అనుమతించినా, ఇవ్వకపోయినా మార్చి 10న మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమం వుంటుందని తెలియ జేస్తున్నాం. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, నాటి పోరాట స్ఫూర్తి కార్యక్రమాలను గౌరవించి, అనుమతించాలని మరోసారి కోరుచున్నాం.

- మిలియన్ మార్చ్ స్ఫూర్తి కమిటీ

మన లేఖలు

తీరని ఫ్లోరైడ్ సమస్య

రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో అనేక మండలాలలో ఫ్లోరిన్ సమస్య పీడిస్తున్నది దీనివల్ల పిల్లలు, పెద్దలు జీవచ్ఛవాలుగా మారి మృత్యువుతో పోరాడుతున్నారు. పిల్లలు వృద్ధుల్లా మారుతున్నారు. చాలామందికి వివాహాలు కావడంలేదు. తల్లిదండ్రులు చనిపోతే వారి బతుకులు దుర్భరం. చిన్న ఒత్తిడికి గురైనా ఎముకలు విరిగి పోతున్నాయి. దీని పరిష్కారానికి నాయకుల హామీలు లభిస్తున్నాయి కానీ, చర్యలు చేపట్టడంలేదు. ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలలో ఫ్లోరోసిస్ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటుచేసి, సమస్యను పరిష్కరించాలి.

- సరికొండ శ్రీనివాసరాజు
వనస్థలిపురం


ఆత్మరక్షణకు కరాటే

ఒక వ్యక్తి తనను తాను ఆత్మరక్షణకు రక్షించుకోవడానికి ఉపయోగపడే విద్య కరాటే. ప్రస్తుత పరిస్థితులలో హైసూల్ విద్య, కాలేజీ విద్యను అభ్యసించే విద్యార్థినిలు ఈ కరాటేను తప్పకుండా నేర్చుకోవాలి. కరాటే వల్ల ప్రతి విద్యార్థిని తనను తాను రక్షించుకోగల్గుతుంది. ప్రభుత్వం కరాటేను ఒక క్రీడగా గుర్తించాలి. కరాటేను పాఠ్యాంశంగా చేస్తే, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. కరాటే వల్ల మనస్సు ప్రశాంతంగా వుండటమే కాక శరీరం సైతం దృఢంగా ఉంటుంది. కరాటే విలువ తెలిసేలా ప్రభుత్వం సెమినార్‌లతో పాటు, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటే బాగుగా ఉంటుంది.

-షేక్ అస్లాం షరీఫ్
జోగులాంబ గద్వాల జిల్లా

థర్డ్ ఫ్రంట్ సరికొత్త ఎత్తు!

ముఖ్యమంత్రిగా ఉంటూ సచివాలయానికి రాకుండా, అధికార నివాసం నుండే మొత్తం పరిపాలనను నియంత్రించే ప్రయత్నం చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అకస్మాత్తుగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారిస్తున్నారు. యూపీఏ ప్రభుత్వం మొదట్లో కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో అధికార విధులకు సహితం సక్రమంగా హాజరు కానీ ఆయన తృతీయ కూటమిని ఏర్పాటు చేసి, దేశానికి నూతన దశ, దిశా చూపిస్తానని చెబుతున్నారు. ఇదంతా 2019 ఎన్నికలలో తెలంగాణలో అదుపు తప్పుతున్న రాజకీయ పట్టును కాపాడు కోవడం కోసం ఆయన ఆడుతున్న సరికొత్త నాటకంగానే భావించవలసి వస్తున్నది. తృతీయ కూటమి అన్న ఆలోచన ఆయన కొత్తగా చేస్తున్నది కాదు. సుమారు నాలుగు దశాబ్దాలుగా వరుసగా ఒకరి కొక్కరు అటువంటి ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. తీవ్రమైన ప్రయత్నాలు కూడా చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా కొద్దీ సంవత్సరాల క్రితం వరకు ప్రతి ఎన్నికల ముందు ఇటువంటి ప్రతిపాదనను వామపక్షాలు తీసుకు వస్తున్నాయి. మొదటిగా అందుకు బలమైన ప్రయత్నం చేసినది ఎన్ టి రామారావు అని చెప్పవచ్చు. విజయవాడలో బీజేపీ, కాంగ్రెస్‌లు కాకుండా ఇతర ప్రతిపక్షాలతో శిఖరాగ్ర సమావేశం ఏర్పాటు చేసి అందుకు అంకురార్పణ చేశారు. చివరకు నేషనల్ ఫ్రంట్ రూపంలో అది కార్యరూపం దాల్చింది. తృతీయ కూటమి ఏర్పాటు చేయాలి అనుకున్న వారంతా కూడా ఇప్పుడు కేసీఆర్ చెబుతున్నట్లే కాంగ్రెస్, బీజేపీ దేశానికి ఒక మార్గదర్శనం చేయడంలో విఫలమైన్నట్లు చెబుతూనే వస్తున్నారు. కానీ ఎవ్వరు కూడా ఆ రెండు పార్టీలకు భిన్నమైన రాజకీయ సంస్కృతిని గాని, ఆర్థిక-సామాజిక విధానాలను గానీ ప్రజల ముందు ఉంచలేక పోయారు. వామపక్షాలు ఆ దిశలో కొంతమేరకు ప్రయత్నం చేసినా ఆచరణలో నిలబడలేక పోతున్నాయి. ఇప్పటి వరకు కాంగ్రెస్ లేదా బీజేపీ మద్దతు లేకుండా కేంద్రంలో ఎవ్వరు ప్రభుత్వం ఏర్పాటు చేయక పోవడం గమనార్హం.



కేవలం సోనియా గాంధీ నాయకత్వంలో ఇమడలేక కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన్నట్లు చెప్పుకొన్న ఎన్సీపీ అధినేత శరద్ పవర్ సహితం కాంగ్రెస్ పార్టీ లేకుండా దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో నరేంద్ర మోదీని ఓడించడం సాధ్యం కాదని ఈ మధ్య చెప్పడం గమనార్హం. కేసీఆర్ తృతీయ కూటమి ఆలోచనకు సంఘీభావం తెలిపిన మమతా బెనర్జీ సహితం కాంగ్రెస్‌తో పొత్తు కోసం తహతహలాడుతున్నారు. కేసీఆర్‌కే కాదు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు, తమిళనాడులో కొత్త పార్టీ పెట్టిన కమల్ హాసన్ కు కూడా ఆమె సంఘీభావం తెలుపుతున్నారు.

ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాను తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆడించిన్నట్లు ఆడుతున్నాననే అపవాదు నుండి బైట పడటం కోసం 'రాజకీయ నిరుద్యోగులు'తో వేదిక పంచుకొంటున్నారు. మరోవంక కేసీఆర్‌ను వీలు చిక్కినప్పుడల్లా పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఇప్పటి వరకు జన సేనకు ఎన్నికల పట్ల ఆసక్తి గల ఒక రాజకీయ పార్టీగా నిర్దుష్టమైన స్వరూపం ఇవ్వలేక పోతున్న పవన్ కళ్యాణ్ తృతీయ కూటమి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగానే ఉంటుంది. ఝార్ఖండ్ మాజీ సీయం హేమంత్ సొరేన్ సహితం రాజకీయంగా జాతీయ స్థాయిలో ఒక అండ కోసం ప్రయత్నం చేస్తున్నవారు కావడం గమనార్హం. కేసీఆర్ నిజంగా తృతీయ కూటమి ఏర్పాటు చేయడం వల్ల జాతీయ రాజకీయ చిత్రపటంలో రాగాల మార్పులు ఏమిటనే ప్రశ్నలు ఈ సందర్భంగా తలెత్తడం సహజం. ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులలో తృతీయ కూటమి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఏమాత్రం కనబడటం లేదు.

ప్రస్తుతం తాను అధికారంలో ఉన్న పలు పెద్ద రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ మాత్రమే బలపడుతుంది. అటువంటి సమయంలో బీజేపీకి వ్యతిరేకంగా బలమైన కూటమిని కాంగ్రెస్ మాత్రమే ఏర్పాటు చేసే వీలుంటుంది. త్రిపుర అనుభవాన్ని పరిగణలోకి తీసుకొంటే కేసీఆర్ చెబుతున్న తృతీయ కూటమి ప్రయత్నం కేవలం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి ఉపయోగ పడుతుంది. అటువంటప్పుడు ఇప్పటికే 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీకి కేసీఆర్ ఎంతో మేలు చేసిన వారు కాగలరు. తిరిగి నరేంద్ర మోదీ ప్రధాని పదవి చేపట్టడం కోసం తనదైన సహాయం చేసిన వారు కాగలరని గ్రహించాలి. మోదీ తీసుకున్న పలు వివాదాస్పద నిర్ణయాల పట్ల బీజేపీ ముఖ్యమంత్రులే నోరు మెదపలేని సమయాలలో అందరికన్నా ముందు మోదీకి మద్దతు ప్రకటించారు.

గత సంవత్సరకాలంగా టీఆర్ఎస్‌లో చేరిన కొందరు మాజీ తెలుగు దేశం పార్టీ నాయకులు ఈ విషయమై కేసీఆర్‌తో సమాలోచనలు జరుపుతూనే ఉన్నారు. తెలంగాణలో టీడీపీకి సొంతంగా సీట్లు గెల్చుకొనే బలం లేకపోయినా, పలు చోట్ల ఆ పార్టీకి ఇంకా నమ్మకమైన ఓటర్లు ఉన్నారని ఈసందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. టీడీపీకి తెలంగాణలో మనుగడ లేకుండా చేస్తే వారంతా కాంగ్రెస్‌కు ఓటర్లుగా మారే ప్రమాదం ఉన్నదని, అటువంటప్పుడు టీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ కాగలదని వారించారు. అందుకనే రెండు పార్టీల మధ్య పొత్తు కోసం రంగం సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం, ఖమ్మం, నిజామాబాద్ వంటి జిల్లాల్లో ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చి స్థిరపడిన వారికి టీడీపీ పట్ల ఇంకా అభిమానం ఉంది. వారిని ఆకట్టుకోవడం కోసమే కేసీఆర్ ప్రత్యేకంగా అనంతపూర్ జిల్లాలో పరిటాల సునీత కుమారుడి వివాహానికి వెళ్లి వచ్చారు. అయితే ఇప్పటి వరకు 'ఆంధ్ర ద్రోహులు', తెలంగాణను పీల్చి పిప్పిచేచ్చినా 'ఆంధ్ర కాంట్రాక్టర్లు' అంటూ నిందించిన తనకు అకస్మాత్తుగా టీడీపీతో పొత్తు ఏర్పర్చుకొంటే ప్రతికూల సంకేతం ఏర్పడే ప్రమాదం ఉన్నట్లు కేసీఆర్ భావిస్తున్నారు. అందుకనే రాష్ట్ర ప్రజలను మానసికంగా సిద్ధం చేయడం కోసం తృతీయ కూటమి నినాదం అందుకున్నట్లు అనిపిస్తున్నది.

నాలుగేళ్ల టీఆర్‌యస్ పాలనలో సుమారు నాలుగు వేల మంది రైతులు తెలంగాణలో ఆత్మహత్యలు పాల్పడ్డారు. ముఖ్యమంత్రి గానీ, ఆయన మంత్రి వర్గ సభ్యులు గాని ఎన్నడో బాధిత కుటుంబాలను పరామర్శించనే లేదు. కానీ ఇప్పుడు అందుకు మోదీ విధానాలను కారణంగా చూపడం గమనార్హం. క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నట్లు ఆయనకు తెలుసు. అందుకనే సరికొత్త రాజకీయ ఎత్తుగడలతో 'ప్రభుత్వ వ్యతిరేకత'ను ఎదుర్కొనే ప్రయత్నంలో 'తృతీయ కూటమి' అస్త్రం ప్రయోగించినట్లు స్పష్టం అవుతున్నది.

◆ చలసాని నరేంద్ర

ఇందులో ప్రచురించిన వ్యాసాలు, కథనాలు ఆయా రచయితల అభిప్రాయాలే, వీటితో సంపాదకవర్గానికి గానీ, యాజమాన్యానికి గానీ ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకులు

మనం
కుటుంబం
శుక్రవారం, 9 మార్చి 2018
www.manamnews.com





ఉల్లాసంగా.. ఉత్సాహంగా

'మనం' 5కె రన్ విజయవంతం.. ఘనంగా మహిళా దినోత్సవం

మహిళాశక్తికి 'మనం' అండగా నిలిచింది. మహిళలను అన్ని రంగాల్లో చైతన్యవంతం చేసే దిశలో భాగంగా మనం దినపత్రిక మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ప్రపంచంలో మహిళా శక్తికి మించింది ఏదీ లేదని చాటి చెప్పింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా 'మనం' దినపత్రిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో గురువారం నిర్వహించిన 5కె రన్ విజయవంతంగా సాగింది. ఈ రన్‌ను పత్రిక ఎడిటర్ ఉప్పరి రమేశ్‌కుమార్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జి.కృష్ణయాదవ్, డాక్టర్ సర్జీత్ యాదవ్, డాక్టర్ సుజాత ప్రారంభించారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ సామల హేమ మాట్లాడారు. మహిళాదినోత్సవం ఒక్కరోజుకే పరిమితం కావద్దని, ఏడాదంతా జరగాలని ఆకాంక్షించారు. మహిళలకు సమానత్వం కోసం సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. హైటెక్‌యుగంలోనూ లింగ వివక్ష ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. తాను బతుకుతానో లేదో తెలియని పరిస్థితుల్లోనూ స్త్రీ మూర్తి మరొకరికి జన్మనిస్తుందని అన్నారు. మగవాళ్లు ఎన్ని పనులు చేసినా వారికి జన్మనిచ్చేది ఒక మహిళే అని గుర్తుచేశారు.



ఉద్యమంలో మహిళల పాత్ర అమోఘం: కృష్ణయాదవ్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మహిళల పాత్ర మరువలేనిదని టీజీవో అధ్యక్షుడు జి. కృష్ణయాదవ్ అన్నారు. మహిళలు చూపిన తెగువ కేంద్రానికి దడ పుట్టించిందన్నారు. చట్టసభల్లో 50శాతం మహిళలకు రిజర్వేషన్లు ఉండాలని, ఈ దిశగా వారు పోరాటం చేయాలని సూచించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి, ఎంపీ కవితల స్ఫూర్తితో మహిళలు అభివృద్ధి దిశగా పయనించాలని ఆకాంక్షించారు. మహిళలకు నిత్యం షీ టీంలా ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఓటమిని గెలుపులా స్వీకరిస్తూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని 5కె రన్‌లో పాల్గొన్న యువతులకు పిలుపునిచ్చారు.



మహిళా శక్తికి మనం అండ: ఎడిటర్ రమేశ్ కుమార్

మహిళా శక్తికి 'మనం'ఎప్పుడూ అండగా ఉంటుందని మనం పత్రిక ఎడిటర్ రమేశ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే మహిళా దినోత్సవాన్ని భారీగా నిర్వహించామన్నారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ సంస్థలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మహిళలను చైతన్య పరిచే దిశగా పత్రిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

సృష్టిలోనే మహిళ స్థానం గొప్పది: సర్జీత్‌యాదవ్

మానవ జన్మకు మూలం మహిళే అని ఎప్పుడో భగవంతుడు చెప్పాడని అందుకే మహిళ పాత్ర ఎంతో గొప్పదని ఉస్మానియా డెంటల్ కళాశాల ప్రొఫెసర్ డా. సర్జీత్‌యాదవ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మనం పత్రిక ఇంత మంచి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.



అందనంత ఎత్తులో మహిళ: బోనాల శ్యామల

శివుడి తలపై కూడా ఉండేది గంగమ్మే అనే విషయాన్ని మహిళలు గుర్తుంచుకోవాలని తెలంగాణ బోనాల ఐకాన్ జోగిని శ్యామల అన్నారు. 'మనం'ఆధ్వర్యంలో చేపట్టిన 5కె రన్‌కు శ్యామల హాజరై మాట్లాడారు. మనం ఎదుగుతాం అనే ఆత్మవిశ్వాసంతో మహిళలంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నీ అంటే నీ గర్వం.. నా అంటే నా గర్వం.. కానీ 'మనం' అంటే మనందరి గర్వమని అన్నారు. సావిత్రిబాయిపూలే, ఝాన్సీలక్ష్మీబాయి, రుద్రమదేవిల స్ఫూర్తితో మహిళలంతా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. మహిళా దినోత్సవాన్ని మనం పత్రిక ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు.





సంఘటితంగా ఉంటేనే మహిళా అభివృద్ధి: డాక్టర్ సుజాత

మహిళలు సంఘటితంగా ఉంటేనే మహిళాభివృద్ధి సాధ్యమని సోమాజిగూడ ప్రభుత్వ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత అన్నారు. మహిళా దినోత్సవం ఒక్కరోజే అనే ఆలోచనకు స్వస్తి చెప్పాలని సూచించారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఐక్యతతో ముందుకు సాగితే అన్ని రంగాల్లో మహిళలే అభివృద్ధి పథంలో ఉంటారన్నారు. తాను తక్కువనే ఆలోచనను పక్కన పెడితే అన్నింటా విజయం మహిళలదేనని స్పష్టం చేశారు. మహిళ మొదట అక్షరాస్యులుగా ఎదగాలని, ఇందుకు ప్రభుత్వాలు మరింతగా కృషిచేయాలని కోరారు.

భారీగా.. 5కె రన్

'మనం'ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె రన్‌లో మహిళలు, యువతులు, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వప్న స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలకు చెందిన వి.లలిత ప్రథమ స్థానంలో నిలిచింది. వనితా నర్సింగ్ కళాశాలకు చెందిన దీపాళీ, రాజ్‌నందిని సంయుక్తంగా ద్వితీయ స్థానంలో, స్వాతి, స్వర్ణలత, తృతీయ, వర్ష నాల్గోస్థానంలో నిలిచారు. విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన లలితకు మెమొంటోతో పాటు ప్రత్యేకంగా రూ. 2000 నగదును పత్రిక యాజమాన్యం అందజేసింది. వనితా, స్వప్న, సోమాజిగూడ నర్సింగ్ కళాశాల, వైద్యశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

-మనం ప్రతినిధి, హైదరాబాద్





దేశసేవలోనూ యువతులు: హాన్స్‌లీ

మహిళలు అన్నింటా ముందుంటున్నారని సోమాజిగూడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హాన్స్‌లీ అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో బాలికలు, యువతులు రాణిస్తుండడం అభినందనీయమన్నారు. వాయు, సైనిక, నౌకా రంగాల్లో యువతులు అగ్రగాములుగా ఉంటుండటం చూస్తున్నామని తెలిపారు. దేశసేవతో పాటు సమాజసేవలోనూ మహిళల పాత్ర మరవలేనిదన్నారు.



ఎంబీసీలకు సబ్సిడీ రుణం

(మొదటిపేజీ తరువాయి)

నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఆ నిధులతో ఎంబీసీ కులాల్లోని పేద యువతకు కావాల్సిన ఆర్థిక సహకారం అందించాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం వివిధ పథకాలను రూపొందించి ఎంబీసీలకు వీలైనంత ఎక్కువ సబ్సిడీలు అందించాలని ఆదేశించారు. బీసీలకు అమలు చేసే ఎకనామిక్ సపోర్టు స్కీమ్‌కు గతంలో లక్ష రూపాయలకుగాను, 60 వేలు (60 శాతం) సబ్సిడీ ఇచ్చేవారు. కానీ ఆ సబ్సిడీ సరిపోదని, మరింత సబ్సిడీ అందించాల్సిన అవసరం ఉందని, అలాగే లక్ష రూపాయల నుంచి 12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని చెప్పారు.

లక్ష రూపాయల వరకు తీసుకునే ఆర్థిక సహకారంలో 80 వేలు (80 శాతం), రెండు లక్షల రూపాయల విలువైన యూనిట్ నెలకొల్పే వారికి లక్షా 40 వేలు (70 శాతం), రెండు లక్షల రూపాయల నుంచి 12 లక్షల విలువైన యూనిట్లు నెలకొల్పే వారికి 60 శాతం (గరిష్టంగా 5 లక్షల రూపాయలు) సబ్సిడీ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. సబ్సిడీల విషయంలో స్పష్టత వచ్చినందున ఎంబీసీలకు అమలు చేయాల్సిన పథకాలకు వెంటనే రూపకల్పన చేసి, సహాయం అందించడం ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

ఏడాది నిబంధన ఎత్తివేత

పీజీ వైద్య విద్యార్థుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏడాదిపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవ చేయాలన్న నిబంధనను ప్రభుత్వం తొలగించనుంది. నిబంధన తొలగింపుపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. నిబంధన తొలగింపు నిర్ణయం ఈ ఏడాది నుంచే అమలు చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయకున్నా వారి విద్యార్హతలను నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏడాదిపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవ చేయాలన్న నిబంధనను తొలగించాలని పీజీ వైద్య విద్యార్థుల కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

ఎడా పెడా.. రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామాలను రాష్ట్రపతి వెంటనే ఆమోదించారు. గురువారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో వీరిద్దరూ సమావేశమై తమ రాజీనామా లేఖలను అందజేశారు. వాస్తవానికి గురువారం ఉదయమే మంత్రులిద్దరూ రాజీనామా చేయాలనుకున్నా.. నరేంద్రమోదీ రాజస్థాన్ పర్యటనకు వెళ్లడంతో ఆయన అపాయింట్‌మెంట్ ఆలస్యమైంది. పర్యటన నుంచి తిరిగొచ్చిన వెంటనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మోదీ ఫోన్ చేసి తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. అయితే వీరి చర్చలు ఫలించలేదు. టీడీపీ మంత్రులతో రాజీనామా చేయించడానికే చంద్రబాబు కట్టుబడ్డారు. దాంతో సాయంత్రం 6 గంటల సమయంలో మంత్రులకు మోదీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు.

ఇద్దరూ తమ రాజీనామా లేఖలను ప్రధానికి సమర్పించారు. వాటికి ఆమోదం కూడా లభించింది.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలోని ఇద్దరు బీజేపీ మంత్రులు కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాల రావు తమ మంత్రి పదవులకు రాజీనామా సమర్పించారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వీరిద్దరూ రాజీనామా పత్రాలు అందించారు. సాయంత్రం వారిద్దరి రాజీనామాలను గవర్నర్ నరసింహన్ ఆమోదించారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి రాజ్‌భవన్ నుంచి సమాచారం అందింది. మంత్రులుగా వీరిద్దరి పనితీరుపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రశంసలు కురిపించారు. బాగా పని చేశారని అభినందించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖలో మాణిక్యాలరావు, వైద్య ఆరోగ్యశాఖలో కామినేని శ్రీనివాస్ పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. మాణిక్యాలరావు... కృష్ణా, గోదావరి పుష్కరాలను సమర్థంగా నిర్వహించారని, దేవాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి దేవాదాయ శాఖ ఆదాయం పెరిగేలా కృషి చేశారని చంద్రబాబు ప్రశంసించారు.

వైదొలగుతున్నందుకు బాధగా ఉందా?

కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావు బీజేఎల్పీ కార్యాలయంలో కూర్చుని ఉండగా టీడీపీ మంత్రులు వారిని కలిశారు. పదవుల నుంచి తప్పుకొంటున్నందుకు బాధగా ఉందా? అని ఓ మంత్రి ప్రశ్నించగా... రాజకీయాల్లో ప్రవేశంతో పాటు నిష్క్రమణం కూడా గౌరవంగా ఉండాలని కోరుకుంటున్నట్లు కామినేని చెప్పారు. పదవి నుంచి సంతోషంగా వైదొలుగుతున్నట్లు చెప్పారు. ఆ తరువాత మంత్రి మాణిక్యాలరావును కలిసిన గంటా మిమ్మల్ని అభినందించాలా.. లేక సానుభూతి వ్యక్తం చేయాలా? అని అడిగారు. ఎప్పటిలాగే అభినందించాలంటూ మాణిక్యాలరావు సమాధానమిచ్చారు.

బాబుకు మోదీ ఫోన్

తాజా రాజకీయ పరిణామాలపై చర్చ

అమరావతి, మార్చి 8:

కేంద్రంలోని తమ పార్టీకి చెందిన మంత్రులను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోన్ చేశారు. తాజా రాజకీయ పరిణామాలపై దాదాపు 20 నిమిషాల పాటు ఆయన మాట్లాడినట్లు సమాచారం. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే ప్రసక్తి లేదంటూ కేంద్ర ఆర్థిక మంత్రి కుండ బద్దలుకొట్టినట్లు విలేకరుల సమావేశంలో చెప్పడంతో కేంద్రంలో ఉన్న తమ ఇద్దరు మంత్రులను ఉపసంహరించుకుంటున్నట్లు చంద్రబాబు బుధవారం రాత్రి ప్రకటించారు. అప్పుడు తాను ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ప్రయత్నించినా ఆయన లైన్లోకి రాలేదని చెప్పారు. గురువారం ఉదయం రాజస్థాన్‌లో బేటీ పడావో- బేటీ బచావో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన నరేంద్ర మోదీ..గురువారం సాయంత్రం 4.30 గంటలకు తిరిగి ఢిల్లీ రాగానే చంద్రబాబుకు ఫోన్ చేశారు. ప్రధానంగా తాజా రాజకీయ పరిణామాలే వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. తమ మంత్రుల రాజీనామాకు దారితీసిన పరిస్థితులను చంద్రబాబు వివరించినట్లు తెలుస్తోంది.

అద్వితీయం.. అమోఘం

(మొదటిపేజీ తరువాయి)

శివారులోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'అద్వితీయ' పేరుతో గురువారం సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమం జరిగింది. దీనికి 'మనం' దినపత్రిక మీడియా భాగస్వామిగా వ్యవహరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కుమారుడు, నటుడు ఆకాశ్ పూరి, నటి నేహా శెట్టి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు సందడి చేశారు. వివిధ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కాగా, 'అద్వితీయ' కార్యక్రమం తమలోని నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడిందని పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పరిశోధనలు, ప్రాజెక్టుల నమూనాలు ఆహూతులను అబ్బురపరిచాయి. కార్యక్రమంలో టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



టీ హబ్‌లా వీహబ్ ఎదగాలి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి కే తారక రామారావు ప్రారంభించారు. ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సు(జీఈఎస్) ముగింపు సందర్భంగా రూ. 15 కోట్లతో వీహబ్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిని ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ప్రారంభించాలని ఆరోజే నిర్ణయించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రాంగణంలోని టీసాట్ కార్యాలయంలో వీహబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవంలో ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, సైంటిస్ట్ టెస్సీ థామస్, కలారి కేపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వాణి కోలా, పలువురు మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. టీహబ్ ఎందరో యువపారిశ్రామిక వేత్తలకు వేదికగా నిలిచిందన్నారు. మహిళల కోసమే ప్రత్యేకంగా వీ హబ్‌ను ఏర్పాటు చేశామని, కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే మహిళలను ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రోత్సాహం లేకుండానే పలువురు మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, పెళ్లిళ్లకు పూలజడలు తయారుచేస్తూ కల్పన అనే యువతి 600 మందికి ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన యువతులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. సైనా నెహ్వాల్, సానియా మీర్జా, మిథాలిరాజ్, అరుణా రెడ్డి తామేంటో ప్రపంచానికి చాటారన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలు చక్కగా పోషిస్తూనే తమ రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారన్నారు. వ్యాపార రంగంలోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే మహిళలు హైదరాబాద్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. వీహబ్ మహిళా పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి చేసిన వస్తువులకు తెలంగాణ ప్రభుత్వమే తొలి కొనుగోలుదారు అవుతుందని మంత్రి ప్రకటించారు. విస్తృతమైన, పటిష్టమైన వాణిజ్య వేదిక నిర్మించుకునేందుకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆసక్తి ఉన్న రంగాల్లో ఎదిగేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఆరు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

ఏవియేషన్ షో ప్రారంభం

నగరంలోని బేగంపేట ఎయిర్‌పోర్టులో వింగ్స్ ఇండియా 2018 ఏరోస్పేస్ సదస్సు ప్రారంభమైంది. ఏరోస్పేస్ సదస్సును మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కార్యక్రమానికి ఇండియా-గ్లోబల్ ఏవియేషన్ హబ్‌ను ఇతివృత్తంగా ఎంపికచేశారు. అమెరికా, జపాన్, జర్మనీ, రష్యా, సింగపూర్, ఫ్రాన్స్, మలేషియా, హాంగ్‌కాంగ్, ఇటలీ, ఇరాన్ , బ్రిటన్ దేశాల నుంచి ప్రతినిధులు హాజరైన ఈ సదస్సును కేంద్ర పౌర విమానయాన శాఖ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిక్కీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ నెల 11 వరకు ఏవియేషన్ షో కొనసాగనుంది. ఈ సదస్సును కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు హాజరుకావాల్సి ఉన్నా.. రాజకీయ కారణాల వల్ల రాలేకపోయారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పౌర విమానాయన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. దేశంలో 70 ఏళ్లలో 70 విమానాశ్రయాలు ఉంటే, అశోక్ గజపతిరాజు సారథ్యంలో గడిచిన మూడేళ్లలో 50 నుంచి 60కిపైగా విమానాశ్రయాలు కొత్తగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బృందానికి అభినందనలు తెలియజేశారు. భారత వైమానిక రంగం ఇలాగే వృద్ధి చెందాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

ఏపీ బడ్జెట్.. రూ.1,91,063.61కోట్లు

రెవెన్యూ మిగులుతో భారీ బడ్జెట్

కేంద్ర నిధులు వస్తాయని ఆశ

బాలికలకు ఉచితంగా నాప్‌కిన్లు

దానికి రూ. 100 కోట్ల నిధులు

బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి యనమల



అమరావతి, మార్చి 8 (మనం ప్రతినిధి): రెండంకెల అభివృద్ధి గురించి విస్తృత ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌లోనూ అదే ఆర్భాటాన్ని ప్రదర్శించింది. గత ఏడాది లక్షన్నర కోట్లకు పరిమితమైన బడ్జెట్‌ను ఈ ఏడాది దాదాపు రూ. 2 లక్షల కోట్లు చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. రాజకీయ గమనంలో అనిశ్చితి నెలకొన్న సమయంలో.. టీడీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను సంతోషపెట్టేందుకు బడ్జెట్ రూపంలో బాగానే కసరత్తు చేసింది. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడు గుర్రాల స్వారీలా పరుగెత్తిస్తున్నట్టు ప్రకటించుకుంది. లక్షల ఉద్యోగాలు, భారీ పరిశ్రమలు, వెనుకబడిన తరగతులకు కానుకలు, ప్రవాహమై పరుగులెత్తే ప్రాజెక్టులు.. ఇలా జనాకర్షక బడ్జెట్‌ను వండి వార్చి వడ్డించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు గురువారం శాసనసభలో 2018-2019 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,91,063.61 కోట్ల తో కూడిన భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ లో రూ. 1,50,270.99 కోట్లను అంచనా వ్యయంగాను, రూ. 28,678.49 కోట్లను కేపిటల్ వ్యయంగానూ చూపించారు. ఇది గత ఏడాది 2017-2018లో ప్రవేశపెట్టిన రూ. 1,56,999.40 కోట్లతో పోలిస్తే 21.70 శాతం ఎక్కువ. రెవెన్యూ తరుగుతో కాకుండా మిగులుతో బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని, ఇది రాష్ట్ర ప్రభుత్వం విజయమని యనమల చెప్పుకొచ్చారు. చంద్రన్న పెళ్ళి కానుక, ఏపీ ఫైబర్ గ్రిడ్, నివేశన స్థలాల సేకరణ, -ప్రగతి, అన్నా క్యాంటీన్ల లాంటి అనేక పథకాలకు కొత్తగా ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించారు. నాలుగేళ్లుగా అంతంత మాత్రంగా జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను పరుగులు పెట్టించేందుకు రూ. 3679.53 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయింపుతో పోలిస్తే ఇది 152.62 శాతం ఎక్కువ. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి.. చదువుకుంటున్న కౌమార బాలికలు, ఎస్‌హెచ్‌జి మహిళల అవసరాన్ని గుర్తించి వారికి శానిటరీ నాప్‌కిన్‌లను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. శానిటరీ నాప్‌కిన్ల కొనుగోలు కోసం బడ్జెట్‌లో రూ. 100 కోట్లను కేటాయిస్తున్నట్టు సభ్యుల హర్షధ్వానాల మధ్య యనమల ప్రకటించారు.

పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ. 9వేల కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రాజెక్టు ఫలాలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని యనమల అన్నారు. రాష్ట్రంలో అయిదు ప్రధాన నదులైన వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నాలను అనుసంధానం చేస్తూ ఒక మహా సంగమాన్ని రూపొందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, అందుకే జలవనరులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. జలవనరుల శాఖకు ఈ ఏడాది బడ్జెట్ లో రూ. 16,978 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 33% అదనంగా నిధులు ఈ రంగానికి కేటాయించారు. నాగార్జున సాగర్ ఆధునీకరణ, వెలుగొండ ప్రాజెక్టు, సంగం ఆనకట్ట, నెల్లూరు ఆనకట్ట, సోమశిల ప్రాజెక్టు, స్వర్ణముఖి లింక్ కాల్వ, తెలుగుగంగ ప్రాజెక్టు, వాటి అనుబంధ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేశారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధికి సంబంధించి గత ఏడాదితో పోలిస్తే నిధులను భారీగా పెంపుదల చేశారు. బీసీల సంక్షేమానికి రూ. 4,477 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ. 3,316 కోట్లు కేటాయించగా, ఈసారి 35% నిధులను అదనంగా ఖర్చుచేయనున్నట్టు మంత్రి ప్రకటించారు. చేనేత, మత్స్యకారులు, దూదేకుల, నాయీ బ్రాహ్మణులు, కల్లుగీత, వాల్మీకి, బోయ, విశ్వ బ్రాహ్మణులు, శాలివాహన, సాగర, ఉప్పర, మేదర, కృష్ణ బలిజలు వృత్తి నైపుణ్యం సాధించేందుకు వీలుగా బడ్జెట్‌లో వేర్వేరుగా కేటాయింపులు చేశారు. బీసీలతో పాటు ఎస్సీలకు రూ. 11,228 కోట్ల కాంపోనెంట్ నిధులను కేటాయించారు. గిరిజన సంక్షేమానికి రూ. 262 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో స్థిరమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్ నెట్ కనెక్షన్ కోసం అత్యాధునిక ట్రిబుల్ ప్లే సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

సీఎం కేసీఆర్.. రాజ్యాంగ ద్రోహి



రాష్ట్రానికి పట్టిన అవినీతి చీడ

తుగ్లక్ కంటే పిచ్చిగా పాలన: ఉత్తమ్

కరీంనగర్, మార్చి 8(మనం న్యూస్ బ్యూరో):

టీఆర్ఎస్ సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయని తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ పరిపాలన తుగ్లక్ పరిపాలనకంటే పిచ్చిగా ఉందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగ ద్రోహి అని, రాష్ట్రానికి పట్టిన అవినీతి చీడ అని విమర్శించారు.

గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, చిన్న ముల్కనూర్, సుందరగిరి గ్రామాలతో పాటు హుజురాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రజా చైతన్య బస్సుయాత్ర, సభలు కొనసాగాయి. ఈ సందర్భంగా హుస్నాబాద్ సభలో ఉత్తమ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన తుగ్లక్ కన్నా పిచ్చిగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాల్లో ఉందని గుర్తు చేశారు. ముస్లింలకు 12 శాతం, గిరిజనులకు 10శాతం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. ఈమేరకు రిజర్వేషన్లు పెంచుతూ కేంద్రానికి బిల్లు పంపగా.. సాంకేతిక లోపాలున్నాయని పేర్కొంటూ కేంద్రం తిప్పిపంపిందని ఉత్తమ్ వివరించారు. ఈ విషయాన్ని కేసీఆర్ దాచిపెడుతున్నారని ఆరోపించారు. నాలుగేళ్ల తర్వాత కేసీఆర్ కేంద్రంపై సాకులు చెబుతూ తన తప్పేమీలేదని చెబుతున్నాడని మండిపడ్డారు. ముస్లింలకు, గిరిజనులకు రిజర్వేషన్ కల్పించకుంటే వాళ్ళను ఓట్లు అడిగే హక్కు టీఆర్ఎస్‌కు లేదన్నారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి, రైతుల ఆత్మహత్యకు కారణమైన సర్కారు తన తప్పును ఇతరుల మీద రుద్దే ప్రయత్నం చేస్తోందని విమర్శిం చారు. కందులకు కేంద్రం మద్దతు ధరతో పాటు రాష్ట్ర బడ్జెట్ కేటాయించాలని కాంగ్రెస్ కోరినా.. నాలు గేళ్లలో ఒక్క రూపాయి కూడా కేటాయిం చలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 5లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కందులు, మిర్చి కొనేందుకు ఐదు రూపాయలు కూడా కేటాయించలేదని చెప్పారు. కాగా, డిసెంబ ర్‌లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు వచ్చే అవకాశముందని చెబుతూ అందు కోసం కాంగ్రెస్ కార్యకర్తలను సమా యత్తం చేస్తున్నామని ఉత్తమ్ వివరించారు. వచ్చే ఎన్నికలలో కేంద్ర, రాష్ట్రాలలో విజయం సాధించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఉత్తమ్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, వ్యవసాయ పంటలు కొనుగోలుకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి కొంటామని వివరించారు. మహిళా సంఘాలను టీఆర్ఎస్ సర్కార్ నీరుగార్చిందని ఆరోపించారు. అధికారం లోకి వస్తే మహిళా సంఘాలకు పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు ఒక్కో దానికి రూ.లక్ష చొప్పున ఆరు లక్షల సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ కేటాయిస్తామని ఉత్తమ్ తెలిపారు. అదే విధంగా సంఘానికి 10లక్షల చొప్పున రుణం మంజూరుచేసి సర్కారు తరపున వడ్డీ భరిస్తామని తెలిపారు. అభయ హస్తం పునరుద్ధరించి, అందించే మొత్తాన్ని వెయ్యికి పెంచుతామని పేర్కొన్నారు. లక్షలాది ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఉద్యోగం రాని వారికి నెలకు 3వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ఉత్తమ్ వివరించారు.

కేబినెట్‌లో మహిళలకు ప్రాతినిధ్యమేదీ?

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ మంత్రివర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం లేకపోవడం సిగ్గుచేటని ఉత్తమ్ మండిపడ్డారు. స్వతంత్ర భారత్‌లో మహిళా మంత్రిలేని ఏకైక క్యాబినెట్ తెలంగాణా మాత్రమేనని ఉత్తమ్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని 2 కోట్ల మంది మహిళల్లో ఒక్కరూ కూడా అర్హులు లేరా? అని ప్రశ్నించారు.

ప్రాజెక్టులను పూర్తిచేస్తాం: జీవన్ రెడ్డి

గౌరవెల్లి, గండి ప్రాజెక్టులను పూరిచేస్తామని కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి పేర్కొన్నారు. బస్సు యాత్రలో పాల్గొన్న ఆయన హుస్నాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అవినీతికి ఆదర్శం సీఎం కేసీఆర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీలో అవినీతిపై విచారణ జరిపించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'నీది తెలంగాణ భాష కాదు దుర్భాష. నూరు వాగ్దానాల్లో ఒక్కటి పూర్తిచేయలేదు. ఎన్నికల వాగ్దానాలు చిత్తుకాగితాలలా మార్చేశావు. నాలుగేళ్లు బీజేపీతో దోస్తీ కట్టి.. ఇప్పుడేమో థర్డ్ ఫ్రంట్ అంటున్నావు. ఫ్రంట్ ఒక స్టంట్. మమత బెనర్జీ ఫోన్ చేయకున్నా తన నుంచి ఫోన్ వచ్చిందని కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నాడు. మమత కాంగ్రెస్ లేకుండా థర్డ్ ఫ్రంట్ అసాధ్యమని చెప్పింది. అదే విషయాన్ని నేషనల్ ఛానళ్ళకూ ఆమె చెప్పారు. దక్షిణ భారత్‌లో నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలమైన శక్తి. మేంలేకుండా ఏ ఫ్రంట్ వస్తుంది. కేసీఆర్ కు లెక్కలు తెలియవని కాదు.. తెలిసి నటిస్తున్నాడు. ఇలాంటి మోసగాళ్లకు బుద్ధి చెప్పాలి. టీఆర్ఎస్ 106 సీట్లు గెలుచుకుంటుందని చెప్పేందుకు నోరెట్లొచ్చింది. నేను మాట్లాడేది పార్లమెంట్ భాష.. కేసీఆర్ మాట్లాడేది తెలుగు భాష' అంటూ జీవన్‌రెడ్డి సర్కారుపై మండిపడ్డారు.

ఐటీబీపీలో తొలి మహిళా అధికారి

- చరిత్ర సృష్టించిన ప్రకృతి.. కంబాట్ ఆఫీసర్‌గా చేరిక



న్యూఢిల్లీ, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే బిహార్‌కు చెందిన ఓ మహిళ చరిత్ర సృష్టించారు.ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు దళం (ఐటీబీపీ) తొలిమహిళా అధికారిగా బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన పాతికేళ్ల ప్రకృతి ఎంపికయ్యారు. నేరుగా 'కంబాట్ ఆఫీసర్' హోదాలో ఆమె చేరుతుండటం విశేషం. భద్రతా దళాల్లో మహిళా అధికారులను నియమించేందుకు అవకాశం కల్పిస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అదే ఏడాది యూపీఎస్‌సీ నిర్వహించిన కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్) పరీక్షలకు ప్రకృతి హాజరైంది. మంచి ప్రతిభ కనబరచి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది. ఏరికోరి ఐటీబీపీనే ఎంపిక చేసుకుంది. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తిచేసిన ఆమె... త్వరలోనే డెహ్రాడూన్‌లోని ఐటీబీపీకి చెందిన 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ'లో చేరనుంది. శిక్షణ అనంతరం ఆమె అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో విధులు నిర్వర్తించనుంది.

ధీరవనితలకు వైమానిక దళం సెల్యూట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత వైమానిక దళంలో సేవలందించిన ధీరవనితలకు ఐఏఎఫ్ సెల్యూట్స్ చేసింది. ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేసింది. ప్రస్తుతం భారత వైమానిక దళంలో సేవలందిస్తున్న మహిళా ఆఫీసర్లతో పాటు గతంలో సేవలంధించిన సిబ్బంది వీడియోలు, ఫోటోలను ఇందులో పొందుపరిచారు. ఫ్లైయింగ్ ఆఫసర్లు అవని చతుర్వేది, భావన కాంత్, మోహన సింగ్ తదితరులు ఇందులో ఉన్నారు. పురుషులతో కలిసి శిక్షణలో పాల్గొంటున్న మహిళా పైలట్లు, రణరంగంలో సేవలందిస్తున్న వీరవనితలు ఇందులో ఉన్నారు.



బైక్ ఆపలేదని.. గర్భిణి పొట్టపై తన్నిన పోలీస్

- అక్కడిక్కడే మహిళ మృతి.. తిరుచ్చిలో ఘటన
- మహిళా దినోత్సవం రోజే దారుణం

చెన్నై, మార్చి 8: ఓ వైపు ప్రపంచమంతా మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంటే.. మరోవైపు ట్రాఫిక్ పోలీసుల దాష్టికానికి ఓ నిండు గర్భిణీ మృతి చెందింది. ఈ ఘటన తమిళనాడును దిగ్భ్రాంతికి గురిచేసింది. తిరుచ్చిలోని గణేష్ సర్కిల్ వద్ద పోలీసులు ట్రాఫిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో సూలపేటకు చెందిన రాజా, అతని భార్య ఉష బైక్‌పై వెళ్తున్నారు. వారి వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు నిలిపే ప్రయత్నం చేశారు. కానీ రాజా బైక్ ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు మరో వాహనంలో వారిని వెంబడించారు. బైక్ వెనుక కూర్చున్న గర్భిణి ఉష కడుపుపై ఇన్‌స్పెక్టర్ కాలుతో బలంగా తన్నాడు. దాంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ఘటనలో ఉషకు తీవ్ర గాయాలు కావటంలో అక్కడికక్కడే మృతి చెందగా.. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.




కర్ణాటకకు ప్రత్యేక జెండా


- ఆవిష్కరించిన సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 8: కర్ణాటక రాష్ట్రం ప్రత్యేక జెండాను ఆవిష్కరించుకుంది. ఈ జెండా వివరాలను కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ జెండాను కర్ణాటక సీఎం సిద్దరామయ్య గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. గతేడాదే జెండా రూపకల్పన కోసం 9 మంది సభ్యులతో ఓ కమిటీని నియమించారు. జెండా అయితే ఆవిష్కరించారుగానీ.. దానికి కేంద్రం ఆమోదం తెలుపడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తున్నది.

కున్వర్‌బాయిని స్మరించుకున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మార్చి 8: తమ ఆదర్శవంతమైన చర్యల ద్వారా పలువురు మహిళలు మానవజాతి చరిత్రలో చెరగని ముద్ర వేస్తారని పేర్కొంటూ ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్ మిషన్ మస్కట్ కున్వార్ బాయికి నివాళి అర్పించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన ట్విటర్ ఖాతా నుంచి గురువారం పలు ట్వీట్లు చేశారు. తమ జీవితాలను ప్రభావితం చేసిన మహిళలు గురించి ట్విట్లు చేయాలని తన ఫాలోయర్స్‌ను కోరారు. తమ ఆదర్శవంతైన పనుల ద్వారా కొందరు మహిళలు మానవాళి చరిత్రపై చెరగని ముద్ర వేస్తారని, తరతరాలను ప్రభావితం చేస్తారని, మీ జీవితాలను ప్రభావితం చేసిన మహిళల కోసం రాయండి అంటూ మోదీ మహిళా దినోత్సవం సందర్భంగా ట్వీట్ చేశారు. కున్వార్‌బాయి(106) ఇటీవల మరణించారని, ఆమె తన ఆస్తి అయిన రెండు మేకలను అమ్మి ఆ డబ్బుతో ఛత్తీస్‌గఢ్‌లోని కొటాబర్రీ గ్రామంలోని తన ఇంట్లో రెండు మరుగుదొడ్లు నిర్మించారని మోదీ పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కోసం ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. గతంలో ఛత్తీస్‌గఢ్ పర్యటన చేసినప్పుడు కున్వార్ భాయిని కలిసి ఆమె ఆశీర్వాదం తీసుకున్నాని, ఆ క్షణాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటుటానని మోదీ చెప్పారు. మహాత్మాగాంధీ కలలు కన్న క్లిన్ ఇండియాను సాకారం చేసేందుకు కృషి చేస్తోన్న ప్రతి ఒక్కరి హృదయాల్లో కున్వార్‌బాయి ఉంటారని మోదీ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఓ కార్యక్రమంలో కున్వార్‌బాయిని సన్మానిస్తున్నప్పటి ఫొటోలతో పాటు వీడియోను కూడా మోదీ షేర్ చేశారు.



అమృత్‌సర్‌కు 37 కిలోమీటర్ల దూరంలోని భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో గురువారం గస్తీ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ మహిళా జవాన్లు



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద సంబరాల్లో పాల్గొన్న మహిళా ఎంపీలు

మా కోటా మాకివ్వండి

- రాజ్యసభలో గళమెత్తిన మహిళా ఎంపీలు
- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చ
- మహిళా సాధికారత తక్షణావసరం: సుమిత్రా మహాజన్



న్యూఢిల్లీ, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఇవాళ మహిళా ఎంపీలు రాజ్యసభలో మాట్లాడారు. పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీల్లోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎంపీలంతా ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత అంబికా సోని మాట్లాడుతూ..మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉందని అన్నారు. మేమంతా మహిళలతో కలిసే ఉన్నామని కనీసం తీర్మానం ఎందుకు చేయరని ఆమె ప్రశ్నించారు. మహాత్మా గాంధీ ఆశయాలను ఇంకా తీర్చలేకపోయామని మరో ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. మహిళా బిల్లుకు ఆమోదం దక్కాలంటే రాజకీయ విశ్వాసం ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు అవకాశం దక్కకపోవడం వల్ల ఒకశాతం జీడీపీ కోల్పోతున్నామని ఆమె అన్నారు. సమాన హక్కుల కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ కుమారి సెల్జా డిమాండ్ చేశారు. పంచాయతీల్లో మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని, అలాగే పార్లమెంట్‌లోనూ వాళ్లకు అవకాశాలు కల్పించాలని ఎంపీ రజనీ పటేల్ తెలిపారు. రిజర్వేషన్ల వల్లే మహిళలు పంచాయతీల్లో రాణిస్తున్నారని బీజేపీ ఎంపీ సంపతీయ ఉకే అన్నారు. విదేశాంగశాఖ, రక్షణ శాఖలకు మహిళా మంత్రులు ఉన్నట్లు ఆమె గుర్తు చేశారు. నిర్భయ ఫండ్‌ను సరిగా వాడడం లేదని చత్తీస్‌ఘడ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ చయ్యా శర్మ ఆక్షేపించారు. మహిళా రిజర్వేషన్లు అవసరమని కాంగ్రెస్ ఎంపీ వాన్‌సుక్ శెమ్ ఉద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకురావాలని ఎంపీ విప్లవ్ ఠాకూర్ కోరారు. మగవాళ్లు మహిళలను తల్లిగా, కూతురిగా, భార్యగా చూస్తుంటారని, కానీ అది అంతం కావాలని, మహిళను మహిళగా చూడాలని ఎండీకే ఎంపీ కనిమొళి అన్నారు. పెళ్లి అయిన తర్వాత మహిళలు ఉద్యోగాలు వదిలేస్తున్నారన్నారు. దళిత, ఆదివాసీ మహిళలకు ప్రతి రోజూ అన్యాయం జరుగుతోందన్నారు. మహిళా బిల్లుకు అన్ని పార్టీలు సపోర్ట్ ఇస్తున్నాయని, కానీ ఆ బిల్లుకు మాత్రం ఆమోదం దక్కడం లేదన్నారు. మహిళా దినోత్సవాన్ని ఒక్క రోజు మాత్రమే జరుపుకోవడం కాదని, ప్రతి రోజూ పురుషులు మహిళలను ఆత్మీయంగా చూసుకోవాలని ఇండిపెండెంట్ ఎంపీ అనూ ఆగా తెలిపారు. మహిళల పట్ల మహిళలే క్రైమ్‌కు పాల్పడుతున్నారని రూపా గంగూలీ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల పట్ల మైండ్‌సెట్ మారాలని కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ అన్నారు. కాగా, లోక్‌సభ ప్రారంభంకాగానే సభ్యులకు స్పీకర్ సుమిత్రా మహాజన్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు తక్షణ ప్రాతిపదికన సాధికారికత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. మానవత్వానికి పురుషులు, మహిళలు రెండు రెక్కల్లాంటివని, రెండింటికీ సమ ప్రాధాన్యం ఉంటేనే మానవత్వం స్వేచ్ఛగా విహరించగలదని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి వివక్ష చూపకూడదని అన్నారు.



పార్లమెంట్ ఆవరణలో మహిళా ఎంపీలు



లోక్‌సభలో వివిధ పక్షాల ఆందోళన

నాలుగో రోజూ అదే తీరు

- విపక్షాల ఆందోళనలతో ఉభయ సభలు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 8: నాలుగో రోజూ గురువారం కూడా ఉభయ సభలు విపక్షాల ఆందోళనలతో దద్దరిల్లాయి. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానే శుక్రవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభంకాగానే ప్రత్యేక హోదా కోసం టీడీపీ, వైఎస్సార్సీపీ, ముస్లింల రిజర్వేషన్లపై టీఆర్ఎస్, కావేరి జల వివాదంపై ఏఐఏడీఎంకే, పీఎన్‌బీ కుంభకోణంపై టీఎంసీ సభ్యులు ఆందోళనలు కొనసాగించారు. ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ పెద్దపెట్టున నినదించారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించేం దుకు కూడా వీలు లేకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ తొలుత సభను వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొనడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ అదే పరి స్థితి నెలకొంది. సభ ప్రారంభంకాగానే విపక్షాలు ఆయా అంశాలపై ఆందోళనకు దిగారు. అయితే మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చ నిర్వహించేందుకు సభ్యులు అంగీకారం తెలపడంతో చర్చ కొనసాగింది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం కోటా కల్పించాల్సిందేనని, ఇందుకు సంబంధించిన బిల్లును ఆమోదించాలని అన్ని పక్షాలకు చెందిన సభ్యులు అభిప్రాయపడ్డారు. చర్చ ముగియగానే.. టీడీపీ, వైఎస్సార్సీపీ, ఏఐఏడీఎంకే, టీఎంసీ సభ్యులు తిరిగి తమ ఆందోళనలు కొనసాగించారు. వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. దాంతో.. సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లుగా చైర్మన్ స్థానంలో ఉన్న వెంకయ్యానాయుడు ప్రకటించారు.



నాగాలాండ్ సీఎంగా రియో

- ప్రమాణం చేసిన ఎన్‌డీపీపీ నేత

కొహిమా, మార్చి 8: ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్‌లో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. నేషనల్ డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ నాయకుడు నెయిఫియి రియో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నాగాలాండ్ గవర్నర్ పద్మనాభ ఆచా ర్య నెయిఫియి రియోతో ప్రమాణస్వీకారం చేయించారు. రియో ఈ నెల 16వ తేదీలోగా సభలో బలని రూపణ చేసుకోవాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమాఖండూ, అసోం సీఎం సర్బానంద సోనోవాల్, మేఘాలయ సీఎం కన్రాడ్ సంగ్మా, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, కిరణ్ రిజిజు హాజరయ్యారు.

తాలిబన్ల శిబిరంపై అమెరికా డ్రోన్ దాడి

- 21మంది మృతి



ఇస్లామాబాద్, మార్చి 8: ఆఫ్ఘనిస్థాన్‌లో పాక్ తాలిబన్ల శిక్షణ శిబిరంపై అమెరికా డ్రోన్ దాడి చేసింది. తాలిబన్ల స్థావరంపై రెండు మిసైల్స్ వేసింది. ఈ ఘటనలో 21మంది పాక్ తాలిబన్లు మరణించారని, వీరిలో పాకిస్థాన్ తాలిబన్ నాయకుడు కుమారుడు కూడా ఉన్నాడని పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో పాటు తాలిబన్లు ప్రకటించారు. పాక్ సరిహద్దుకు మైళ్ల దూరంలోని ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన కునార్ ప్రావినెన్స్‌లో పాకిస్థానీ తాలి బన్ నాయకుడు ముల్లా ఫజుల్లా ఆధీనంలో ఉన్న శిబిరంపై బుధవారం ఈ దాడి జరిగిం దని అధికారులు వెల్లడించారు. దాడి జరిగిన సమయంలో ఫజుల్లా అక్కడ లేడని, అతని కుమారుడు ఉన్నాడని అతను చనిపోయాడని చెప్పారు.

హదియా 'స్వతంత్ర'గా ఉండొచ్చు


- లవ్ జీహాదీ కేసులో సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ, మార్చి 8: లవ్ జిహాదీ కేసులో అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పును ఇచ్చింది. ఈ కేసులో బాధితురాలిగా పేర్కొంటున్న హదియా పెళ్లిని రద్దు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కొట్టివేసింది. హదియా చేసుకున్నది ప్రేమ వివాహామే నని, అది లవ్ జిహాదీ కేసు కాదని సుప్రీం తన తీర్పులో స్పష్టం చేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. ఈ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తన దర్యాప్తును కొనసాగించవచ్చని కోర్టు పేర్కొంది. హదియాను ప్రేమ పేరుతో బలవంతంగా మతం మార్చి షాఫిన్ జహాన్ అనే ముస్లిం యువకుడు పెళ్లి చేసుకున్నాడని, ఈ తరహా లవ్ జీహాదీ ప్రక్రియ కేరళలో ఎక్కువగా సాగుతోందని ఎన్ఐఏ తెలపడంతో గత ఏడాది ఆగస్టులో దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం దీనిపై సుప్రీంలో జరిగిన విచారణ సందర్భంగా హదియాను శారీరకంగా, మానసికంగా అపహరించారని గురువారం ఆమె తండ్రి అశోకన్ ఆరోపించారు. అయితే ఆమె మేజర్ అని, ఆమె స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలదని కోర్టు అభిప్రాయపడింది. హదియా ఎవరి కస్టడీలోనూ ఉండాల్సిన అవసరం లేదని, నచ్చిన విధంగా ఆమె తన జీవితాన్ని కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ఆమె తన చదువులను పూర్తి చేసుకోవచ్చని, తనకు కావాల్సిన వారితో జీవించవచ్చని స్పష్టం చేసింది. బలవంతంగా ఆమెను ఎవరితోనూ పంపాల్సిన అవసరం లేదని కోర్టు తెలిపింది.

దావూద్ అనుచరుడి అరెస్టు

- 1993 ముంబై పేలుళ్లలో నిందితుడు
- దుబాయ్ పారిపోయిన ఫరూఖ్ టక్లా
- అక్కడి నుంచి డిపోర్టేషన్.. ఢిల్లీలో అరెస్ట్



న్యూఢిల్లీ, మార్చి 8: దాదాపు పాతికేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు ఫరూఖ్ టక్లాను ఎట్టకేలకు సీబీఐ అరెస్టు చేసింది. దుబాయ్ ప్రభుత్వం ఇతడిని డిపోర్ట్ చేయడంతో కలుగు లోనుంచి బయట పడ్డాడు. దీంతో కేంద్ర నిఘా వర్గాల సాయంతో ఢిల్లీ చేర్చి.. ఇక్కడి రాగానే ఇమిగ్రేషన్ కౌంటర్ వద్ద అతడిని సీబీఐ పోలీసులు అరెస్టు చేశారు. 1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో నిందితుడైన ఇతడు అప్పట్లో దుబాయ్ పారిపోయాడు. ఈ పేలుళ్లలో 257 మంది మరణించగా.. 82 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ఈ కేసులో విచారణ ఆరంభించిన సీబీఐ 1995లో టక్లాపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించింది. ఇటీవలే దుబాయ్ నుంచి డిపోర్ట్ చేయడంతో గురువారం ఢిల్లీ తీసుకొచ్చారు. అక్కడ అరెస్టు చేసిన సీబీఐ.. టాడా కోర్టులో ప్రవేశపెట్టేందుకు ముంబైకి తరలించింది.

కాగా, అతడు దుబాయ్‌లో దావూద్ గ్యాంగ్ వ్యవహారాలను ఇతడే చూస్తున్నాడని సీబీఐ అధికారులు చెబుతున్నారు. టక్లా దొరకడం దావూద్ గ్యాంగ్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని సీనియర్ న్యాయవాది ఉజ్వల్ నికమ్ అన్నారు. ఇది చాలా పెద్ద విజయమని, 1993 బాంబు పేలుళ్లలో టక్లా హస్తం ఉందని చెప్పారు. అతడి లింకులు దుబాయ్ వరకు ఉన్నాయని, అలాంటి వాడు దొరకడం డి-గ్యాంగుకు భారీ ఎదురుదెబ్బే అవుతుందని అన్నారు. దావూద్ ఇబ్రహీం కూడా భారతదేశానికి వచ్చేయాలనే అనుకుంటున్నాడని, అయితే అందుకు అతడు కొన్ని షరతులు విధించడం, అవి భారత ప్రభుత్వానికి సమ్మతం కాకపోవడంతో అది సాధ్యం కావట్లేదని ప్రముఖ క్రిమినల్ న్యాయవాది శ్యామ్ కేస్వానీ రెండు రోజుల క్రితమే చెప్పారు. తనను అత్యంత పటిష్ఠమైన భద్రత ఉండే ఆర్థర్ రోడ్ సెంట్రల్ జైల్లో మాత్రమే ఉంచాలన్నది దావూద్ ప్రధాన డిమాండ్లలో ఒకటి. కేంద్ర ప్రభుత్వంతో దావూద్ ఇబ్రహీం సెటిల్‌మెంటు చర్చలలో ఉన్నాడని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే కూడా గతంలో వ్యాఖ్యానించారు. దావూద్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని, చివరి రోజుల్లో భారతదేశంలో గడపాలనుకుంటున్నాడని కూడా రాజ్ అన్నారు. 1993 మార్చి 12వ తేదీన ముంబై మహానగరంలో జరిగిన వరుస పేలుళ్లలో దాదాపు 257 మంది మరణించగా 700 మందికి పైగా గాయపడ్డారు. ఆ పేలుళ్ల ప్రధాన సూత్రధారి దావూద్ ఇబ్రహీం. ఆ దాడి తర్వాత అతడు పాకిస్థాన్, దుబాయ్ తదితర దేశాలకు వెళ్లిపోయి అక్కడే తలదాచుకుంటున్నాడు.

కొనసాగుతున్న విగ్రహ విధ్వంసాలు

- తమిళనాడులో అంబేడ్కర్ విగ్రహంపై నల్లరంగు
- కేరళలో గాంధీ విగ్రహం కూల్చివేత..ఒకరి అరెస్టు



చెన్నై/ కన్నూర్, మార్చి 8: విగ్రహాల విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఓవైపు హెచ్చరికలు వినిపిస్తున్నా.. దుండుగులు దురాగతాలకు పాల్పడుతూనే ఉన్నారు. త్రిపురలో మొదలైన విగ్రహం కూల్చివేతకు కొనసాగింపుగా.. గురువారం కూడా తమిళనాడు, కేరళలో మహనీయుల విగ్రహాలను అవమానపర్చిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. తమిళనాడు రాజధాని చెన్నైలోని తిరువొత్రియూర్‌లో రాజ్యాంగ పిత అంబేద్కర్ విగ్రహానికి నల్లరంగు పూసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాంతో స్థానికులు, దళితులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, కేరళలోని కన్నూర్ జిల్లాలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కేరళ పోలీసులు అరెస్టు చేశారు. గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిగా భావిస్తున్న మానసిక రోగిని కన్నూర్ జిల్లాలోని తలిపరంబలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విగ్రహాన్ని ధ్వంసం చేయడం వెనుక ఎలాంటి రాజకీయ సంబంధం లేదని పోలీసులు తేల్చిచెప్పారు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన తర్వాత దేశ వ్యాప్తంగా పలుచోట్ల మహానేతల విగ్రహాల ధ్వంసం కొనసాగుతోంది. తమిళనాడులో పెరియార్, యూపీలో అంబేద్కర్, పశ్చిమ బెంగాల్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ విగ్రహాలను ధ్వంసం చేశారు. తాజాగా చెన్నైలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహంపై గుర్తుతెలియని వ్యక్తులు పెయింటింగ్ పూయడం కలకలంరేపుతోంది.

హరిద్వార్‌లో శ్రీదేవి అస్థికల నిమజ్జనం



హరిద్వార్, మార్చి 8: దివంగత బాలీవుడ్ నటి శ్రీదేవి అస్థికలను హరిద్వార్ వద్ద గంగా నదిలో నిమజ్జనం చేశారు. బోనీ కపూర్ హరిద్వార్‌లోని వీఐపీ ఘాట్ వద్ద శ్రీదేవి అస్థికలను నిమజ్జనం చేశారు. బోనీకపూర్‌తోపాటు అనిల్‌కపూర్, మనీశ్ మల్హోత్రా, కుటుంబ సభ్యులు, సమాజ్‌వాదీ పార్టీ నేత అమర్‌సింగ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్ది రోజుల క్రితం తమిళనాడులోని రామేశ్వరంలోనూ శ్రీదేవి అస్థికలను బోనీ, కపూర్ కుటుంబస భ్యులు నిమజ్జనం చేసిన విషయం తెలిసిందే.



అమర్ అక్బర్ ఆంటోనీ ప్రారంభం

'వెంకీ', 'దుబాయ్ శీను' చిత్రాల తర్వాత రవితేజ, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోని'. అను ఇమ్మానుయేల్ కథానాయికగా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సి.వి.ఎం(మోహన్) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు శ్రీనువైట్ల పెద్ద కుమార్తె ఆనంది క్లాప్ కొట్టగా.. రెండవ కుమార్తె ఆద్య కెమెరా స్విచ్చాన్ చేసింది. తొలి సన్నివేశానికి శ్రీను వైట్ల గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనువైట్ల మాట్లాడుతూ ''రవితేజతో చేస్తున్న మూడో సినిమా ఇది. పది నెలలపాటు కష్టపడి స్క్రిప్ట్ వర్క్ చేశాం. రవితేజతో పాటు మా నిర్మాతలకు కూడా కథ బాగా నచ్చింది. షూటింగ్ మొత్తం యునైటెడ్ స్టేట్స్‌లోనే చేస్తాం. న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్ సిటీ మరియు ఇతర లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపనున్నాం. అత్యధిక శాతం అమెరికాలో చిత్రీకరణ జరుపుకోనున్న మొట్టమొదటి చిత్రమిది. స్టార్ కమెడియన్ కమ్ హీరో సునీల్ ఈ చిత్రంలో ఫుల్ లెంగ్త్ కామిక్ రోల్ చేస్తున్నారు. నిన్నటితరం కథానాయకి లయ, ఆమె కుమార్తె శ్లోక ఈ చిత్రంలో కీలకపాత్రల్లో నటిస్తున్నారు. అలాగే రవితేజ తనయుడు మహాధన్ మరో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు'' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ''మా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థకి 'అమర్ అక్బర్ ఆంటోనీ' చాలా స్పెషల్ ప్రాజెక్ట్. ఈ చిత్రం రెగ్యులర్ షూట్ త్వరలో ప్రారంభం అవుతుంది. ఎస్.ఎస్. థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు'' అన్నారు.

నాలుగోసారి కన్‌ఫర్మ్

'ఏ మాయ చేసావె', 'మనం', 'ఆటోనగర్ సూర్య' చిత్రాల తర్వాత అక్కినేని నాగచైతన్య, సమంత కలిసి జంటగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందనుంది. ముఖ్యంగా పెళ్ళైన తర్వాత ఈ జంట కలిసి వెండితెరపై కనిపించనుండడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది మాట్లాడుతూ ''నాగచైతన్య-సమంత జంటగా 'నిన్ను కోరి' ఫేం శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం త్వరలో సెట్స్‌కి వెళ్లనుంది. మా సంస్థలో నిర్మితమవుతున్న 'కష్టార్జున యుద్ధం' ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతుంది. నాగచైతన్య,సమంతల కాంబినేషన్ చిత్రానికి సంబంధించిన పూర్తి సమాచారం, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు.



● చైతన్య, సమంత



'హలో గురు ప్రేమ కోసమే' అంటున్న రామ్

రామ్ హీరోగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ నిర్మాణంలో కొత్త చిత్రం 'హలో గురు ప్రేమకోసమే' గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. త్రినాథ రావు నక్కిన దర్శకుడు. ముహూర్తపు సన్నివేశాకి అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, వంశీ పైడిపల్లి క్లాప్ కొట్టారు. హరీశ్ శంకర్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. రామ్ సరసన అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ మార్చి 12 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీత సారథ్యం వహిస్తున్నారు. విజయ్ కె.చక్రవర్తి సినిమాటోగ్రఫీ, సాహి సురేశ్ ఆర్ట్ వర్క్, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ వర్క్ అందిస్తున్నారు. 'సినిమా చూపిస్త మావ, నేను లోకల్' వంటి వరుస విజయాలు తర్వాత త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో వస్తోన్న సినిమా కావడంతో పాటు.. దిల్‌రాజు, రామ్ కాంబినేషన్ లో రూపొందుతున్న చిత్రం కానుండటంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. బెజవాడ ప్రసన్నకుమార్ మాటలు.. రచన సహకారం సాయికృష్ణ అందిస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మిగతా వివరాలను తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.



● నయనతార

పొలిటికల్ డ్రామాగా 'కర్తవ్యం'

తమిళంలో విజయం సాధించిన 'ఆరమ్' చిత్రాన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. ఆర్.రవీంద్రన్, శరత్ మరార్ నిర్మాతలు. ఇది ఒక పొలిటికల్ డ్రామా. నయనతార జిల్లా కలెక్టర్ పాత్రలో నటించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని మార్చి 16న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''తమిళం లో 'ఆరమ్' చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగు లో కూడా మంచి విజయం సాధిస్తుంది అని నమ్మకం ఉంది. తెలుగులో అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి మార్చి 16న సినిమాను విడుదల చేస్తున్నాం. బోరు భావిలో ఆడుకుంటున్న పిల్లలు పడిపోతే, అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయి. అక్కడ జరిగే ఆపరేషన్‌ను కథా వస్తువుగా తీసుకుని అందరి హృదయాలను హత్తుకునేలా.. అద్భుతమైన నేరేషన్‌తో దర్శకుడు గోపి నైనర్ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రానికి జీబ్రాన్ సంగీతం, ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీఅందించారు '' అన్నారు.

నిఖిల్ చిత్రం టైటిల్!



యువ కథానాయకుడు నిఖిల్ కొత్త చిత్రం 'కిరాక్ పార్టీ' ఈ నెల 16న విడుదలకి సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ సినిమా తరువాత తమిళ చిత్రం 'కణితన్' రీమేక్‌లో నటించబోతున్నారు ఈ యంగ్ హీరో. ఒరిజినల్ వెర్షన్ డైరెక్టర్ టి.ఎస్. సంతోష్ ఈ రీమేక్‌ను టేకాఫ్ చేస్తున్నారు. కథానాయిక ఇంకా ఎంపిక కాని ఈ చిత్రానికి 'ముద్ర' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం రావాల్సి ఉంది. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుంది.

సుదీప్ 'కోటికొక్కడు'

సుదీప్, నిత్యామీనన్ జంటగా .. కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో కన్నడ, తమిళ్ భాషల్లో రూపొందిన చిత్రం 'కోటిగొబ్బ-2'. దుహర మూవీస్ పతాకంపై ఈ చిత్రాన్ని కళ్యాణ్ ధూళిపాళ్ల 'కోటికొక్కడు' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రం నేడు రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా కళ్యాణ్ ధూళిపాళ్ల మాట్లాడుతూ '''రచయిత' తర్వాత మా బ్యానర్‌లో వస్తోన్న చిత్రం 'కోటికొక్క డు'. కన్నడలో 'కోటిగొబ్బ-2' చిత్రం 120 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని 'కోటికొక్కడు' పేరుతో తెలుగులో రిలీజ్ చేస్తున్నాను. ఈ చిత్రాన్ని ఈ శుక్రవారం 300 థియేటర్లకుపైగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వి.సముద్ర, సి.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



● సుదీప్, నిత్యామీనన్

అందుకే ఆలస్యం

సువర్ణ క్రియేషన్స్ పతాకంపై జాన్ బాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తొలి కిరణం'. భానుచందర్ ముఖ్య పాత్రలో, పి.డి.రాజు యేసు క్రీస్తు పాత్రలు పోషించారు. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో భానుచందర్ మాట్లాడుతూ ''తొలికిరణం అంటే 'ఫస్ట్ లైట్' అని అర్థం. క్రీస్తు పుట్టిన దగ్గరనుంచి చనిపోయే దాకా ఉన్న కథలు మాత్రమే మనకు తెలుసు. 'తొలికిరణం' అలా కాదు ఆయన చనిపోయి 3 రోజుల తరువాత బ్రతికి వచ్చి ఏం చేసాడు.. భక్తులకు ఏం బోధించాడు అనే కాన్సెప్ట్‌తో వస్తున్న మొదటి సినిమా ఇది. ఇజ్రాయిల్ వెళ్లి రీసెర్చ్ చేసి ఈ సినిమా తీశారు. క్రీస్తు పాత్రలో పి.డి రాజు ఒదిగిపోయారు. డైరెక్టర్ జాన్ బాబు మాట్లాడుతూ ''ఈ చిత్రంలో గ్రాఫిక్స్ వర్క్ లండన్‌లో జరుగుతుంది. అందువల్ల సినిమా విడుదల ఆలస్యం అవుతోంది. 8 కోట్ల బడ్జెట్‌తో తీసిన చిత్రం ఇది. నా నెక్స్ మూవీ భానుచందర్‌గారి అబ్బాయి జయంత్‌తో చేస్తాను'' అన్నారు. క్రీస్తు పాత్రలో పోషించడం ఆనందంగా ఉందని పి.డి.రాజు తెలిపారు.



షకీలా 250వ సినిమా

'జి' స్టూడియోస్ సమర్పణలో షకీలా నటించిన 250వ సినిమా 'శీలవతి'. రాఘవ ఎమ్ గణేష్, వీరు బాసింశెట్టి నిర్మాతలు. సాయిరామ్ దాసరి దర్శకుడు. కేరళలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షకీలా మాట్లాడుతూ ''ఈ చిత్రం నాకు చాలా స్పెషల్. నా 250వ చిత్రంలో ఇంపార్టెన్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నాను. మే లో సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అని తెలిపారు. నిర్మాత గణేష్ మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో వస్తున్న మొదటి సినిమా. షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అన్నారు. మరో నిర్మాత వీరు బాసింశెట్టి మాట్లాడుతూ ''ఇంతకు ముందు రెండు సినిమాలకు నిర్మాతగా వ్యవహరించినా సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'శీలవతి'. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను'' అన్నారు. దర్శకుడు సాయిరామ్ దాసరి మాట్లాడుతూ ''నిర్మాతలిద్దరూ చాలా మంచి సపోర్ట్‌ను అందించారు. ఈ సినిమా చూశాక.. ఇంతకు ముందు షకీలా వేరు ఈ సినిమా తరువాత షకీలా వేరు అని అంటారు'' అని తెలిపారు.



యాడ్ ఏజెన్సీ ఓనర్ పాత్రలో...

'రక్షకభటుడు' సినిమా తర్వాత శ్రీధర్ సీపాన దర్శకత్వంలో 'బృందావనమది అందరిది' చిత్రంలో రిచాపనయ్ నటిస్తుంది. కామిక్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమాలో తన పాత్ర గురించి రిచా పనయ్ కొన్ని విషయాలను తెలియజేసింది. 'ఇప్పటి వరకు నేను చేసిన సినిమాల్లో విలేజ్ అమ్మాయి లేదా గ్లామర్ పాత్రల్లోనే నటించాను. అయితే ఇప్పుడు చేస్తోన్న పాత్ర వీటికి భిన్నంగా ఉంటుంది. ఓ యాడ్ ఏజెన్సీ ఓనర్ పాత్రలో కనపడతాను. కాబట్టి ట్రెడిషనల్, వెస్టన్ లుక్స్‌లో కనపడతాను. అంతే కాకుండా సినిమా మధ్యలో పాత్ర డిఫరెంట్ షేడ్‌లోకి మారుతుంది. తప్పకుండా తెలుగులో నాకు ఈ సినిమా ఓ మంచి గుర్తింపు తెస్తుందని భావిస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది రిచాపనయ్.



● రిచాపనయ్

ఈ నెల 16న 'దండుపాళ్యం 3'

బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన తారాగణంగా శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన 'దండుపాళ్యం' సీక్వెల్ 'దండుపాళ్యం 3'. ఈ నెల 16న తెలుగు, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. తెలుగులో ఈ చిత్రాన్ని సాయికృష్ణ ఫిలింస్ సమర్పణలో.. శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి, సాయికృష్ణ పెండ్యాల సంయుక్తంగా తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ '''దండుపాళ్యం 3' ఈ నెల 16న విడుదలవుతుంది. ఈ సినిమా తర్వాత మరో రెండు, మూడేళ్ల వరకు ఈ జోనర్‌లో సినిమాలు చేయను. మూడు పార్టులకు కొంత మంది నటీనటులే తప్ప మిగతా అందరూ వారే నటించారు. అందరూ బాగా కష్టపడ్డారు. ఈ సిరీస్ నాతో పాటు బాగా కష్టపడ్డ వ్యక్తి మాటలు రాసిన రమేష్‌గారు, ఎడిటర్ రవిచంద్రన్, సినిమాటోగ్రాఫర్ వెంకట్ ప్రసాద్ అందరికీ థాంక్స్. ఈ సినిమాకు సంబంధించి నేను మళ్లీ మరో సీక్వెల్ పార్ట్ చేయను'' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ''మార్చి 16న విడుదలవుతున్న 'దండుపాళ్యం 3'పై మంచి అంచనాలున్నాయి.. తప్పకుండా తొలి రెండు భాగాలను మించేలా మూడో భాగం ఉంటుంది'' అన్నారు.



● పూజా గాంధీ

ప్రజల సెంటిమెంటే ముఖ్యం

హామీల అమలులో కేంద్రం జాప్యం.. ఏపీ కోరుకున్నట్టుగా సాయం లేదు

మేం చాలాకాలం ఎదురు చూశాం.. హోదా ఇవ్వకపోవడంతో ప్రజల్లో వేదన

వారి మనోభావాల మేరకు నిర్ణయం.. బాబు ఆదేశాల మేరకు రాజీనామా

ఇప్పుడు మాకు మరింత స్వేచ్ఛ వచ్చింది.. ఏపీ కోసం పోరాటం కొనసాగిస్తాం

మీడియా సమావేశంలో అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి






న్యూఢిల్లీ, మార్చి 8: విభజన చట్టం హామీల అమలులో కేంద్రం జాప్యం చేసిందని.. ప్రత్యేక హోదా హామీని విస్మరించిందని.. ప్రజల సెంటిమెంటును గౌరవించి టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేసినట్టు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం శాయశక్తులు కృషి చేశామని, చాలా కాలం ఎదురు చూశామని చెప్పారు. అయినా ఏపీ కోరుకున్నట్టుగా కేంద్రం సాయం చేయలేదని, కేంద్ర వైఖరికి నిరసనగా రాజీనామా చేశామని వెల్లడించారు. గురువారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీని కలసి రాజీనామా లేఖలను అందజేసిన అనంతరం అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి టీడీపీ ఎంపీలతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్డీయే మిత్రపక్షంగా టీడీపీ తరఫున కేంద్ర మంత్రిగా దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని, ఇందుకు ప్రధాని మోదీకి అశోక్ గజపతి రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల రీత్యా, టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రి పదవులకు రాజీనామా చేశామని పేర్కొన్నారు. మంత్రి పదవులకు రాజీనామా చేసినా ఎన్డీయేలో కొనసాగుతామని స్పష్టం చేశారు. ఏపీ సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేశామని, కేంద్రానికి, ప్రధానికి తమ సమస్య ఏంటో తెలుసునని చెప్పారు. జాతీయ పార్టీలు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగాలని చంద్రబాబు సరైన సమయంలో చంద్రబాబు సముచిత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. తమ రాజీనామాను ఆమోదించాలని ప్రధాని మోదీని కోరామని అశోక్ గజపతి రాజు తెలిపారు. సుజనా చౌదరి మాట్లాడుతూ.. కేంద్రం నుంచి వైదొలగడం దురదృష్టకరమైన మరో మార్గం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే విభజన చట్టంలో ఏపీ ప్రయోజనాలకు సంబంధించి పలు అంశాలను చేర్చారని తెలిపారు. విభజన హామీల అమలులో కేంద్రం జాప్యం చేసిందని, ఏపీ కోరుకుంటున్నట్టుగా సాయం చేయలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా ఇస్తారని ఏపీ ప్రజలు విశ్వసించారని, కేంద్రం హామీని విస్మరించడంతో ప్రజలు వేదనకు గురయ్యారని అన్నారు. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీని సరిగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల సెంటిమెంటును గౌరవించి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కేంద్ర మంత్రులుగా కంటే ఎంపీలుగానే ఎక్కువగా పోరాడగలమని సుజనా అన్నారు. రాజీనామా చేయడంతో తమకు మరింత స్వేచ్ఛ లభించిందని, ఏపీ ప్రయోజనాల కోసం పార్లమెంటులో పోరాడుతామని స్పష్టం చేశారు. ఎన్డీయేకు మిత్రపక్షంగా ఉన్నా విభజన చట్టం ప్రకారం రాష్ట్ర ప్రయోజనాలను సాధిస్తామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఏపీ సమస్యలు వివరించామని, విభజన చట్టం హామీలను అమలు చేయాలని కోరామని వెల్లడించారు. ఏపీకి అండగా ఉంటామని మోదీ హామీ ఇచ్చారని తెలిపారు. ఏపీ సమస్యల కోసం కేంద్రంతో కలసి పని చేస్తామని చెప్పారు. మోదీ, చంద్రబాబు ఫోన్ సంభాషణ గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. వారు ఏం మాట్లాడుకున్నారో తమకు తెలియదని సుజనా చౌదరి సమాధానమిచ్చారు. కేంద్రంతో సయోధ్య కుదిరితే రాజీనామా లేఖలను వెనక్కి తీసుకుంటారా అని ప్రశ్నించగా.. చంద్రబాబు నిర్ణయం మేరకు నడుచుకుంటామని బదులిచ్చారు. చంద్రబాబు నిర్ణయం మేరకు తదుపరి వ్యూహం అమలు చేస్తామని, ప్రత్యేక హోదా కోసం పోరాడుతామని సుజనా చౌదరి చెప్పారు.

చంద్రబాబు గొప్ప వ్యక్తి

ఆయన దగ్గర పనిచేయడం అదృష్టం

- హోదా ఇవ్వలేదని దోషిగా చూస్తున్నారు
- అందుకే రాజీనామా చేస్తున్నా
- నా శాఖలో సంస్కరణలు తీసుకొచ్చా
- ఎవరి వద్దా ఒక్క రూపాయి తీసుకోలేదు
- ఉద్వేగంతో ప్రసంగించిన కామినేని




అమరావతి, మార్చి 8 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి గొప్పవ్యక్తిని తానెప్పుడూ చూడలేదని కామినేని శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు సీఎం కావడం రాష్ట్రం చేసుకున్న అదృష్టమన్నారు. అలాంటి నాయకుడి దగ్గర పనిచేసే అవకాశం రావడం గర్వంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు చాలా కష్టపడుతున్నారని, ఆయనతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి హోదాలో తాను సమర్థంగా పనిచేశానని, తాను అజాత శత్రువునని స్వాక్షాత్తూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారని కామినేని వెల్లడించారు. ఈ మూడున్నరేళ్లలో సీఎం చంద్రబాబు పనితీరును చాలా దగ్గరగా చూశానని, ఆయన పనితీరు అందరికీ ఆదర్శమన్నారు. గురువారం తన రాజీనామాను ముఖ్యమంత్రికి ఇచ్చిన అనంతరం సభలోకి వచ్చారు. కామినేని ఎంతో ఉద్వేగంతో రాజీనామాలపై సభలో ప్రసంగించారు. నాలుగేళ్లలో మంత్రిగా తన పనితీరు విషయంలో కూడా చంద్రబాబు ఎప్పటికప్పుడు ప్రోత్సహించారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఎంతో మంది స్నేహితులను సంపాదించుకున్నానని, ఎన్నడూ అవినీతికి పాల్పడలేదని తెలియజేశారు. 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి, తర్వాత రాజకీయాలకు దూరంగా ఉండి ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆహ్వానం మేరకు తాను బీజేపీలో చేరానని చెప్పారు. బీజేపీ అధిష్ఠానం, ముఖ్యంగా ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు తన ఎదుగుదలకు ఎంతో దోహదపడ్డారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో బీజేపీని దోషిగా చూపే ప్రయత్నం జరుగుతోందని, ఈ నేపథ్యంలోనే తాను రాజీనామా చేస్తున్నానని వివరణ ఇచ్చారు. తాను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు బీజేపీనే కారణమన్నారు. తాను బాధ్యతలు నిర్వర్తించినంత కాలం ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఎవరి వద్ద ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పారు. రాజకీయ జీవితంలో నిజాయితీగా బతికానని చెప్పారు. కావాలని కొన్ని పత్రికలు తనమీద లేని పోని ఆరోపణలతో రాశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, చేసి ఉంటే సర్వనాశనం అవుతాయని కాణిపాకం వినాయకుడి సాక్షిగా ప్రమాణం చేయటానికి రేపే కాణిపాకం వెళుతున్నానని వెల్లడించారు. తన శాఖ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించిన ప్రతి ఒక్క సభ్యుడికీ కామినేని ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబు సమర్థతకు పోటీ లేదు

కేంద్ర సహకారంతోనే అభివృద్ధి.. బీజేపీ శత్రువు కాదు మిత్రపక్షమే

- భవిష్యత్తులోనూ కేంద్రం అండ
- అసెంబ్లీలో మాణిక్యాల రావు



అమరావతి, మార్చి 8 (మనం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థతకు ఎవరూ పోటీ కాదని మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ నేత మాణిక్యాలరావు ప్రశంసించారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకోకముందే రాష్ట్రం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని, పోలవరం ముంపు మండలాలు సాధించారని చెప్పుకొచ్చారు. చంద్రబాబు సమర్థత, కేంద్రం సహకారంతోనే ఏపీలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఏపీకి బీజేపీ శత్రువు కాదు.. మిత్రపక్షమే అని మాణిక్యాలరావు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఏపీకి కేంద్రం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాజీనామా చేసినా కూడా రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాణిక్యాలరావు తెలిపారు. మంత్రిగా అవకాశం ఇచ్చి సహకరించిన చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో తనకు సహకరించిన సోము వీర్రాజు, తాడేపల్లిగూడెం ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు పుష్కరాలు(కృష్ణా, గోదావరి) నిర్వహించే అదృష్టం తనకు దక్కిందని, దేవాదాయశాఖలో పలు మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేశానని చెప్పుకొచ్చారు. గతంలో స్మార్ట్‌ఫోన్ ఎలా వాడాలో కూడా తనకు తెలియదని.. చంద్రబాబు స్ఫూర్తితోనే తాను కంప్యూటర్ ఆపరేటింగ్ నేర్చుకున్నానని అసెంబ్లీలో మాణిక్యాలరావు అన్నారు. విభజన సమయంలో ఏపీ కోసం రాజ్యసభలో వెంకయ్య పోరాడారని.. కానీ వెంకయ్యను రాష్ట్రం ముందు ద్రోహిగా నిలబెట్టడం దురదృష్టకరమన్నారు. బీజేపీని కూడా దోషిగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ వ్యతిరేకించినా... కేంద్రం పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపిందని గుర్తుచేశారు. పోలవరంపై ప్రధాని మోదీ చిత్తశుద్ధిని ఏపీ ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. రాష్ట్ర విభజన వల్లే అమరావతి వచ్చిందన్న ఆయన, పోలవరం నిర్మాణం జరుగుతోందని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మాణిక్యాలరావు తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు తెలియకుండా ఎవరినైనా బాధ పెట్టి ఉంటే తనను క్షమించాలని మాణిక్యాలరావు సభలో సభ్యులందరికీ చేతులెత్తి నమస్కరించారు.

ఇదే ఆఖరి రిప్రజెంటేషన్..

రాష్ట్ర మంత్రిగా ఆఖరి రిప్రజెంటేషన్‌ను ముఖ్యమంత్రికి అందించానని మాణిక్యాలరావు చెప్పారు. దానిలో తాడేపల్లిగూడెం మెడికల్ కాలేజీ మంజూరు, ఏడీజే కోర్టు, ఇటీవల కాల్వలో పడి మరణించిన వ్యక్తికి ఆర్థిక సహాయం చేయాలని పేర్కొన్నానన్నారు. మెడికల్ కాలేజీ, ఏడీజే కోర్టులను పరిశీలిస్తానని, మరణించిన కుటుంబానికి చంద్రబాబు పెద్దమనసుతో రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేశారని మాణిక్యాలరావు సభలో వెల్లడించారు.

గిరిజన యువతకు శిక్షణ

పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సాహం

ఆర్థిక స్వావలంభనకు తెలంగాణ ప్రయత్నాలు..

తొలివిడతగా 50 కోట్లతో సీఎంఈఐ పథకం ప్రారంభం



హైదరాబాద్, మార్చి 8(మనం ప్రతినిధి): సృజనాత్మక ఆలోచనలు ఉన్నా ఆర్థిక స్థోమతలేక అట్టడుగు స్థాయిలోనే మిగిలిపోతున్న గిరిజన యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. గిరిజన యువత అభ్యున్నతే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపింది. యువత ఆర్థిక స్వాలంభన సాధించే దిశగా సీఎం ఎంటర్‌ప్రెన్యూరేషన్ అండ్ ఇన్నోవేషన్ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కొత్త పథకం ఉపయోగపడుతుందని పేర్కొంది. ఆలోచనలు ఉన్నా ఆర్థిక స్థోమతలేని గిరిజనులకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలమేరకు గిరిజన సంక్షేమశాఖ నైపుణ్యంగల యువతను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసే దిశగా చర్యలు చేపడుతోంది. చదువుతో పాటు నైపుణ్యం ఉన్నా ఆర్థిక స్థోమతలేక ఎంతోమంది గిరిజనులు రాణించలేకపోతున్నారనే విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ గుర్తించింది. పథకాలు ప్రవేశపెడ్తున్నా అవి ఆర్థికంగా యువతను ఉన్నత స్థానంలోకి తీసుకెళ్లకపోవటాన్ని అధికారులు గుర్తించారు. తామే చేదోడుగా ఉంటూ గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసేందుకు అవసరమైన శిక్షణను ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగానూ మొదటి దశలో రూ.50 కోట్లతో ఈ పథకాన్ని ఈ నెలాఖరులో ప్రారంభించేందుకు అధికారులు ముమ్మరంగా చర్యలు చేపడ్తున్నారు. ఇందులో భాగంగానే పదో తరగతి నుంచి ఉన్నత విద్యాభ్యాసంచేసిన యువత నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు గిరిజన శాఖకు దాదాపుగా 1200 దరఖాస్తులు అందాయి. ప్రధానంగా ఉత్పత్తి కేంద్రాల(మాన్యుఫాక్చరింగ్ సెంటర్ల)ను నెలకొల్పేలా యువతకు శిక్షణ ఇవ్వనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇంక్యూబేషన్ కేంద్రం ద్వారా యూనిట్లు స్థాపించే విధంగా చర్యలు చేపడ్తున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. దాదాపుగా వంద మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన వృత్తినైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల ఎంపికచేసే పనిలో గిరిజన సంక్షేమ శాఖ నిమగ్నమైంది. మూడు నెలల పాటు బృందాలుగా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. అనుభవజ్ఞులైన వారితో పాటు పలు సంస్థల ప్రతినిధులతో శిక్షణను ఇప్పించేందుకు అధికారులు చర్యలు చేపడ్తున్నారు.

అన్నీ తామేగా మారి..

గిరిజన యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేసే క్రమంలో ప్రభుత్వం అన్నీ తామే అన్న విధంగా ముందుకు రావటం విశేషం. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు యూనిట్ ఏర్పాటుకు అవసరమైన ఫైనాన్షియల్, మార్కెటింగ్ లింకేజీ విషయంలోనూ గిరిజన సంక్షేమ శాఖ సహాయం అందించనుంది. 40శాతం గిరిజన సంక్షేమ శాఖ, 10శాతం అభ్యర్థి, 50శాతం బ్యాంకు ద్వారా రుణం అందించేలా శాఖ ఏర్పాట్లు చేస్తుంది. పలువురు గిరిజన యువత ఆర్థిక స్థోమత ఉన్నవారు సరైన అవగాహనలేక తమ స్కిల్స్‌ను ఉపయోగించుకోలేకపోతున్నారు. నైపుణ్యం ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడేవారున్నారు. ఈ క్రమంలో రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు విలువ గల యూనిట్ల స్థాపనకు యువతను గిరిజన సంక్షేమ శాఖ ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేపట్టిందని ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్ద చదువులు చదివి, స్కిల్ ఉండి ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



పోరాటం ఆగదు

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి.. పార్లమెంటులో ఎంపీల నిరసన

- టీడీపీ, వైసీపీ సభ్యుల నినాదం
- కేంద్రం మోసం చేసింది: శివప్రసాద్
- ఢిల్లీలో ఏపీ కాంగ్రెస్ నేతల ధర్నా

న్యూఢిల్లీ, మార్చి 8: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టం హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎంపీలు వరుసగా నాలుగో రోజు గురువారం పార్లమెంటు లోపలా, బయటా ఆందోళన చేపట్టారు. ఉభయసభలు ప్రారంభం కాగానే నినాదాలు చేశారు. ఇతర సమస్యలపై వివిధ పార్టీల ఎంపీలు కూడా ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. పార్లమెంటు ప్రాంగణంలో టీడీపీ, వైసీపీ ఎంపీలు పోటాపోటీగా ధర్నా చేశారు. ఆవరణలోని గాంధీ విగ్రహం దగ్గర టీడీపీ ఎంపీలు నిరసన తెలిపారు. సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. కేంద్రంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీకి రాజధాని లేదని, సరైన విద్యా సంస్థలు లేవని, ఆస్పత్రులు లేవని, పరిశ్రమలు లేవని, పోలవరం, రైల్వే డివిజన్ ఏమీ లేవని అన్నారు. కట్టుబట్టలతో పంపారని, ఏపీకి అన్నివిధాల సాయం చేస్తామని చెప్పిన కేంద్రం.. చివరికి ఏమీ ఇవ్వకుండా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక వాళ్లతో వేగలేక బయటకు వచ్చేశామని శివ ప్రసాద్ అన్నారు. టీడీపీ ఎంపీలు జేసీ దివాకర్ రెడ్డి, నారాయణ, కేశినేని నాని, గల్లా జయదేవ్ తదితరులు ఆందోళన చేశారు.

ఢిల్లీలో ఏపీ కాంగ్రెస్ నేతల అరెస్ట్

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లో ఏపీ కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. నేతల నినాదాలతో పార్లమెంట్ స్ట్రీట్ ఆవరణ దద్దరిల్లింది. అన్ని పార్టీల నాయకులు కలసికట్టుగా హోదా కోసం పోరాడాలని, అప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవం పేరిట చేపట్టిన ఈ ధర్నాలో కేవీపీ, రఘువీరారెడ్డి, కొండ్రు మురళి, బాలరాజు, శైలజానాథ్, గంగాభవని, సుంకర పద్మ తదితర నేతలు పాల్గొన్నారు.



వైసీపీ ఎంపీలకు జేసీ సవాల్

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీడీపీ, వైసీపీ ఎంపీలు ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటు వద్ద హైడ్రామా నెలకొంది. గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలు ఆందోళన చేస్తుండగా.. అదేసమయంలో పార్లమెంటు ముఖద్వారం వద్ద వైసీపీ ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని నిల్చున్నారు. వైసీపీ ఎంపీలను గమనించిన టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వారి దగ్గరకు వెళ్లారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని ఉద్దేశిస్తూ.. ''నిన్న నువ్వు మాట్లాడింది ఏంటయ్యా.. నీకు దమ్ముంటే రాజీనామా చెయ్.. మేము కూడా రాజీనామా చేస్తాం. మళ్లీ పోటీ చేద్దాం. ఎవరు గెలుస్తారో చూద్దాం. నీకు దమ్ముందా'' అంటూ మీసం మెలేసి తొడకొట్టి సవాల్ విసిరారు. తాము కూడా రాజీనామాకు సిద్ధమేనని వైసీపీ ఎంపీలు కూడా ప్రతి సవాల్ చేశారు. ఆ సమయంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కాగా కాసేపటి తరవాత పరిస్థితి సద్దుమణిగింది. ఇరు పార్టీల ఎంపీలు పార్లమెంటులోకి వెళ్లి వెల్‌లో నిరసన తెలియజేశారు. టీడీపీ రాజీనామా డ్రామాలు ఆడుతోందని సుబ్బారెడ్డి ఆరోపణలు చేసిన నేపథ్యంలో జేసీ దివాకర్‌రెడ్డి స్పందించినట్లు సమాచారం.

ఇతర పార్టీల ఒత్తిడితోనే..!

- చంద్రబాబును తప్పదోవ పట్టించారు
- రాజీనామాపై కేంద్రమంత్రి అనంతకుమార్



న్యూఢిల్లీ, మార్చి 8: తప్పుడు ప్రచారంతో కూడిన రాజకీయ ఒత్తిడి వల్లే చంద్రబాబు తన మంత్రులను కేంద్ర కేబినెట్ నుంచి ఉపసంహరించుకున్నారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని టీడీపీ డిమాండు చేసిందని, దానిపై తాము ఇంకా వారితో చర్చిస్తున్నామని.. కానీ దురదృష్టవశాత్తు వైఎస్ఆర్‌సీపీ, మరి కొన్ని ఇతర పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన అన్నారు. వాళ్లు రాజకీయ వాతావరణాన్ని చెడగొట్టి, చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చారన్నారు. కేంద్రం ఏపీకి ఏమీ చేయలేదంటూ వైఎస్ఆర్‌సీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని అనంతకుమార్ మండిపడ్డారు. ఈ రాజకీయ ఒత్తిడి వల్లే చంద్రబాబు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని, లేకపోతే ఆయన ఎప్పుడూ బీజేపీతోనే ఉండేవారని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం తర్వాత ఇక 'ప్రత్యేక హోదా' అన్నదే లేదని.. అయినా తాము రాష్ట్రానికి రూ. 14,500 కోట్ల సాయం ప్రత్యేక ప్యాకేజి ఇచ్చామని చెప్పారు. అదనంగా మరో రూ. 5000 కోట్లు కూడా సాయం చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను మోదీ సర్కారు కాపాడుతుందని తెలిపారు.

అరుణ్ జైట్లీకి వెటకారం

- గోదావరి నీళ్లు తాగినందుకే: మంత్రి జవహర్

అమరావతి, మార్చి 8 (మనం ప్రతినిధి): కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ గతంలో రాష్ట్ర పర్యటనకు వచ్చినపుడు గోదావరి నీళ్లు తాగారని, అందుకే ఆయన వెటకారంగా మాట్లాడుతున్నాడని రాష్ట్ర మంత్రి జవహర్ బాబు ఎద్దేవా చేశారు. స్వతహాగా గోదావరి జిల్లా ప్రజలకు వెటకారం ఎక్కువ అనే నానుడి ఉందని, తమ దగ్గరికొచ్చి గోదావరి నీళ్లు తాగి వెటకారంగా మాట్లాడితే ప్రజలు ఒప్పుకోరని ఆయన అన్నారు. సెంటిమెంట్ ఉంటే నిధులు ఇస్తారా అని జైట్లీ మాట్లాడటం మూర్ఖత్వమని విమర్శించారు. విభజన చట్టంలో పెట్టినపుడు ఇవన్నీ గుర్తుకి రాలేదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడు దొరకడం ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. జగన్ ప్రత్యేక హోదా అంశాన్ని అడ్డుపెట్టుకొని కపట నాటకాలు ఆడుతున్నాడని విమర్శించారు. చంద్రబాబుది రహదారి అయితే జగన్‌ది బెయిల్ దారి అని మంత్రి ఎద్దేవా చేశారు.

ఐదు ద్విచక్ర వాహనాలు దగ్ధం

నరసరావుపేట, మార్చి 8 (మనం న్యూస్): ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఐదు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. గుంటూరు జిల్లా నరసరావు పేట మండల పరిధి ఎల్లమంద గ్రామ శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం ఈ ఘటన జరిగింది. కళాశాల సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పలువురు విద్యార్థులు ద్విచక్రవాహనాలు నిలిపి ఉంచారు. స్థల యజమాని భూమిని చదును చేసేందుకు అందులోని పిచ్చిమొక్కలకు నిప్పు పెట్టాడు. ఈ మంటలు వ్యాపించి వాహనాలకు అంటుకుని దగ్ధమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




జగన్ యాత్ర వల్లే మైత్రి చెడింది

హోదా అంటూ రోడ్డుపై తిరుగుతున్నారు: విష్ణు

అమరావతి, మార్చి 8 (మనం ప్రతినిధి): ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా అంటూ రోడ్డు మీద తిరుగుతుండటం వల్లే టీడీపీ, బీజేపీ మైత్రి చెడిపోయిందని బీజేపీ శాసనసభా పక్షం నేత విష్ణుకుమార్ రాజు అన్నారు. గురువారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. కొన్ని ప్రత్యేక రాజకీయ పరిస్థితుల్లో టీడీపీ మంత్రులు, తమ పార్టీ మంత్రులు రాజీనామా చేశారని ఆయన అన్నారు. మంత్రి పదవులకు రాజీనామా చేశారే కానీ ఎన్డీయే కూటమికి కాదని ఆయన తెలిపారు. ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నదని ఆయన పునరుద్ఘాటించారు. ఏపీ ప్రజల్లో సెంటిమెంట్ ఉన్నదని ఓట్ల రాజకీయాలు చెయ్యవద్దని ఆయన హితవు పలికారు. కచ్చితంగా విశాఖ రైల్వే జోన్‌ను సాధిస్తామని విష్ణుకుమార్ అన్నారు.

సెన్సెక్స్ మార్చి 8 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
ఎస్‌బిఐ	4.09	టాటా స్టీల్	-1.98
ఐసిఐసిఐ బ్యాంకు	3.58	సన్ ఫార్మా	-1.85
అదానీ పోర్ట్స్	2.95	యస్ బ్యాంకు	-1.63
ఎం అండ్ ఎం	2.45	టీసీఎస్	-0.92
రిలయన్స్	2.25	టాటా మోటార్స్	-0.60

నిఫ్టీ మార్చి 8 2018




పెరిగినవి	%	తగ్గినవి	%
ఎస్‌బిఐ	4.12	సన్ ఫార్మా	-1.95
ఐసీఐసీఐ బ్యాంకు	3.58	టాటా స్టీల్	-1.82
అదానీ పోర్ట్స్	2.92	యస్ బ్యాంకు	-1.09
ఎం అండ్ ఎం	2.66	గెయిల్	-0.98
రిలయన్స్	2.44	టీసీఎస్	-0.78

టాప్ గైనర్స్ 8 మార్చి

బి.ఎస్.ఇ సెన్సెక్స్ 33,351.57 ▲318.48


పాయింట్లు		%
256.75	ఎస్‌బీఐ	4.09%
296.95	ఐసీఐసీఐ బ్యాంకు	3.58%
388.60	అదానీ పోర్ట్స్	2.95%
727.25	ఎం అండ్ ఎం	2.45%
911.60	రిలయన్స్	2.25%
1796.50	హెచ్‌డీఎఫ్‌సీ	1.97%
1129.50	ఏసియన్ పెయింట్స్	1.95%
1283.25	ఎల్ అండ్ టి	1.60%
520.15	యాక్సిస్ బ్యాంకు	1.43%
165.30	ఎన్‌టీపీసీ	1.32%

నికర ఇన్‌ఫ్లో/ఔట్‌ఫ్లో గోల్డ్ ఈటీఎఫ్‌లు




ఆధారం: ఎ.ఎం.ఎఫ్.ఐ

రూపాయి వర్సెస్ డాలర్



సౌర శక్తిపై సదస్సుకు తరలిరానున్న దేశాధినేతలు




న్యూఢిల్లీ: మార్చి 11న ఇక్కడ జరిగే మొదటి అంతర్జాతీయ సౌర శక్తి కూటమి శిఖరాగ్ర సదస్సుకు ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, శ్రీలంకలతోపాటు 23 దేశాల అధినేతలు హాజరవుతున్నారు. సౌర శక్తి వినియోగాన్ని పెంపొందించేందుకు ఇండియా, ఫ్రాన్స్‌లు ఈ సదస్సుకు సహ ఆతిథ్యం వహిస్తున్నాయి. సదస్సుకు తరలి వస్తున్నవారిలో ఆయా దేశాలకు చెందిన సీనియర్ ప్రతినిధులు, ఉప ప్రధాన మంత్రులు, విద్యుత్ శాఖ మంత్రులు కూడా ఉన్నారు. సదస్సులో పాల్గొంటున్న గ్లోబల్ బ్యాంకర్లలో యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ప్రెసిడెంట్, చైర్మన్ వెర్నర్ హోయర్, బ్రిక్స్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అధ్యక్షుడు కె.వి. కామత్, యూరోపియన్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ ఎనర్జీ, సహజ వనరుల విభాగ మేనేజింగ్ డైరెక్టర్ నందితా ప్రసాద్, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ బన్‌బంగ్ సుశాంతనోలు కూడా ఉన్నారు. భారత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఫ్రెంచి ప్రెసిడెంట్ ఎమాన్యుయేల్ మక్రాన్‌లు ఈ సదస్సుకు సహ ఆతిథేయులుగా వ్యవహరిస్తారు. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐ.ఎస్.ఎ)తో కలసి పనిచేస్తున్న 121 దేశాలలో సౌర శక్తి వినియోగాన్ని పెంపొందించడానికి సంబంధించి వివిధ కోణాలపై ఈ సదస్సు చర్చిస్తుంది. రుణ యంత్రాంగం, క్రౌడ్ ఫండింగ్, సాంకేతిక పరిజ్ఞాన పురోగతులను పంచుకోవడంపై ప్రతినిధులు దృష్టి సారిస్తారు. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటరులో ఈ సదస్సు జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుదీకరణ, తాగునీరు, సేద్యపు నీటి సరఫరాలకు సౌర శక్తి వాడకం వంటి అంశాలూ చర్చకు రానున్నాయి. భారతదేశం 2022 నాటికి 100 గిగావాట్ల సౌర శక్తి ఉత్పాదక సామర్థ్యాలను సమకూర్చుకోవాలని ఆశావహమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

స్టాక్ మార్కెట్లు మళ్ళీ జవజీవాలు

గణనీయమైన లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు

ముంబయి: వరుసగా ఆరు సెషన్లలో నష్టాలను మూటగట్టుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు గురువారంనాడు తిరిగి జవజీవాలు సంతరించుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి లభించిన సానుకూల సంకేతాలతో ఇటీవల బాగా దెబ్బతిన్న షేర్ల కొనుగోలుకు మదుపరులు మొగ్గు చూపారు. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 318 పాయింట్లు లాభపడి 33,351.57 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 88 పాయింట్లు పుంజుకుని 10,242.65 పాయింట్ల వద్ద ముగిసింది. ఘోర పతనాన్ని చూసిన షేర్ల కొనుగోళ్ళు ముమ్మరంగా సాగడంతో స్టాక్ మార్కెట్ సూచీలు లాభపడ్డాయి. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై వివాదాస్పద సుంకాలు అధికంగా ఉండబోవని వైట్ హౌస్ సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు సడలిపోయాయి. దాంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు కుదుటపడ్డాయి. షేర్ల ధరలు పటిష్టమవుతున్న ధోరణిని కనబరచాయి. గురువారం ట్రేడింగ్ ముగియడానికి ముందు మధ్యాహ్నం షార్టు కవరింగుతో ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల ధరలు తిరిగి కొంత కళకాంతులు సంతరించుకున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లతోపాటు దేశీయ మదుపు సంస్థలవారు కూడా నిరంతరంగా కొనుగోళ్ళు జరపడంతో 30 షేర్ల 'సెన్సెక్స్' గురువారం ఒకదసలో 33,439.97 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. చివరకు 33,351.57 పాయింట్ల వద్ద ముగిసింది. దీనితో అది 318.48 పాయింట్ల లాభాన్ని మూటగట్టుకున్నట్లైంది. ఒకే రోజులో అది ఇన్ని పాయింట్లు లాభపడడం ఫిబ్రవరి 23 తర్వాత మళ్ళీ ఇదే మొదటిసారి. 'సెన్సెక్స్' ఫిబ్రవరి 23న 322.65 పాయింట్లు పెరిగింది. దేశీయంగాను, అంతర్జాతీయంగాను ప్రతికూల సంకేతాలతో 'సెన్సెక్స్' గత ఆరు సెషన్లలో 1,412.66 పాయింట్లను కోల్పోయింది.



యాభై షేర్ల ధరల హెచ్చు తగ్గులను ప్రతిబింబించే 'నిఫ్టీ' 10,200 స్థాయిని తిరిగి అందుకుంది. అది చెప్పుకోతగిన విధంగా 88.45 పాయింట్ల లాభంతో 10,242.65 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు 10,270.35 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఇంట్రా-డేలో అది 10,146.40 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది.

తాత్కాలిక డాటా ప్రకారం బుధవారంనాడు దేశీయ మదుపు సంస్థలు నికరంగా రూ. 409.34 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేయగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 719.78 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించాయి.

పటిష్టమైన లోహాల రంగ షేర్లు

ఉక్కు, అల్యూమినియం షేర్ల ధరలు పెరిగాయి. నాల్కో 1.83 శాతం, హిందూస్థాన్ జింక్ 1.15 శాతం లాభపడ్డాయి. జిందాల్ స్టీల్, ఎన్.ఎం.డి.సి, సెయిల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ నేతృత్వంలో ఇతర లోహపు రంగ షేర్లు కూడా 0.84 శాతం లాభపడ్డాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన భూషణ్ స్టీల్ స్వాధీనానికి అత్యధిక మొత్తాన్ని బిడ్ చేసిన సంస్థగా టాటా స్టీల్ ఆవిర్భవించడంతో భూషణ్ స్టీల్ షేర్ ధర 16.26 శాతం పెరుగుదలను చూసింది. టాటా స్టీల్ షేర్ ధర 1.98 శాతం తగ్గింది. 'సెన్సెక్స్' లోని 30 సంస్థల్లో ఎస్.బి.ఐ అత్యధికంగా 4.09 శాతం లాభపడింది.

కనిపించని ప్యాకేజీ ప్రభావం

రుణాలతో కునారిల్లుతున్న టెలికాం రంగానికి ఊరటనిచ్చే ప్యాకేజీకి క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపినప్పటికీ, ఎం.టి.ఎన్.ఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఐడియా సంస్థల షేర్ల ధరలు 1.19 శాతం వరకు క్షీణించాయి.

కె.ఇ.సి ఇంటర్నేషనల్‌కు రూ. 1378 కోట్ల ఆర్డర్లు

న్యూఢిల్లీ: వివిధ వ్యాపార విభాగాలకు సంబంధించి రూ. 1378 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు పొందినట్లు ఇంజనీరింగ్, కొనుగోళ్ళు, నిర్మాణ కలాపాల అగ్ర సంస్థ కె.ఇ.సి ఇంటర్నేషనల్ వెల్లడించింది. కంపెనీకి చెందిన ట్రాన్స్‌మిషన్, పంపిణీ వ్యాపారం భారతదేశం, మధ్య ప్రాచ్యం, సార్క్ దేశాల్లో రూ. 786 కోట్ల విలువైన ఆర్డర్లు పొందిందని కె.ఇ.సి ఇంటర్నేషనల్ నేడు బి.ఎస్.ఇకి నివేదించింది. రైల్వే వ్యాపార విభాగం దేశంలో వివిధ ప్రాంతాల్లో కాంపోజిట్, ఓవర్‌హెడ్ విద్యుదీకరణ పనులు నిర్వహించేందుకు రూ. 473 కోట్ల విలువైన ఆర్డర్లు గడించింది. కేబుల్ వ్యాపార విభాగం, రూ. 78 కోట్ల విలువైన ఆర్డరు, నిర్మాణ వ్యాపార విభాగం రూ. 41 కోట్ల విలువైన ఆర్డరు పొందాయి. ఆర్.పి.జి గ్రూప్ సంస్థ అయిన కె.ఇ.సి ఇంటర్నేషనల్ విద్యుత్ ప్రసారం, పంపిణీ, రైల్వేలు, నీరు, పునరుత్పాదకాల విభాగాల్లో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

రూ. 2000 కోట్లు సేకరించిన ఎల్ అండ్ టి ఫైనాన్స్

న్యూఢిల్లీ: ప్రమోటరు లార్సెన్ అండ్ టూబ్రోకు ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపు ద్వారా దాదాపు రూ. 2000 కోట్లను ఎల్ అండ్ టి ఫైనాన్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ సేకరించింది. గ్రామీణ ఫైనాన్స్, హౌసింగ్ ఫైనాన్స్ వంటి విభాగాల్లో రుణ వృద్ధికి ప్రమోటరు నుంచి సేకరించిన మూలధనం సహాయపడుతుందని ఎల్ అండ్ టి ఫైనాన్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ తెలిపింది. కంపెనీ మూలధన సమృద్ధిని మరింత పటిష్టపరచుకునేందుకు కూడా తోడ్పడుతుందని చెప్పింది. రూ. 10 ముఖ విలువ కలిగిన 10.78 కోట్ల ఈక్విటీ షేర్లను షేర్‌కు రూ. 185.51 జారీ ధర వద్ద లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్‌కు కేటాయించే పని పూర్తయింది'' అని కంపెనీ గురువారం బి.ఎస్.ఇకి తెలియజేసింది.


రెండు స్టార్టప్‌లకు ఎయిర్‌బస్ కాంట్రాక్టు

హైదరాబాద్: నవకల్పనలతో కూడిన పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు నీవీ, ఈఫ్లైట్ అనే రెండు భారతీయ స్టార్టప్‌లతో కాంట్రాక్టులపై సంతకాలు చేసినట్లు యూరోపియన్ విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్, దాని అనుబంధ సంస్థ నవ్‌బ్లూ గురువారం వెల్లడించాయి. సంస్థతోపాటు మొత్తం పరిశ్రమ అవసరాలు తీర్చే విధంగా అవి రూపొందించే సొల్యూషన్ల స్థాయిని పెంచవచ్చని ఎయిర్‌బస్, నవ్‌బ్లూ సంస్థలు ప్రకటించాయి. ఎయిర్‌బస్ బిజ్‌ల్యాబ్ టెక్నాలజీ యాక్సిలరేషన్ కార్యక్రమం రెండవ సీజనులో ఎంపికైన ఐదు స్టార్టప్‌లలో నీవీ, ఈఫ్లైట్ సంస్థలు కూడా ఉన్నాయి. ఎయిర్‌బస్ చేపట్టిన కార్యక్రమానికి తొమ్మిది దేశాల నుంచి 137 దరఖాస్తులు వచ్చాయి. ''వ్యవస్థాపక సామర్థ్యం ఉన్నవారితో కలసి పనిచేయడం, వారికి వ్యాపార అవకాశాలు ముఖ్యంగా ఎయిర్‌బస్‌తో సృష్టించడానికి మాకున్న నిబద్ధతకు ఈ భాగస్వామ్యాలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి'' అని ఎయిర్‌బస్ బిజ్‌ల్యాబ్ అధిపతి బ్రూనో గూటియర్స్ చెప్పారు. నీవీ సంస్థ ప్రాక్యుసెన్స్ పేరుతో రూపొందించిన సొల్యూషన్ అధునాతన ఎనలటిక్స్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లను ఉపయోగించుకుంటూ తమ సంస్థలో వస్తూత్పత్తి సరఫరా చైన్‌కి, కొనుగోళ్ళ కార్యకలాపాలకు కచ్చితత్వాన్ని పెంచుతుందని ఎయిర్‌బస్ విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. ఈఫ్లైట్ రూపొందించిన ట్రిప్ సపోర్ట్ సొల్యూషన్ సమగ్ర సర్వీసుల సముదాయాన్ని అందిస్తుంది. బిజినెస్ జెట్ పైలట్లు ఇంధనం, సమయం, రూటు, వాతావరణం వంటివాటి విషయంలో ప్రణాళికలను ఉత్తమమైన రీతిలో తయారు చేసుకునేందుకు అది తోడ్పడుతుంది.

టెలినార్ విలీనానికి పచ్చ జెండా

న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్‌లో టెలినార్ ఇండియా ప్రతిపాదిత విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) గురువారం ఆమోదం తెలిపింది. ట్రైబ్యునల్ ధర్మాసనం కొన్ని షరతులతో ఆ విలీనానికి ఆమోద ముద్ర వేసింది. ఆ రెండు సంస్థలు 2017 ఫిబ్రవరిలో విలీన ఒప్పందంపై సంతకాలు చేశాయి. దాని ప్రకారం, ఏడు (ఆంధ్ర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ (తూర్పు), ఉత్తర ప్రదేశ్ (పశ్చిమ), అస్సాం) సర్కిళ్ళలో టెలినార్ ఇండియా నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఎయిర్‌టెల్ స్వాధీనం చేసుకోవలసి ఉంది. ఈ ప్రతిపాదిత స్వాధీనానికి కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) ఇదివరకే ఆమోదం తెలిపింది. టెలికాం శాఖ ఇచ్చే అనుమతి కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి, స్టాక్ ఎక్స్ఛేంజీలు బి.ఎస్.ఇ, ఎన్.ఎస్.ఇలు ఎదురు చూస్తున్నాయి. టెలినార్ ఇండియా ఆస్తులన్నీ ఎయిర్‌టెల్ వశమవుతాయి. టెలినార్ కస్టమర్లు కూడా ఎయిర్‌టెల్‌కు బదలీ అవుతారు. ఆ ఏడు సర్కిళ్ళలో 1800 మెగాహెర్ట్జ్‌లో 43.4 మెగాహెర్ట్జ స్పెక్ట్రమ్ ఎయిర్‌టెల్‌కు అదనంగా ఒనగూడుతుంది.

అదనపు వ్యయానికి ఆమోదం కోరిన కేంద్రం




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 85,315.30 కోట్ల అదనపు నగదు వ్యయానికి ప్రభుత్వం గురువారం నాడు పార్లమెంట్ ఆమోదాన్ని కోరింది. జి.ఎస్.టి అమలు వల్ల రాష్ట్రాలు రాబడిలో ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు దానిలో 70 శాతం మొత్తాన్ని కేటాయించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాల్గవ విడత అనుబంధ డిమాండ్లను ప్రవేశపెట్టారు. రూ. 9.06 లక్షల కోట్ల స్థూల అదనపు వ్యయానికి ఆమోద ముద్ర వేయించుకునేందుకు పార్లమెంట్ ఆమోదం కోరారు. దానిలో కొంత భాగాన్ని వివిధ మంత్రిత్వ శాఖలు ఆదా చేసిన మొత్తాలతో సమకూర్చుకుంటారు. స్థూల అదనపు వ్యయం రూ. 85,315.30 కోట్ల మేరకు ఉంటే, వివిధ శాఖలు ఆదా చేసిన మొత్తాలు, పెరిగిన రాబడులు, రికవరీల ద్వారా రూ. 8.21 లక్షల కోట్లకు పైగా సమకూరతాయి. నగదు వ్యయంలో అధిక భాగం రాష్ట్రాల రాబడులలో లోటును భర్తీ చేసేందుకు పోతుంది. రూ. 85,315 కోట్లలో సుమారు 71 శాతం కిందకు వచ్చే మొత్తం రూ. 61,215.58 కోట్లను రెవిన్యూ శాఖకు కేటాయించారు. సి.ఎస్.టి పరిహారం కింద చెల్లించనున్న రూ. 1384 కోట్లు, రెవిన్యూ నష్టపోయినందుకు చెల్లించే రూ. 58,999 కోట్లు కూడా అందులో ఇమిడి ఉన్నాయి. వివిధ పథకాల కింద మూలధన ఆస్తులు సృష్టించేందుకు రూ. 15,065.65 కోట్లు వెచ్చించనున్నారు. రక్షణ సిబ్బంది పెన్షన్లు చెల్లించేందుకు దాదాపు రూ. 9,260 కోట్లు, మార్కెట్ రుణాలపై వడ్డీ చెల్లింపులకు, ట్రెజరీ బిల్లులకు రూ. 5,721.90 కోట్లు వెచ్చించనున్నారు.

ప్రభుత్వ ప్యాకేజీతో ఊరట

- రుణాల భారంతో కునారిల్లుతున్న టెలికాం సంస్థలు తేరుకోనున్నాయి

న్యూఢిల్లీ: రుణాల భారంతో కునారిల్లుతున్న టెలికాం రంగానికి ఉద్దేశించిన ఒక సహాయ ప్యాకేజీకి కేంద్ర మంత్రి వర్గం బుధవారం ఆమోదం తెలిపింది. స్పెక్ట్రమ్ హోల్డింగ్ పరిమితిని 35 శాతానికి పెంచాలన్న మంత్రివర్గ కమిటీ సిఫార్సును కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ప్రస్తుతం స్పెక్ట్రమ్‌పై పరిమితి 25 శాతంగా ఉంది. టెలికాం సర్వీసు ప్రొవైడర్లు (టి.ఎస్.పిలు) సమష్టిగా రూ. 4.6 లక్షల కోట్ల రుణ భారంతో కుంగుతున్నాయి. స్పెక్ట్రంకు టి.ఎస్.పిలు బకాయిపడిన, వాయిదా వేసిన చెల్లింపులను పునర్నిర్మించాలని కూడా క్యాబినెట్ నిర్ణయించిందని ప్రభుత్వ ప్రకటన ఒకటి తెలిపింది. వేలంపాటలలో కొనుగోలు చేసిన స్పెక్ట్రంకి ఇంతకుముందు 10 వాయిదాలలో చెల్లింపులు జరపవలసి వచ్చేది. ఇప్పుడు 16 వార్షిక వాయిదాలలో చెల్లించే అవకాశం కల్పించారు. అంతర్ మంత్రిత్వ శాఖ బృందం (ఐ.ఎం.జి) సిఫార్సులను అమలుపరుస్తున్న ఈ చర్యలు టెలికాం రంగం ఏకీకృతం కావడానికి సహాయపడతాయి. పెట్టుబడులకు వెసులుబాటు కల్పిస్తాయి. వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తాయని ఆ ప్రకటన వెల్లడించింది. ''2012 నుంచి స్పెక్ట్రమ్ వేలంపాటకు దరఖాస్తు ఆహ్వానిస్తూ సంబంధిత నోటీసు జారీ చేసిన దాని ప్రకారం చెల్లింపు బకాయికి సంబంధించిన నికర ప్రస్తుత విలువ (ఎన్.పి.వి)ని కాపాడాలన్న సూత్రం ఆధారంగా వాయిదాల సంఖ్యను పెంచారు. తద్వారా, 2034-35 వరకు అందే మొత్తంలో రూ. 74,446.01 కోట్ల పెరుగుదల చోటుచేసుకుంటుంది'' అని ఆ ప్రకటన తెలిపింది.

సాంకేతిక విజ్ఞాన ప్రగతి, స్పెక్ట్రమ్ వినియోగంలో సామర్థ్యం, ఏకీకృతం కావడానికి వెసులుబాటు కల్పించే చర్యలను దృష్టిలో పెట్టుకుని స్పెక్ట్రమ్ హోల్డింగ్‌కు ఇప్పుడున్న పరిమితులను సవరించాలని టెలికాం రంగ నియంత్రణ సంస్థ 'ట్రాయ్' సిఫార్సు చేసింది. ''బకాయిల పునర్నిర్మాణాన్ని చేపడుతూ, వాయిదాలు పెంచడం వల్ల, టెలికాం సర్వీసు ప్రొవైడర్లకు తక్షణ కాలంలో నగదు ప్రవాహం పెరుగుతుంది. ఆ విధంగా వాటికి కొంత ఊరట లభిస్తుంది. స్పెక్ట్రమ్ హోల్డింగ్ పరిమితిని సవరించడం వల్ల టెలికాం లైసెన్సుల ఏకీకరణకు వెసులుబాటు కల్పించినట్లైంది. భవిష్యత్ వేలంపాటలలో కూడా పాల్గొనేట్లుగా వాటిని ప్రోత్సహించినట్లయింది'' అని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది.




ప్రస్తుతమున్న ఇంట్రా-బ్యాండ్ క్యాప్‌ను కూడా క్యాబినెట్ తొలగించింది. దానికి బదులుగా, సబ్-1జిహెచ్‌జడ్ బ్యాండ్ల (700 మెగాహెర్ట్జ్, 800 మెగాహెర్ట్, 900 మెగాహెర్ట్ బ్యాండ్ల) సమష్టి స్పెక్ట్రమ్ హోల్డింగ్‌ను 50 శాతానికి పరిమితం చేసింది. 1జిహెచ్‌జడ్ బ్యాండ్ ఎగువన స్పెక్ట్రమ్ హోల్డింగ్‌పై విడిగాగానీ, సమష్టిగాగానీ ఎలాంటి పరిమితీ ఏదు.

ఈజిప్టులోని షరమ్ ఎల్ షేక్‌లో 2019లో జరుగనున్న వరల్డ్ రేడియోకమ్యూనికేషన్ కాన్ఫరెన్స్ (డబ్ల్యు.ఆర్.సి) తుది చర్యల తర్వాత, స్పెక్ట్రమ్ క్యాప్‌ల పరిమితుల సవరణ చోటుచేసుకోవచ్చు. సమస్యలతో సతమతమవుతున్న టెలికాం రంగానికి సహాయ చర్యలు రూపొందించేందుకు ఐ.ఎం.జి ముఖ్య సిఫార్సులలో కొన్నింటికి టెలికాం రంగ ఉన్నత విధాన నిర్ణాయక సంస్థ టెలికాం కమిషన్ ఆమోదించింది. తీవ్ర పోటీ వల్ల టెలికాం సంస్థల మార్జిన్లు తగ్గాయి.

టాటా స్టీల్ చేతికి భూషణ్ స్టీల్

- ఈ స్వాధీనంతో టాటా స్టీల్ రుణ భారం కూడా పెరగనుంది



ముంబయి: చితికిన ఆస్తిగా ముద్రపడిన భూషణ్ స్టీల్‌ను కైవసం చేసుకునేందుకు రూ. 45,400 కోట్లు ఇచ్చేందుకు టాటా స్టీల్ ముందుకొచ్చింది. ఇదే ఆస్తి కోసం జేఎస్‌డబ్ల్యూ ఇవ్వజూపిన రూ. 28,000 కోట్లకు దానికి ఎక్కడా సాపత్యమే లేదు. భూషణ్ స్టీల్ మొత్తానికి టాటా స్టీల్ వశం కానుంది. 2016 నాటి దివాలా, బ్యాంక్‌రప్సీ కోడ్ (ఐ.బి.సి) కింద పరిష్కారమైన మొదటి స్ట్రెస్సడ్ ఎసెట్‌గా ఇది నమోదు కానుంది. భూషణ్ స్టీల్‌కు రుణాలిచ్చిన సంస్థలకు టాటా స్టీల్ రూ. 35,200 కోట్లు ఇవ్వ జూపింది. నిర్వహణాపరమైన రుణ దాతలకు రూ. 1200 కోట్లు చెల్లించేందుకు సిద్ధపడుతోంది. చర మూలధన అవసరాలకు టాటా స్టీల్ రూ. 9,000 కోట్లు పెట్టుబడి పెట్టనుందని కంపెనీ సన్నిహిత వర్గాలవారు తెలిపారు. ''భూషణ్ స్టీల్‌ను నియంత్రించే వాటాను చేజిక్కించుకునేందుకు అధిక మదింపు పొందిన కాంప్లియంట్ రిజల్యూషన్ అప్లికెంట్‌గా'' తమను గుర్తిస్తున్నట్లు భూషణ్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన పరిష్కార వృత్తి నిపుణుడి నుంచి అధికారికంగా వర్తమానం అందినట్లు టాటా స్టీల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఐ.బి.సిలో పేర్కొన్న కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియ కింద నున్న నిబంధనల ప్రకారం, ఈ పరిష్కార ప్రక్రియలో తదుపరి చర్య ఉంటుంది. ఈ ప్రకటన ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఎంతో స్థయిర్యాన్ని ఇచ్చింది. ఉక్కు రంగ సంస్థల కిచ్చిన రుణాలను తిరిగి రాబట్టుకోవడంలో అవి నానాతంటాలు పడుతున్నాయి. జేఎస్‌డబ్ల్యూతో పోలిస్తే, టాటా స్టీల్ ఇవ్వజూపింది అధిక మొత్తమే కావచ్చుకానీ, అది ఇచ్చే రూ. 45,400 కోట్ల వల్ల భూషణ్ స్టీల్ రుణ దాతలకు ఓ మోస్తరు ఊరట మాత్రమే లభిస్తుంది. ఎందుకంటే, అవి ఈ కంపెనీ నుంచి రూ. 56,000 కోట్లు రాబట్టాలని భావించాయి.

అలాగే, భూషణ్ స్టీల్ కొనుగోలుతో టాటా స్టీల్ రుణ భారం మరింత పెరుగుతుంది. 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి కంపెనీకి రూ. 88,000 కోట్ల మేర స్థూల రుణాలున్నాయి. వచ్చే రెండు మూడేళ్ళలో అది లక్ష కోట్ల రూపాయలను మించవచ్చు. ఆంగ్లో-డచ్ కంపెనీ కోరస్ స్వాధీనానికి టాటా స్టీల్ 2008లో ప్రయత్నించింది.

జేఎస్‌డబ్ల్యూ, పీరామల్ ఎంటర్‌ప్రైజెస్ కలసి సంయుక్త రంగంలో జేఎస్‌డబ్ల్యూ లివింగ్‌ను నెలకొల్పాయి.

ఆటో-గ్రేడ్ ఉక్కును తయారు చేసే భూషణ్ స్టీల్ 5.6 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యం కలిగి ఉంది. భూషణ్ స్టీల్ 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి రూ. 1607 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో అది రూ. 743 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది.

మనం టెక్నాలజీ
శుక్రవారం 9 మార్చి 2018
www.manamnews.com

స్మార్ట్ టీవీ!

ఇంట్లో ఎల్ఈడీ టీవీ పాతదైపోయింది... కొత్తది తీసుకుందామండీ! స్మార్ట్ టీవీలు వచ్చాయంట... చాలా బాగున్నాయంటున్నారు! మీ ఇంట్లోనూ ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయా? కొత్త ఆప్షన్లతో వస్తున్న టీవీ అంటే అందరికీ ఆసక్తే మరి... అందులోనూ అంతర్జాలం సాయంతో పని చేసేవంటే ఇంకా ఆసక్తి! అయితే స్మార్ట్ టీవీ కోసం మీ టీవీని అమ్మేసి కొత్తది కొనక్కర్లేదు. మీ పాత ఎల్ఈడీ/ఎల్‌సీడీ టీవీకి 'స్టిక్స్' జోడిస్తే సరి. ఎంచక్కా మీ ఇంట్లో స్మార్ట్ టీవీ చూసేయొచ్చు!





ధర తక్కువ... ఆప్షన్లు ఎక్కువ

మీ మొబైల్‌లోని ఫొటోలను టీవీ తెర మీద చూడాలనుకుంటున్నారా, ట్యాబ్‌లోని క్రోమ్ బ్రౌజర్‌లో సెర్చ్ చేస్తున్న అంశాలు టీవీ తెర మీద చూపించాలనుకుంటున్నారా? అంత సులభంగా అడిగేస్తున్నారు... అదెలా సాధ్యం అనుకుంటున్నారా? దీని ధర సుమారు రూ. 3,399. పెన్‌డ్రైవ్‌లా ఉండే దీన్ని మీ మొబైల్‌కు కనెక్ట్ చేసుకొని, మీ మొబైల్/ట్యాబ్‌లోని యూట్యూబ్ ఆప్‌లో వీడియోలు ప్లే చేసి 'కాస్ట్' ఆప్షన్ క్లిక్ చేస్తే అవి మీ టీవీలోనూ ప్లే అవుతాయి. ఆటలాడటం, బ్రౌజర్‌లో సెర్చింగ్, ఫొటోలు చూడటం లాంటివి కూడా ఇలానే చేయొచ్చు. నెట్‌ఫ్లిక్స్, వింక్ లాంటి ఆప్స్ కూడా వినియోగించుకోవచ్చు.

ఎయిర్ టెల్ నుంచి...

ఒకప్పుడు యాంటెనా, ఆ తర్వాత కేబుల్ కనెక్షన్, ఆ వెంటనే డీటీహెచ్... ఇప్పుడు స్మార్ట్ డీటీహెచ్. అవును డీటీహెచ్ సెట్‌టాప్ బాక్స్‌లు కూడా స్మార్టయిపోయాయి. ఎయిర్‌టెల్ ఇటీవల క్రోమ్‌కాస్ట్ ఫీచర్లున్న సెట్‌టాప్ బాక్స్‌ను విడుదల చేసింది. దీని ధర సుమారు రూ. 4,999. దీన్ని మీ టీవీకి జోడించి ముఖ్యమైన వీడియో స్ట్రీమింగ్ ఆప్స్‌ను వాడుకోవచ్చు. పెన్‌డ్రైవ్ ద్వారా టీవీ కార్యక్రమాలను రికార్డు చేసుకోవచ్చు. బ్లూటూత్ సాంకేతికత ఉన్న రిమోట్ ద్వారా గూగుల్ వాయిస్ సెర్చ్ సదుపాయం కూడా పొందొచ్చు. త్వరలో మిగిలిన డీటీహెచ్ సంస్థలు కూడా ఈ తరహా సెట్‌టాప్ బాక్స్‌లను తీసుకురానున్నాయి.


ఏమిటీ డివైజ్‌లు

క్రోమ్‌కాస్ట్, ఫైర్ టీవీ, ఆమ్‌కెట్టే... ఇలా డివైజ్ పేరు ఏదైనా దాని పరమార్థం ఒక్కటే. మీ సాధారణ టీవీని స్మార్ట్ టీవీగా మార్చడం. దీనికి కావల్సిందల్లా మీ టీవీకి హెచ్‌డీఎంఐ పోర్టు ఉండటమే. ఇటీవల కాలంలో వస్తున్న ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీల్లో ఈ తరహా పోర్టులు కచ్చితంగా ఉంటున్నాయి. ఈ డివైజ్‌లను తొలుత వైఫై ఆధారంగా అంతర్జాలంతో అనుసంధానం చేయాలి. ఆ తర్వాత టీవీకి ఉండే హెచ్‌డీఎంఐ పోర్టుకు కనెక్ట్ చేయాలి. అప్పుడు తెర మీద ఆ డివైజ్‌కు సంబంధించిన ఆప్స్, ఇతర అంశాలు కనిపిస్తాయి. అంతర్జాలంతో వీడియో స్ట్రీమింగ్ సదుపాయం అందించే అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్ లాంటి వాటిని చూడొచ్చు. రిమోట్ ద్వారా వాటిని యాక్సెస్ చేయొచ్చు. గూగుల్ క్రోమ్‌కాస్ట్‌కు మీ మొబైల్‌నే రిమోట్‌గా వాడొచ్చు.

భారీ స్టోరేజీ

అంతర్జాలం నుంచి వీడియోలు, ఆడియో, ఫొటోలను టీవీలోకి లైవ్ స్ట్రీమింగ్ ఇచ్చే డివైజ్ ఓ హార్డ్ డిస్క్ అయితే బాగుంటుంది కదా. ఎంచక్కా ఆ హార్డ్‌డిస్క్‌లో స్టోర్ చేసుకున్న వీడియో, ఆడియో, ఫొటోలను టీవీలో చూస్కోవచ్చు. దీని ధర సుమారు రూ. 15 వేలు. ప్రముఖ ఆన్‌లైన్ ఎంటర్‌టైన్మెంట్ ఆప్‌లను ఇందులో యాక్సెస్ చేయొచ్చు. దీని అనుబంధ రిమోట్ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని మీ స్మార్ట్‌ఫోన్‌తో టీవీని ఆపరేట్ చేసుకోవచ్చు. కీబోర్డును కనెక్ట్ చేసుకొని దీన్ని సిస్టమ్‌లానూ వాడుకోవచ్చు.





డిట్టో, హాట్‌స్టార్, వియూ, వూట్, అమెజాన్ ప్రైమ్... ఇలాంటి అనేక ఆన్‌లైన్ సర్వీసులను టీవీలో చూడాలనుకుంటున్నారా? దీని కోసం అమెజాన్ 'ఫైర్ స్టిక్' పేరుతో ఓ డివైజ్‌ను విడుదల చేసింది. ఇన్నాళ్లూ విదేశాల్లో ఉన్న ఈ స్ట్రీమింగ్ స్టిక్ ఇటీవల మన దేశంలోనూ ప్రవేశించింది. దీని ధర సుమారు రూ. నాలుగు వేలు. మీ టీవీకి దీన్ని జోడించి ప్రముఖ ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్ సైట్లలోని వీడియోలను వీక్షించొచ్చు. ఇందులో వాయిస్ రిమోట్ సౌకర్యం ఉంది. అంటే ఈ రిమోట్ మీద వాయిస్ బటన్‌ను ఒత్తి మీరు చూడాలనుకుంటున్న ఛానల్/వెబ్‌సైట్ పేరు చెబితే సరి... మిగిలిన పని మీ ఫైర్ స్టిక్ చూసుకుంటుంది. ఆన్‌లైన్ అంగడి అమెజాన్‌లో అది అందుబాటులో ఉంది.





ఆపిల్ ఉంటే...



ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్... వీటిలో ఏదైనా మీ దగ్గర ఉంటే మీ టీవీని స్మార్ట్ టీవీగా మార్చడానికి ఆపిల్ టీవీ బాక్స్ మంచి ఆప్షన్. దీని ధర సుమారు రూ. 13,500. అయితేనేం ఆప్షన్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఇన్‌బిల్ట్ స్టోరేజీ, రిమోట్, ల్యాన్ కేబుల్ సదుపాయం లాంటి అనేక ఆసక్తికరమైన అంశాలు ఆపిల్ టీవీలో ఉన్నాయి. దీన్ని మీ టీవీకి జోడిస్తే... ఆపిల్ ఆప్ స్టోర్‌లోని చాలా ఆప్స్‌ను వాడుకోవచ్చు. హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్, ఎరోస్‌నౌ, స్పుల్ లాంటి ఎంటర్‌టైన్మెంట్ ఆప్స్‌ను వినియోగించుకోవచ్చు. అంతేకాదు దీని ప్రత్యేకమైన రిమోట్ ద్వారా ఆపిల్ వాయిస్ అసిస్టెంట్ సిరి సేవలను మీ టీవీలోనూ వినియోగించుకోవచ్చు. రిమోట్ లేకపోయినా ఐఫోన్‌తోనూ దీన్ని ఆపరేట్ చేయొచ్చు. ఒకవేళ మీరు విండోస్, ఆండ్రాయిడ్ ఆధారిత మొబైళ్లు వాడుతుంటే ఈ ఆపిల్ టీవీ బాక్స్ అంత ఉపయుక్తంగా ఉండదు.

ఇబ్బందులు కూడా

టీవీలను స్మార్ట్‌గా మార్చే డివైజ్‌లతో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. ప్రతి సంస్థ ఓ ప్రత్యేకమైన ఓఎస్‌ను రూపొందిస్తుంది. దీంతో అవి అన్ని రకాల ఆప్స్‌ను యాక్సెస్ చేయలేవు. ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న చాలా డివైజ్‌లు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ లాంటి ముఖ్యమైన సర్వీసులను సపోర్టు చేయడం లేదు. ఆపిల్ టీవీ, గూగుల్ క్రోమ్‌కాస్ట్ లాంటివే పూర్తి స్థాయిలో ఆప్స్‌ను సపోర్టు చేస్తున్నాయి. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, హాట్‌స్టార్... ఇప్పుడు ఆన్‌లైన్‌లో వీడియోలు చూడాలంటే ఇవే మంచి ఆప్షన్లు. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లలోని వీడియోలనే కాదు, 4కె రిజల్యూషన్ వీడియోలనూ వీక్షించొచ్చు. ఇది సాధారణమైన సెట్ టాప్ బాక్స్‌లా ఉంటుంది. దీనికి పెన్‌డ్రైవ్ జోడించి అందులోని వీడియోలనూ టీవీలో చూడొచ్చు. ఇది ఎల్ఈడీ, ఎల్‌సీడీ మోనిటర్లకే కాదు పాత తరం సీఆర్‌టీ మోనిటర్లకు కూడా పని చేస్తుంది.

కంప్యూటరే చేయొచ్చు

టీవీని ఏకంగా చిన్నసైజు కంప్యూటర్‌గా కూడా చేసేయొచ్చు. దీని కోసం మీరు చేయాల్సిందల్లా మీ టీవీకి డివైజ్‌ను జోడించడమే. దీని ధర సుమారు రూ. మూడు వేలు. ఇది సిస్టమ్ మదర్ బోర్డు మాత్రమే. దీనికి మౌస్, కీబోర్డు, మెమొరీ కార్డు లాంటి టూల్స్ జోడించి మీ పని మొదలెట్టేయొచ్చు. వీటికి సుమారు రూ.2,600 ఖర్చవుతుంది. ఇది రాస్ప్‌బియన్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పని చేస్తుంది. దీని స్థానంలో వేరే ఓఎస్‌లను కూడా ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. వీడియో కాలింగ్ తదితర సౌకర్యాలు కావాలంటే అదనపు మాడ్యుల్స్ జోడించుకోవాలి. దీన్ని టీవీకి కేబుల్ ద్వారా కనెక్ట్ చేసి మీ టీవీని కంప్యూటర్‌గా మార్చేయొచ్చు.



కీబోర్డు మౌస్ కలిస్తే!

అక్షరాలను టైప్ చేయాలంటే కీబోర్డు, కర్సర్‌ను కదపాలంటే మౌస్... ఇన్నాళ్లూ చేస్తున్నదిదే. బ్లూటూత్ కీబోర్డును మౌస్‌లా వాడుకోవచ్చు తెలుసా? అర చేతిలో ఇమిడిపోయే ఈ కీబోర్డు మీద స్వైప్ చేసి కర్సర్‌ను ఆపరేట్ చేయొచ్చు. ఉదాహరణకు బ్రౌజర్ ఓపెన్ చేసి కీబోర్డు మీద రెండు వేళ్లతో పై నుంచి కిందకు స్వైప్ చేస్తే పేజీ స్క్రోల్ అవుతుంది. కీబోర్డు దిగువ భాగంలో ఫిజికల్ మౌస్ బటన్‌లున్నాయి. ఈ గ్యాడ్జెట్‌ను వైఫైతో సిస్టమ్‌కు కనెక్ట్ చేసుకోవాలి. ప్రస్తుతానికి విండోస్ ఆధారిత కంప్యూటర్లకు మాత్రమే ఇది పని చేస్తుంది. ఆండ్రాయిడ్ మొబైళ్లకు కూడా ఓ వెర్షన్‌ను సిద్ధం చేస్తున్నారు. దీని ధర సుమారు రూ. 4 వేలు..

ఒంపుల తెరతో జియామీ డిస్‌ప్లే

శామ్‌సంగ్ ఎస్ 7 ఎడ్జ్ ఫోన్ చూశారా... ఒంపు తిరిగిన (కర్వ్‌డ్) డిస్‌ప్లేతో కొత్తగా ఉంటుంది కదా. అదే కాదు వీవో ఎక్స్‌ప్లే 5 కూడా అలానే ఉంటుంది. ఇప్పుడు అలాంటి డిస్‌ప్లేతో మరో ఫోన్ రాబోతోంది. తన కొత్త ఫోన్‌కు జియామీ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఉండబోతోందట. దీన్ని ఎంఐ 2గా పిలుస్తారని సమాచారం. ఈ ఒంపు తిరిగిన డిస్‌ప్లేలను ఎల్‌జీ రూపొందించింది. త్వరలో మార్కెట్‌లోకి రానున్న ఈ ఫోన్లలో 5.7 అంగుళాల తాకే తెర ఉంటుంది. 6 జీబీ ర్యామ్ ఉంటుంది. స్నాప్‌డ్రాగన్ 821 క్వాడ్‌కోర్ ప్రాసెసర్ ఉంటుంది. వెనుక వైపు 13 ఎంపీ కెమెరా. ఆండ్రాయిడ్ మార్ష్‌మాలో ఓఎస్‌తో పని చేస్తుందని సమాచారం. అయితే ఈ ఫోన్ ఎప్పుడు మార్కెట్‌లోకి వస్తుందనేది తెలియాల్సి ఉంది.



చేతిని పెన్నులా మార్చేయండి



ఆఫీసు నుంచి ముఖ్యమైన వివరాలున్న ఎక్సెల్ షీట్‌ను మెయిల్ చేశారు. దాన్ని మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని చూసేశారు. అందులో కొన్ని తప్పులు కనిపించాయి. వాటిని అక్కడి కక్కడే మార్క్ చేయగలిగితే, అక్కడ ఏముండాలో రాయగలిగితే బాగుంటుంది కదా. మైక్రోసాఫ్ట్ అలాంటి సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఎక్సెల్, వర్డ్, పవర్ పాయింట్ డాక్యుమెంట్లపై మీ చేతి వేళ్లను పెన్నులా మార్చి రాసేయొచ్చు. కావల్సిన వివరాలను హైలైట్ చేయొచ్చు. ఎరేజర్ ఆప్షన్‌తో చెరిపేయొచ్చు కూడా. ఈ సదుపాయం ప్రస్తుతానికి ఆపిల్ ఫోన్ వినియోగదారులకే అందుబాటులో ఉంది. త్వరలో ఆండ్రాయిడ్ ఫోన్లలోకీ రానుంది.



హెల్త్ ట్రాకర్


ఇలా మీకు ఎప్పటికప్పుడు చెప్పే ఓ వస్తువు ఉంటే ఎంత బాగుంటుంది కదా. ఈ సమాచారమంతా మీ స్మార్ట్‌ఫోన్‌లో కనిపిస్తే ఇంకా సూపర్ కదా. హెల్త్ ట్రాకర్‌తో ఇది సాధ్యమవుతుంది. సాధారణ బరువు చూసుకునే ప్లేట్‌లా ఉండే ఈ ట్రాకర్‌లో శరీరంలో కొవ్వు శాతం, మజిల్ మాస్, శరీరంలో నీటి శాతం, గుండెకొట్టుకునే వేగం లాంటి అంశాలు కూడా తెలుస్తాయి. అంతేకాకుండా గుండెకొట్టుకున్నప్పుడు దానికి దగ్గరలో ఉన్న రక్తనాళాలు కదిలే వేగం (పీఎండబ్ల్యూ)ను ఈ ట్రాకర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఆ తర్వాత వై-ఫై సాయంతో అందులోని సమాచారాన్ని మీ మొబైల్‌లోకి తీసుకోవచ్చు. ఎప్పటికప్పుడు ఆ వివరాల్ని పరిశీలించుకొని మీ కసరత్తుల్లో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యవంతంగా ఉండొచ్చు. దీని ధర సుమారు రూ. 12,500.



సీలింగ్ ఈ-బల్బు

హాల్‌లో పైకప్పుకు ఉన్న బల్బును మీ మొబైల్‌లోని మీటతో కంట్రోల్ చేయొచ్చు. సాధారణ బల్బులను అలా చేయలేం కానీ, జియామీ రూపొందించిన ఈ బల్బులతో అది సాధ్యమవుతుంది. మొబైల్‌లోని అనుబంధ ఆప్‌తో వెలుతురు తగ్గించడం, బల్బును ఆపేయడం లాంటివి చేయొచ్చు. దీని కోసం ఓ రిమోట్‌ను కూడా అందిస్తున్నారు. ఈ బల్బు ధర సుమారు 35 డాలర్లు. ఒక్కో బల్బు 25 వేల గంటలపాటు పని చేస్తుంది. ఒక్కో బల్బులో వంద ఎల్ఈడీలు ఉంటాయి. దీంతో వెలుతురు కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇటీవల ఇది చైనాలో విడుదలైంది. మరి మన దేశానికి ఎప్పుడు వస్తుందనేది తెలియాల్సి ఉంది

హెచ్‌పీ బుల్లి ప్రింటర్



మొబైల్ ఫోన్‌లా పాకెట్‌లో ఇమిడిపోయే ప్రింటర్ గురించి విన్నారా? అదే ఇది. దీని పేరు స్ప్రాకెట్. 4.5 అంగుళాల వెడల్పు, 3 అంగుళాల పొడవున్న ఈ ప్రింటర్‌ను బ్లూటూత్‌తో మొబైల్‌కు కనెక్ట్ చేసుకోవాలి. తర్వాత మొబైల్‌లో క్లిక్‌మనిపించిన ఫొటోలను అనుబంధ ఆప్‌తో ప్రాథమికంగా ఎడిట్ చేసుకొని అక్కడి నుంచే ప్రింట్ ఇవ్వొచ్చు. అంతేకాదు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఫ్లికర్ లాంటి సామాజిక అనుసంధాన వేదికల్లోని ఫొటోలను కూడా నేరుగా ప్రింట్ తీసుకోవచ్చు. దీని ద్వారా ఒక్కో ఫొటో ప్రింట్ తీసుకోవడానికి సుమారు ఒక నిమిషం పడుతుంది. ఆన్‌లైన్ అంగడిలో సుమారు రూ. 14 వేలకు ఇది అందుబాటులో ఉంది.

మనం స్పోర్ట్స్
శుక్రవారం 9 మార్చి 2018
www.manamnews.com



బౌలర్లు అదరహో

6 వికెట్ల తేడాతో బంగ్లాపై భారత్ గెలుపు

మళ్లీ చెలరేగిన ధావన్



కొలంబో : నిదహాస్ కప్ టి 20 ట్రై సిరీస్ టోర్నీలో భారత్ తొలి విజయం సాధించింది. మొదటి మ్యాచ్‌లో శ్రీలంకతో చేతిలో ఓడి న భారత్ రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఆరు వికెట్ల తేడాతో ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా జట్టు 20 ఓవర్లలో చేసిన 139 రన్స్ చేసింది. తర్వాత 140 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు సునాయాసంగా ఛేదించింది. కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నిరాశపరుస్తూ 17 పరుగులు చేసి అవుటవగా, ఆ తర్వాత రిషబ్ పంత్ ఏడు రన్స్‌కు అవుటవడంతో ఆరంభంలోనే భారత్ రెండు వికెట్లు నష్టపోయింది. తొలి మ్యాచ్‌లో చెలరేగి ఆడిన ధావన్ ఈ మ్యాచ్‌లోనూ దుమ్ము రేపాడు. రైనాతో కలసి స్కోరుబోర్డును పరుగులెత్తించాడు. ఇద్దరూ కలసి మూడో వికెట్‌కు 68 రన్స్ పార్ట్‌నర్‌షిప్ జోడించారు. లంక బౌలర్లపై తొలి మ్యాచ్‌లో విరుచుకుపడ్డ ధావన్ అదేరీతిలో ఈ మ్యాచ్‌లోనూ ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. భారత జట్టును విజయానికి చేరువగా తీసుకొచ్చిన ధావన్ 43 బంతుల్లో 5 ఫోర్లు 2 సిక్స్‌లతో 55 రన్స్ చేసి అవుటయ్యాడు. ఆ తర్వాత మనీష్ పాండే- కార్తీక్‌లు కలసి మ్యాచ్‌ను ముగించారు.

రాణించిన బౌలర్లు

టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్ ఈ మ్యాచ్‌లో తమిళనాడు బౌలర్ విజయ్, వాషింగ్టన్ సుందర్‌లతో బరిలోకి దిగడం మంచి ఫలితాన్నిచ్చింది. ఫీల్డర్లు నిరుత్సాహ పరిచినా బౌలర్లు లైన్ అండ్‌లెంగ్త్‌తో కట్టుదిట్టంగా బంతులేసి బంగాన్ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. ఫలితంగా స్లో పిచ్‌పై పరుగులు చేయటానికి బంగ్లా బ్యాట్స్‌మెన్ తంటాలు పడ్డారు. ఉనత్కద్ (3/38), శంకర్ (2/32)లు బంగ్లా బ్యాట్స్‌మెన్ వెన్నువిరిచారు. ఇద్దరితో పాటు చాహల్, ఠాకూర్‌లు ఒక్కో వికెట్ పడగొట్టి బంగ్లా జట్టు భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. 11 ఓవర్లలోపే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లు నష్టపోయిన బంగ్లాదేశ్‌ను మిడిల్ ఆర్డర్‌లో లిటన్ దాస్ ఆదుకున్నాడు. 30 బంతులాడిన దాస్ మూడు ఫోర్లతో 34 పరుగులు చేసి ఆదుకున్నాడు. 107 రన్స్ వద్ద దాస్ చాహల్ బౌలింగ్‌లో అవుటయ్యాక షబ్బీర్ అలి మిడిలార్డర్‌లో ధాటిగా ఆడాడు. మూడు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టి 26 బాల్స్‌లో 30 రన్స్ చేసి బంగ్లా పరువు నిలబెట్టాడు. ఆ తర్వాత బంగ్లా ఆటగాళ్లు పరుగులు చేయటానికి చెమటోడ్చారు. వెంటవెంటనే వికెట్లు నష్టపోయి చివరికి 20 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 139 రన్స్ చేసింది.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమిమ్ ఇక్బాల్ (సి) ఉనద్కత్ (బి) ఠాకూర్ 15, సౌమ్య సర్కార్ (సి) చాహల్ (బి) ఉనద్కత్ 14, లిటన్ దాస్ (సి) రైనా (బి) చాహల్ 34, రహీమ్ (సి) కార్తీక్ (బి) శంకర్ 18, మహ్మదుల్లా (సి) ఠాకూర్ (బి) శంకర్ 1, షబ్బీర్ రెహ్మాన్ (సి) కార్తీక్ (బి) ఉనద్కత్ 30, హసన్ మిరాజ్ (సి) పాండే (బి) ఉనద్కత్ 3, తస్కిన్ అహ్మద్ (నాటౌట్)8, రుబెల్ హుస్సేన్ (రనౌట్) 0, ముస్తాఫిజుర్ రెహ్మాన్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 15, **మొత్తం: 20 ఓవర్లలో 139/8.** వికెట్ల పతనం : 1-20, 2-35, 3-66, 4-72. 5-107, 6-118, 7-134, 8-135. బౌలింగ్: ఉనద్కత్ 4-0-38-3, సుందర్ 4-0-23-0, ఠాకూర్ 4-0-25-1, చాహల్ 4-0-19-1, శంకర్ 4-0-32-2.

భారత ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి) రెహ్మాన్17, ధావన్ (సి) లింటన్ దాస్ (బి) తస్కిన్ అహ్మద్ 55, పంత్(బి) రుబెల్ హుస్సేన్ 7, రైనా (సి) హసన్ మిర్జా (బి) రుబెల్ హుస్సేన్ 28, మనీష్ పాండే 27, (నాటౌట్), దినేశ్ కార్తీక్ (నాటౌట్) 2, **మొత్తం: 18.4 ఓవర్లలో 140/4.** వికెట్ల పతనం 1-28, 2-40, 3-108,4-123, బౌలింగ్ : రెహ్మాన్ 4-0-31-1, తస్కిన్ అహ్మద్ 3-0-28-1, రుబెల్ హుస్సేన్ 3.4-0-24-2,హసన్ మిర్జా 4-0-21-0, సౌమ్య సర్కార్ 1-0-8-0, మహ్మదుల్లా 1-0-11-0, నజ్ముల్ ఇస్లామ్ 2-0-15-0.

డికాక్‌కు జరిమానా

డర్బన్: సౌతాఫ్రికా ఆటగాడు క్వింటన్ డికాక్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. డర్బన్ టెస్ట్ సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు డేవిడ్ వార్నర్- డికాక్‌లు డ్రస్సింగ్ రూమ్‌కు వెళుతూ గొడవపడ్డారు. ఈ గొడవపై తప్పు ఒప్పుకోవడంతో వార్నర్‌కు మ్యాచ్ ఫీజులో 75 శాతం జరిమానా విధించి మూడు డిమెరిట్ పాయింట్లు ఇచ్చారు. అయితే ఈ వివాదంలో డికాక్ దీ కూడా తప్పుందని ఐసిసి విచారణ కమిటీ తేల్చింది. డికాక్ ప్రమేయంపై విచారణ పూర్తి చేశాక మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది.

షరపోవాకు షాక్



ఇండియానా వెల్స్ : మూడేళ్ల విరామం తర్వాత మళ్లీ పారిబస్ ఓపెన్ టోర్నీలో అడుగుపెట్టిన ఒకప్పటి చాంపియన్ మారియా షరపోవాకు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. జపాన్‌కు చెందిన నయోమి ఒసాకా 6-4, 6-4 తేడాతో షరపోవాను చిత్తుచేసింది.

ముచ్చటగా మూడో సారి

విటోరీపై ఐసీసీ సస్పెన్షన్ వేటు



న్యూఢిల్లీ : జింబాబ్వే పేస్ బౌలర్ బ్రియాన్ విటోరిని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ మరో సారి సస్పెండ్ చేసింది. విటోరీ బౌలింగ్ యాక్షన్ సరిగా లేనందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. విటోరిని సస్పెండ్ చేయటం ఇది మూడో సారి. బౌలింగ్ యాక్షన్ సరిగా లేకపోవడంతో విటోరిని 2016లో రెండు సార్లు ఐసిసి సస్పెండ్ చేసింది. తాజాగా స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ పోటీల్లో విటోరి బౌలింగ్ సరిగా లేదని నిర్వాహక ప్యానెల్ నిర్ధారించడం తో ఐసిసి ఈ సస్పెన్షన్ నిర్ణయం తీసు కుంది. 28 ఏళ్ల విటోరీ బౌలింగ్‌ను గత ఆదివారం నేపాల్‌తో జరిగిన ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఐసిసి అధికారులు పరిశీలించారు. ఇప్పటి దాకా 24 వన్డేలు, 11 టి20లు ఆడిన విటోరి 2016లో రెండు సార్లు 12 నెలల పాటు సస్పెన్షన్‌కు గురయ్యాడు.

విరాట్‌ను తీసుకుందామంటే

ధోనీ వద్దన్నాడు

అందుకే సెలెక్టర్ పదవి పోయింది: వెంగ్‌సర్కార్



ముంబై : టీమిండియా మాజీ కెప్టెన్, మాజీ చీఫ్ సెలెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్ చేసిన వ్యాఖ్యలు భారత క్రికెట్‌లో సంచలన మయ్యాయి. 2008లో తమిళనాడుకు చెందిన బద్రినాథ్‌ను కాదని విరాట్ కోహ్లీని జట్టులోకి తీసుకున్నందు తన చీఫ సెలెక్టర్ పదవి ఊడిందని వెంగ్‌సర్కార్ వెల్లడించాడు. ఆ సమయంలో బీసీసీఐ ట్రజరర్‌గా ఉన్న శ్రీనివాసన్‌కు తాను తీసుకున్న నిర్ణయం నచ్చలేదని చెప్పాడు. '2008లో టీమిండియా జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లాలి, అండర్-23లో ఆడే ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవాలని సెలెక్షన్ కమిటీ నిర్ణయించింది. అదే ఏడాది కోహ్లీ కెప్టెన్సీలో భారత అండర్ -19 జట్టు ప్రపంచ కప్ గెలుచుకుంది, ఓ మ్యాచ్‌లో కోహ్లీ 123 పరుగులు చేశాడు. దీంతో లంక టూర్‌లో కోహ్లీని ఎంపిక చేయాలనుకున్నా, మిగతా సెలెక్టర్లూ అంగీకరించారు, అయితే అప్పటి కోచ్ కిర్‌స్టెన్, కెప్టెన్ ధోనీలు మాత్రం ఒప్పుకోలేదు' అని వెంగ్‌సర్కార్ ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో వెల్లడించాడు. కిర్‌స్టెన్, ధోనీలతో పాటు బీసీసీఐ ట్రజరర్ శ్రీనివాసన్‌కూ తన సెలెక్షన్ నచ్చలేదని చెప్పాడు. కోహ్లీకి జట్టులో చోటు కల్పిస్తే చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు బద్రీనాథ్‌పై వేటుపడుందని వారి భయమనుకుంటానని వెంగ్‌సర్కార్ వివరించాడు. చెన్నయ్ సూపర్ కింగ్స్ జట్టు శ్రీనివాసన్‌దేనని అందుకే తన నిర్ణయాన్ని వ్యతిరేకించి ఉండవచ్చని చెప్పాడు. 'బద్రీనాథ్‌ను ఎందుకు తప్పించాల నుకుంటున్నావ్' అని శ్రీనివాసన్ తనను అడిగాడని, ఆస్ట్రేలియా టూర్‌లో విరాట్ ఆటతీరు బాగుందని, అందుకే జట్టులోకి తీసుకోవాలనుకుంటు న్నానని తాను చెప్పినా శ్రీనివాస్ వినలేదని అన్నాడు. ఏమైందో ఏమో తనకు తెలియదని, ఆ మర్నాడే శ్రీకాంత్‌ను సెలెక్టర్‌గా నియ మించారని చీఫ్ సెలెక్టర్‌గా తన టైమ్ అయిపోయిందని చెప్పారని వెంగ్‌సర్కార్ వివరించాడు. ప్రస్తుతం భారత జట్టులో కోహ్లీ, ధోనీ మంచి ఫ్రెండ్స్. సీనియర్‌గా ధోనీ నుంచి కోహ్లీ దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ సలహాలు తీసుకుంటాడు. అయితే ఒకప్పుడు కోహ్లీని జట్టులోకి తీసుం దామంటే ధోనీ ఒప్పుకోక పోవటం, అదీ అప్పటి చీఫ్ సెలెక్టర్ వెంగ్‌సర్కార్ ఈ విషయం చెప్పటం ఆశ్చర్యమే.



నిలవాలంటే గెలవాలి

అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీ • ఐర్లాండ్‌తో భారత్ కీలక పోరు నేడు



ఇపో (మలేసియా): అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు ఐర్లాండ్‌తో కీలక మ్యాచ్‌ను శుక్రవారం ఆడుతుంది. మొదటి మూడు మ్యాచ్‌ల్లో చెత్తగా ఆడి అభిమానులను నిరుత్సాహపరిచిన భారత జట్టు బుధవారం మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో5-1 గోల్స్‌తో భారీ విజయం సాధించి ఫైనల్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. తొలి మ్యాచ్‌లో ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనా చేతిలో 2-3 గోల్స్‌తో పరాజయం పాలైన భారత్, ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 2-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇక ఈ టోర్నీలో ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో ఫైనల్ చేరుకుంది. ఇక ఐర్లాండ్ మినహా ఈ టోర్నీలో ఆడుతున్న మిగతా నాలుగు జట్లకు ఫైనల్ చేరే అవకాశాలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, అర్జెంటీనా ఏడు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మలేసియా (6), ఇంగ్లండ్ (5), ఇండియా (4) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వరుస ఓటములతో ఐర్లండ్ ఇప్పటికే టోర్నీ ఫైనల్ రేస్ నుంచి తప్పుకుంది. ఇక చివరి మ్యాచ్‌లో ఆడుతున్న భారత జట్టు ఫైనల్ చేరాలంటే చాలా సమీకణాలు కలవాల్సి ఉంది. భారీ గోల్స్ ఆధిక్యంతో ఐర్లండ్‌ను భారత్ ఓడించడంతో పాటు చివరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు అర్జెంటీనాను ఓడించాలి. ఇక ఇంగ్లండ్ - మలేసియా జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగియాల్సి ఉంటుంది. కామన్‌వెల్త్, ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్టు ఈ టోర్నీలో కుర్రాళ్లతో ప్రయోగాలు చేస్తోంది. వెటరన్ ఆటగాడు సర్దార్ సింగ్ కెప్టెన్సీలో ఈ టోర్నీలో బరిలోకి దిగిన భారత జట్టులో మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో లక్రా, గుర్జంత్ సింగ్, సుమిత్‌కుమార్, రమణదీప్ సింగ్‌లు రాణించటం భారత శిబిరంలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఐర్లండ్‌తో జరిగే చివరి మ్యాచ్‌లోనూ కుర్రాళ్లు రాణిస్తారని కోచ్ మారిజెన్ ఆశాభావంతో ఉన్నాడు.

కొరియా చేతిలో ఓటమి

దక్షిణకొరియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడుతున్న భారత మహిళల హాకీ జట్టు మూడో మ్యాచ్‌లో 1-2 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. ఈ విజయంతో భారత ఆధిక్యతను కొరియా 1-2కు తగ్గించింది. ఇంతకు ముందు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో కొరియాను భారత మహిళల జట్టు ఓడించింది. కొరియా క్రీడాకారిణి సెల్ కి చోన్ యూర్మి, లీలు తొలి అర్ధభాగంలో చేసిన గోల్స్‌తో కొరియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే 16 నిమిషంలో భారత క్రీడాకారిణి లాల్రెసిమి గోల్ చేసి కొరియా ఆధిక్యతను 2-1కి తగ్గించింది. ఈ సిరీస్‌లో ఐదో మ్యాచ్‌ను భారత జట్టు శుక్రవారం ఆడుతుంది.


రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లన్ని జైపూర్‌లోనే..



జైపూర్: స్పాట్‌ఫిక్సింగ్ కుంభకోణం ఆరోపణలతో రెండేళ్ల పాటు నిషేధానికి గురైన రాజస్థాన్ రాయల్స్ జట్టు వచ్చే సీజన్‌లో సొంత మైదానంలోనే మ్యాచ్‌లు ఆడనుంది. దీనిలో భాగంగా రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్(ఆర్‌సీఏ)తో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ ఒప్పందం కుదుర్చుకుంది. రాజస్థాన్ క్రీడల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ సమక్షంలో ఆర్‌సీఏ ప్రెసిడెంట్ సీపీ జోషి, రాజస్థాన్ రాయల్స్ ఛైర్మన్ రంజిత్ ఒప్పందంపై సంతకాలు చేశారు. అధికారిక ఒప్పందంతో ఐపీఎల్-11లో ఏడు మ్యాచ్‌లకు జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. స్టేడియంలోని పెండింగ్ పనులను మార్చి 5లోగా పూర్తి చేయాలని బీసీసీఐ గడువు విధించడంతో వాటిని వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్‌సీఏ యాజమాన్యానికి రాయల్స్ ఛైర్మన్ రంజీత్ ధన్యవాదాలు తెలిపారు. రాజస్థాన్ క్రికెట్ అభిమానులు ఇకపై తమ సొంతగడ్డపై మ్యాచ్‌లను వీక్షించే అవకాశం కలిగిందని ఆయన వివరించారు.

షమీ ఓ సారి ఆత్మహత్యాయత్నం చేశాడు

పోలీసులకు భార్య హసీన్ జహాన్ ఫిర్యాదు



న్యూఢిల్లీ : టీమిండియా పేస్ బౌలర్ షమీపై అతని భార్య హసీన్ జహాన్ ఆరోపణలు కొనసాగుతున్నాయి. షమీకి పలువురు మహిళలతో సంబంధాలున్నాయని, తనను వేధిస్తున్నారని సంచలన ఆరోపణలు చేసిన హసీన్ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ' 2012లో తొలి సారి మేమిద్దరం కలుసుకున్నాం, అంతకు ముందు షమీ బంధువులమ్మాయిని ప్రేమించాడు, పెళ్లికూడా చేసుకుందామనుకున్నాడు, అయితే ఆ పెళ్లికి అమ్మాయి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు, దీంతో షమీ ఆత్మహత్యకు ప్రయత్నించాడు' అని తెలిపింది. షమీ కోసం తానెంతో చేశానని, అన్నీ వదులుకుని వచ్చానని దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగొచ్చాక నన్ను వదిలించుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించింది. ఆస్తులు, బీమా పత్రాలు తీసేసుకున్నాడని పోలీసులకు చెప్పింది. విడాకులివ్వాలని కోరుతున్నాడని, అయితే విడాకులు ఇచ్చే ప్రసక్తే లేదని హసీన్ చెబుతోంది.

సీమా పునియాకు డోప్ టెస్ట్!



పటియాలా: భారత డిస్కస్ త్రో క్రీడాకారిణి సీమా పునియాకు నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ డోప్ టెస్ట్ నిర్వహించనుంది. పటియాలలో జరిగిన జాతీయ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో సీమా 61.05 మీటర్లతో స్వర్ణ పతకం సాధించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొనబోయే ముందు సీమాకు డోప్ టెస్ట్ నిర్వహించాలని నాడా నిర్ణయించింది. ఈ టెస్ట్ కోసం నేషనల్ యాంటి డోపింగ్ ఏజెన్సీ అధికారులు పటియాల వెళ్లారు. అయితే అప్పటికే అక్కడి నుంచి సీమా వెళ్లిపోవటంతో సోనిపట్ వెళ్లారు. గోల్డ్ కోస్ట్‌లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో 59.00 మీటర్ల దూరంతో స్వర్ణం సాధించిందిన సీమ పునియా 2006 నుంచి కామన్‌వె ల్త్ క్రీడల్లో పాల్గొంటున్న భారత జట్టు సభ్యురాలు. 2006లో రజత, 2010లో, 2014 గ్లాస్గో పోటీల్లో సీమ కాంస్య పతకాలు సాధించింది. ఇక గోల్డ్ కోస్ట్ పోటీల్లో పాల్గొనే అథ్లెట్లకు డోప్ టెస్ట్‌లుండకపోవచ్చని నాడా అధికారులు తెలిపారు. జాతీయ చాంపియన్‌షిప్‌లో ఆడి పతకాలు గెలుచుకున అథ్లెట్లంతా తమ శాంపిళ్లను నాడా అధికారులకు ఇప్పటికే అందచేశారు.ఇక కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత బృందాన్ని భారత అథ్లెటిక్ సంఘం శుక్రవారం ప్రకటించనుంది.

జీతాల పెంపు పద్ధతిగా లేదు

బీసీసీఐ యాక్టింగ్ కార్యదర్శి అమితాబ్ చౌదరి



ముంబై : కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా భారత క్రికెటర్లకు భారీగా పెంచిన కొత్త జీతాల కాంట్రాక్టులపై వివాదం మొదలైంది. సుప్రీం కోర్టు నియమించిన నిర్వాహక కమిటీ సూచనల మేరకు కొత్త కాంట్రాక్టులను బీసీసీఐ ప్రకటించింది. అయితే ఈ విధానం సరిగా లేదని బీసీసీఐ యాక్టింగ్ కార్యదర్శి అమితాబ్ చౌదరి అసంతృప్తి వ్యక్తం చేశాడు. సుప్రీం కోర్టు నిబంధనలను నిర్వాహక కమిటీ ఉల్లంఘించిందని ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఆటగాళ్ల గ్రేడింగ్ విధానం విషయంలో, తనతో పాటు ఆఫీస్ బేరర్లను ఎవరూ సంప్రదించలేదన్నాడు. మొత్తం 26 మంది ఆటగాళ్లను కొత్త కాంట్రాక్టు పరిధిలోకి తీసుకొచ్చిన బీసీసీఐ కొత్తగా ఏప్లస్ కేటగిరిని చేర్చింది. ఈ 26 మంది ఆటగాళ్లను ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిందని సెలెక్షన్ ప్యానెల్‌కు కన్వీనర్‌గా ఉన్నప్పటికీ తనకు కూడా ఆజాబితాను చూపెట్టలేదన్నాడు. ' నిర్ణయాలు తీసుకునే విషయంలో నన్ను భాగస్వామిని చేయలేదు' అని చౌదరి అన్నారు. తనతో పాటు బీసీసీఐ సభ్యులెవర్నీ కనీసం సంప్రదించలేదన్నాడు.

ఇదేనా ధోనీకి ఇచ్చే గౌరవం

ఇక కొత్త కాంట్రాక్టుల్లో ధోనికి అన్యాయం జరిగిందని అభిమానులు కూడా ఆగ్రహంతో ఉన్నారు. ధోనిని డిమోట్ చేయటం అభిమానులకు మింగుడు పడటం లేదు. ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. యువ పేస్ బౌలర్ బూమ్రాకు ధోనీకంటే వేతనం ఎలా ఎక్కువ ఇస్తారని మండిపడుతున్నారు. కొత్తగా ఏప్లస్ గ్రేడ్ రావడంతో ధోని ఏ గ్రేడ్‌లోనే కొనసాగుతున్నాడు. బూమ్రాకు ఏడు కోట్లయితే ధోనికి దక్కేది ఐదుకోట్లే. బోర్డు చెబుతున్న లెక్కల ప్రకారం.. మూడు ఫార్మాట్లలో ఆడిన క్రికెటర్లను ఏ ప్లస్ కేటగిరిలోకి చేర్చారు. ఐసిసి టాప్ టెన్ ర్యాంకుల్లో ఉండటం రెండోది. 2014లో టెస్ట్‌లకు ధోని గుడ్‌బై చెప్పినప్పటికీ అన్ని విభాగాల్లోనూ భారత్‌కు ప్రపంచ కప్‌ను అందించాడన్న విషయం మరచిపోయిందని అభిమానులు అంటున్నారు.

ఇంత వివక్షా....

మరో వైపు బీసీసీఐ ప్రకటించిన కాంట్రాక్టుల లిస్ట్‌లో మెన్స్, ఉమెన్స్ టీమ్‌లో భారీ వ్యత్యాసాలపై అసంతృప్తి మొదలైంది. ఏ ప్లస్ కేటగిరిలో ఒకొక్కరికీ ఏడు కోట్లు చెల్లిస్తుండగా మహిళా క్రికెట్ జట్టులో ఏ కేటగిరి ప్లేయర్లకు 50 లక్షలుమాత్రమే చెల్లిస్తున్నారు. మహిళా క్రికెటర్లను ఇదోరకంగా అవమానించటమేనని మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.